సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 317

మంగళవారం 7-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

రూ.2.90 లక్షల కోట్లతో 2023-24 బడ్జెట్

- రూ.60,000 కోట్లు రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి..
- పల్లె, పట్టణ ప్రగతుల నిధులు నేరుగా పంచాయతీలకే
- రూ.6,380 కోట్లు రుణమాఫీకి.. రూ.90 వేల వరకు మాఫీ అయ్యే చాన్స్..
- రూ.15,075 కోట్లు రైతుబంధుకు..
- రూ.1,589 కోట్లు రైతుబీమాకు..
- రూ.12,000 కోట్లు విద్యుత్ సబ్సిడీకి..
- రూ.26,885 కోట్లు నీటి పారుదలకు..
- రూ.17,700 కోట్లు దళితబంధుకు..
- రూ.200 కోట్లు కొత్తగా న్యూట్రిషన్ కిట్ల కోసం

రూ.10,348 కోట్లు ప్రత్యేక అభివృద్ధి నిధి ఏర్పాటు

సీఎం విచక్షణాధికారంతో నిధుల కేటాయింపునకు అవకాశం



ఎలక్షన్ టైమ్.. బడ్జెట్ లైన్

..కేరాఫ్ ఊరు



2023-24 బడ్జెట్ అంచనాలివే

మొత్తం బడ్జెట్	2,90,396.00
రెవెన్యూ రాబడి	2,16,566.97
రెవెన్యూ వ్యయం	2,11,685.23
రెవెన్యూ మిగులు	4,881.74
పన్ను రాబడి	1,31,028.65
పన్నేతర రాబడి	22,808.31
కేంద్ర పన్నుల్లో వాటా	21,470.84
గ్రాంట్ ఇన్ ఎయిడ్	41,259.17
రుణాలు	40,615
మూలధన వ్యయం	37,524.70
ద్రవ్యలోటు	38,234.94

(అంకెలు రూ.కోట్లలో)

మరిన్ని బడ్జెట్ కథనాలు 3,5,6,7,8 పేజీల్లో



తెలంగాణ బడ్జెట్ 2023-24

కేంద్రం కక్షగట్టినా దేశానికే ఆదర్శంగా తెలంగాణ

2023-24 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు

3లో

"రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డంకులపై అడ్డంకులు సృష్టిస్తోంది. కేంద్రం తెలంగాణపై కక్ష, వివక్ష ప్రదర్శిస్తున్నా, ఆర్థిక ఆంక్షలు విధిస్తున్నా.. సంక్షేమం, అభివృద్ధిలో వెనుకంజ వేయకుండా దూసుకుపోతూ తాను ఎదగటమే కాకుండా 'తెలంగాణ మోడల్'ను రాష్ట్రం దేశం ముందుంచింది. 'తెలంగాణ ఆచరిస్తుంది..దేశం అనుసరిస్తుంది' అన్న భావనను తీసుకొచ్చింది. నాడు కరువు కాటకాలతో అలమటించిన తెలంగాణ.. నేడు ప్రభుత్వ అసాధారణ కృషితో సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవతరించింది. ఈ అపూర్వ, అద్భుత పరివర్తనకు ముఖ్యమంత్రి కేసీఆరే కర్త కర్మ క్రియగా నిలిచారు.."

సాక్షి, హైదరాబాద్

వ్యవ'సాయమే' ఎజెండా.. పల్లెల అభివృద్ధి, నిధుల వ్యయంలో స్వయం ప్రతిపత్తే ధ్యేయం.. ఎన్నికల ఏడాదిలో క్షేత్రస్థాయి కేటాయింపులకు ప్రాధాన్యం, పల్లె, పట్టణ ప్రగతుల నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే బదిలీ చేసేందుకు అవకాశం.. సంక్షేమ పథకాలు యథాతథం.. విద్యుత్ సబ్సిడీలకు నిధుల పెంపు.. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై స్పష్టత.. మొత్తం మీద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.2,90,396 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌లో ఈ రెండు శాఖలకు కలిపి ఏకంగా రూ.60 వేల కోట్ల వరకు కేటాయించింది. ఇక బీఆర్‌ఎస్ మార్కు సంక్షేమ పథకాలైన రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలకు నిధులను ఆశించిన మేరకు పెంచింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధితో పాటు సొంత పన్నుల ఆదాయాన్ని ఆసరాగా చేసుకుని, కేంద్రంపై ఆశలు వదులుకోకుండానే, రుణాలను పెద్దగా పెంచకుండానే, ఆర్థికాభివృద్ధికి సూచిక అయిన మూలధన వ్యయానికి 40 శాతం మేరకు నిధులు పెంచింది. ఈ మేరకు బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ.5 కోట్ల అభివృద్ధి నిధులను కేటాయిస్తూనే, సీఎం విచక్షణ మేరకు నిధులు మంజూరు చేసేందుకు రూ.10 వేల కోట్లకు పైగా నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద చూపెట్టడం ఈ బడ్జెట్‌లోనే హైలైట్‌గా చెప్పుకోవచ్చు.

రహదారుల నిర్వహణ, మరమ్మతులకు నిధులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రహదారులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. రహదారుల నిర్మాణానికి కేటాయించే నిధులకు అదనంగా మున్సిపాలిటీలకు రూ.2,500 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.2,000 కోట్లను ప్రతిపాదించింది. వీటితో పాటు ఆర్‌అండ్‌బీ శాఖకు (బీటీ రెన్యువల్స్) అదనంగా మరో రూ.2,500 కోట్లను ప్రతిపాదించింది. పల్లె ప్రగతి కింద రూ.3,360 కోట్లు, పట్టణ ప్రగతి కింద రూ.1,474 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకే ఇవ్వనుంది. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ నిధులు వెచ్చించామని, అయినా ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదనే స్థానిక ప్రజాప్రతినిధుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని

మిగతా 5వ పేజీలో ▶

మరిన్ని కేటాయింపులు

- గృహాలకు రూ.12,000 కోట్లు
- గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల నిధులకు గ్రీన్‌చానల్.. నేరుగా రూ.4,700 కోట్ల నిధులు
- రూ.5,600 కోట్లు దాటిన ఫీజుల పథకం
- రహదారుల నిర్వహణ, మరమ్మతులకు రూ.4,500 కోట్లు
- ఉచిత బియ్యానికి రూ.3 వేల కోట్లు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ.5 కోట్ల అభివృద్ధి నిధులు

కొంచెం.. కొంచెం..

- మూలధన వ్యయానికి 40శాతం మేర
- షాదీముబారక్, కల్యాణలక్ష్మికి రూ.460 కోట్లు
- రైతుబంధు, రైతు బీమా, పల్లె, పట్టణ ప్రగతికి.. ఆసరా పింఛన్లకు
- విద్య, వైద్య రంగాలకు కూడా...
- సాగునీటికీ అరకొరగా పెంపు

ఎన్నికల స్టంట్..



రాష్ట్ర బడ్జెట్ అంతా డొల్ల. ఇది ఎలక్షన్ స్టంట్‌ను తలపిస్తోంది. శుష్క వాగ్దానాలు-శూన్య హస్తాలు, ఆత్మస్తుతి-పరనింద మాదిరి కేసీఆర్ ప్రభుత్వాన్ని పొగడటం.. కేంద్రాన్ని తిట్టడం తప్ప ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ సహా అన్ని వర్గాలను పూర్తిగా వంచించేలా బడ్జెట్‌ను రూపొందించారు.

– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

అంకెల గారడీ..



రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు అంకెలగారడీ, మాయమాటలతో మేడిపండు మాదిరిగా రంగుల మెగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. 50 శాతం జనాభా కలిగిన బీసీలకు బడ్జెట్ కేటాయింపులో కనీస ప్రాధాన్యమివ్వలేదు. బీసీ, గిరిజన బంధు హామీ, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో మాటలేదు.

– సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు

- పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం.. 3-4 లక్షల ఉద్యోగాల సృష్టి
- రెండు వారాల్లో రూ.3వేల కోట్ల పెట్టుబడుల ప్రకటన రానుంది
- రాష్ట్రంలో నాలుగు ఈవీ మెగా క్లస్టర్ల అభివృద్ధి
- తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మొబిలిటీ వ్యాలీ (టీఎంవీ) ద్వారా రానున్న ఐదేళ్లలో రూ.50వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఈ రంగంలో పెట్టుబడులతో రాష్ట్రంలో నాలుగు లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించవచ్చని చెప్పారు. హైదరాబాద్ ఈ-మొబిలిటీ వీక్‌లో భాగంగా తెలంగాణ మొబిలిటీ ఫోకస్డ్ క్లస్టర్, తెలంగాణ మొబిలిటీ వ్యాలీలను ఏర్పాటు చేస్తున్నట్టు సోమవారమిక్కడ ప్రకటించారు. టీఎంవీ.. ఉత్తమ మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, దేశంలో తయారీని ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే, ఆర్ అండ్ డీలో తెలంగాణను అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'టీఎంవీలో ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల నాలుగు మెగా క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. వీటిలో జహీరాబాద్‌లో ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, సీతారాంపూర్‌లో ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, దివిటిపల్లిలో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ క్లస్టర్, యెంకతల వద్ద

మిగతా 16వ పేజీలో ▶

వృద్ధికి ద్రవ్యోల్బణం దెబ్బ!

- 2022-23లో క్షీణించనున్న జాతీయ, రాష్ట్ర వృద్ధిరేటు
- 2021-22లో జీఎస్డీపీ వృద్ధిరేటు 19.4%..
- 2022-23లో 15.6 శాతానికి తగ్గుతుందన్న సర్కారు
- రాష్ట్ర సామాజిక-ఆర్థిక సర్వే నివేదికలో అంచనాలు

5లో

టీచర్ల బదిలీలకు బ్రేక్

- నేడు ఇవ్వాల్సిన బదిలీ జాబితా నిలిపివేత
- కోర్టు తీర్పు మేరకు షెడ్యూల్ రద్దు
- 25 వేల మంది బదిలీ కష్టమే
- సాఫ్ట్‌వేర్‌లో మార్పులు... రీ షెడ్యూల్‌కు 2 నెలలు

16లో



భూ విలయం

వణికిన టర్కీ, సిరియా సరిహద్దులు

2,600 మందికి పైగా దుర్మరణం

7.8 తీవ్రతతో కంపించిన భూమి

- తెల్లవారుజాము కావడంతో భారీగా నష్టం
- కొద్ది గంటల్లోనే 7.6తో మరో రెండు..
- తర్వాత పదుల్లో శక్తిమంతమైన ప్రకంపనలు

- లెబనాన్ నుంచి ఈజిప్టు దాకా ప్రభావం
- టర్కీలో 1,600, సిరియాలో 900 పైగా మరణాలు
- మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం
- మోదీ దిగ్భ్రాంతి
- భారత్ ఆపన్న హస్తం
- వైద్య, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

కాళ్ల కింద నేల కంపించిపోయింది. కళ్లెదుటే నిలువెత్తు భవనాలు మట్టిదిబ్బల్లా మారిపోయాయి. ఎక్కడ చూసినా శిథిలాలు.. వాటి కింద చిక్కుకున్న బాధితుల ఆర్తనాదాలు.. వరుస భూప్రకంపనలతో టర్కీ, సిరియా చిగురుటాకుల్లా వణికిపోయాయి. తొలుత సోమవారం తెల్లవారుజామున సరిహద్దు సమీపంలో 7.8 తీవ్రతతో విరుచుకుపడ్డ భారీ భూకంపం ఇరు దేశాల్లో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టానికి దారితీసింది. తర్వాత కొద్ది గంటల్లోనే 7.6 తీవ్రతతో ఒకసారి, అనంతరం పదుల కొద్దీ శక్తిమంతమైన ప్రకంపనలు మధ్యప్రాచ్యాన్ని వణికించాయి. ఇప్పటిదాకా టర్కీ, సిరియాలలో 2,600 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు. సిరియాలో పరిస్థితి మరింత భీతావహంగా మారింది. కనీస వైద్య సౌకర్యాల్లేక బాధితులు అల్లాడుతున్నారు. అక్కడి ఆస్పత్రులన్నీ క్షతగాత్రులతో నిండిపోయి కన్పిస్తున్నాయి.

- వివరాలు 12లో




'ఎర' కేసు సీబీఐకే..

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

క్రిమినల్ అంశాల విచారణలో అప్పీల్‌ను స్వీకరించలేం

- దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిందే..
- హైకోర్టు సీజే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు
- రాష్ట్ర ప్రభుత్వం, ఇతరుల అప్పీళ్ల కొట్టివేత.. తీర్పు అమలుపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసును సీబీఐకి అప్పగించే అంశంలో ప్రభుత్వం, సిట్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఇతరులు చేసుకున్న అప్పీళ్లను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. ఇది సాధారణ కేసే అయినా విచారణ, తీర్పు వెల్లడి అంతా క్రిమినల్ అంశాల ప్రకారమే సాగినందున.. అప్పీళ్లను అనుమతించలేమని, దీనిపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ''సింగిల్ జడ్జి ఉత్తర్వులపై రిలీఫ్ కోరుతూ సమర్పించిన రాతపూర్వక వాదనలను ఉమ్మడిగా పరిశీలించాక ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించాకే

మిగతా 2వ పేజీలో ▶

సుప్రీంకు రాష్ట్ర సర్కారు

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో అప్పీళ్లను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అడ్వొకేట్ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో పిటిషన్ వేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

వచ్చేది మా సర్కారే..

- మేడారం నుంచి మొదలైన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ దబ్బును నమ్ముకున్నారు.. కాంగ్రెస్ జనబలాన్ని నమ్ముకుంది
- అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రధాని మోదీ విశ్వప్రయత్నాలు



రేవంత్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు. చిత్రంలో ఎమ్మెల్యే సీతక్క

ములుగు: 'రాసుకోండి.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గత 75 ఏళ్లలో ఏ నేత చేయనివిధంగా రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల్లో జోష్ నింపారని' పేర్కొన్నారు. అధికారం, ఆధిపత్యం చెలాయిస్తున్న సీఎం కేసీఆర్‌ను తుంగలో తొక్కడానికే మేడారం జంపన్నవాగు నీళ్లు తాగి, వీరవనితలైన సమ్మక్క-సారలమ్మల పోరాటగడ్డ నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర మొదలుపెట్టామని అన్నారు. సోమవారం ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకున్న అనంతరం రేవంత్ పాదయాత్ర మొదలుపెట్టారు. ప్రాజెక్టు నగర్ మీదుగా

మిగతా 2వ పేజీలో ▶



జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేయిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యాయమూర్తుల ప్రమాణం -12లో



వీళ్లతో ఓటేయించుకోవాలంటే మనకు ఎన్ని కోట్లు కావాలో!?



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 317


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మంగళవారం 7-2-2023

రూ.2.90 లక్షల కోట్లతో 2023-24 బడ్జెట్

- రూ.60,000 కోట్లు రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి..
- పల్లె, పట్టణ ప్రగతుల నిధులు నేరుగా పంచాయతీలకే
- రూ.6,380 కోట్లు రుణమాఫీకి..
- రూ.90 వేల వరకు మాఫీ అయ్యే చాన్స్..
- రూ.15,075 కోట్లు రైతుబంధుకు..
- రూ.1,589 కోట్లు రైతుబీమాకు..
- రూ.12,000 కోట్లు విద్యుత్ సబ్సిడీకి..
- రూ.26,885 కోట్లు నీటి పారుదలకు..
- రూ.17,700 కోట్లు దళితబంధుకు..
- రూ.200 కోట్లు కొత్తగా న్యూట్రిషన్ కిట్ల కోసం

రూ.10,348 కోట్లు ప్రత్యేక అభివృద్ధి నిధి ఏర్పాటు
సీఎం విచక్షణాధికారంతో నిధుల కేటాయింపునకు అవకాశం



ఎలక్షన్ టైమ్.. బడ్జెట్ లైన్

..కేరాఫ్ ఊరు



2023-24 బడ్జెట్ అంచనాలివే

మొత్తం బడ్జెట్	2,90,396.00
రెవెన్యూ రాబడి	2,16,566.97
రెవెన్యూ వ్యయం	2,11,685.23
రెవెన్యూ మిగులు	4,881.74
పన్ను రాబడి	1,31,028.65
పన్నేతర రాబడి	22,808.31
కేంద్ర పన్నుల్లో వాటా	21,470.84
గ్రాంట్ ఇన్ ఎయిడ్	41,259.17
రుణాలు	40,615
మూలధన వ్యయం	37,524.70
ద్రవ్యలోటు	38,234.94

(అంకెలు రూ.కోట్లలో)

మరిన్ని బడ్జెట్ కథనాలు 3,5,6,7,8 పేజీల్లో



కేంద్రం కక్షగట్టినా దేశానికే
ఆదర్శంగా తెలంగాణ
2023-24 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు

3లో

"రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డంకులపై అడ్డంకులు సృష్టిస్తోంది. కేంద్రం తెలంగాణపై కక్ష, వివక్ష ప్రదర్శిస్తున్నా, ఆర్థిక ఆంక్షలు విధిస్తున్నా.. సంక్షేమం, అభివృద్ధిలో వెనుకంజ వేయకుండా దూసుకుపోతూ తాను ఎదగటమే కాకుండా 'తెలంగాణ మోడల్'ను రాష్ట్రం దేశం ముందుంచింది. 'తెలంగాణ ఆచరిస్తుంది..దేశం అనుసరిస్తుంది' అన్న భావనను తీసుకొచ్చింది. నాడు కరువు కాటకాలతో అలమటించిన తెలంగాణ.. నేడు ప్రభుత్వ అసాధారణ కృషితో సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవతరించింది. ఈ అపూర్వ, అద్భుత పరివర్తనకు ముఖ్యమంత్రి కేసీఆరే కర్త కర్మ క్రియగా నిలిచారు.."

సాక్షి, హైదరాబాద్

వ్యవ'సాయమే' ఎజెండా.. పల్లెల అభివృద్ధి, నిధుల వ్యయంలో స్వయం ప్రతిపత్తే ధ్యేయం.. ఎన్నికల ఏడాదిలో క్షేత్రస్థాయి కేటాయింపులకు ప్రాధాన్యం, పల్లె, పట్టణ ప్రగతుల నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే బదిలీ చేసేందుకు అవకాశం.. సంక్షేమ పథకాలు యథాతథం.. విద్యుత్ సబ్సిడీలకు నిధుల పెంపు.. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై స్పష్టత.. మొత్తం మీద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.2,90,396 కోట్ల వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌లో ఈ రెండు శాఖలకు కలిపి ఏకంగా రూ.60 వేల కోట్ల వరకు కేటాయించింది. ఇక బీఆర్‌ఎస్ మార్కు సంక్షేమ పథకాలైన రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలకు నిధులను ఆశించిన మేరకు పెంచింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధితో పాటు సొంత పన్నుల ఆదాయాన్ని ఆసరాగా చేసుకుని, కేంద్రంపై ఆశలు వదులుకోకుండానే, రుణాలను పెద్దగా పెంచకుండానే, ఆర్థికాభివృద్ధికి సూచిక అయిన మూలధన వ్యయానికి 40 శాతం మేరకు నిధులు పెంచింది. ఈ మేరకు బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ.5 కోట్ల అభివృద్ధి నిధులను కేటాయిస్తూనే, సీఎం విచక్షణ మేరకు నిధులు మంజూరు చేసేందుకు రూ.10 వేల కోట్లకు పైగా నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద చూపెట్టడం ఈ బడ్జెట్‌లోనే హైలెట్‌గా చెప్పుకోవచ్చు.

రహదారుల నిర్వహణ, మరమ్మతులకు నిధులు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రహదారులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. రహదారుల నిర్మాణానికి కేటాయించే నిధులకు అదనంగా మున్సిపాలిటీలకు రూ.2,500 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ.2,000 కోట్లను ప్రతిపాదించింది. వీటితో పాటు ఆర్‌అండ్‌బీ శాఖకు (బీటీ రెన్యువల్స్) అదనంగా మరో రూ.2,500 కోట్లను ప్రతిపాదించింది. పల్లె ప్రగతి కింద రూ.3,360 కోట్లు, పట్టణ ప్రగతి కింద రూ.1,474 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకే ఇవ్వనుంది. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం అప్పులు చేసి మరీ నిధులు వెచ్చించామని, అయినా ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదనే స్థానిక ప్రజాప్రతినిధుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని

మిగతా 5వ పేజీలో ▶

మరిన్ని కేటాయింపులు

- గృహాలకు రూ.12,000 కోట్లు
- గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల నిధులకు గ్రీన్‌చానల్.. నేరుగా రూ.4,700 కోట్ల నిధులు
- రూ.5,600 కోట్లు దాటిన ఫీజుల పథకం
- రహదారుల నిర్వహణ, మరమ్మతులకు రూ.4,500 కోట్లు
- ఉచిత బియ్యానికి రూ.3 వేల కోట్లు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ.5 కోట్ల అభివృద్ధి నిధులు

కొంచెం.. కొంచెం..

- మూలధన వ్యయానికి 40శాతం మేర
- షాదీముబారక్, కల్యాణలక్ష్మికి రూ.460 కోట్లు
- రైతుబంధు, రైతు బీమా, పల్లె, పట్టణ ప్రగతికి.. ఆసరా పింఛన్లకు
- విద్య, వైద్య రంగాలకు కూడా...
- సాగునీటికీ అరకొరగా పెంపు

ఎన్నికల స్టంట్..



రాష్ట్ర బడ్జెట్ అంతా డొల్ల. ఇది ఎలక్షన్ స్టంట్‌ను తలపిస్తోంది. శుష్క వాగ్దానాలు-శూన్య హస్తాలు, ఆత్మస్తుతి-పరనింద మాదిరి కేసీఆర్ ప్రభుత్వాన్ని పొగడటం.. కేంద్రాన్ని తిట్టడం తప్ప ఏమీ లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ సహా అన్ని వర్గాలను పూర్తిగా వంచించేలా బడ్జెట్‌ను రూపొందించారు.

– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

అంకెల గారడీ..



రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు అంకెలగారడీ, మాయమాటలతో మేడిపండు మాదిరిగా రంగుల మెగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. 50 శాతం జనాభా కలిగిన బీసీలకు బడ్జెట్ కేటాయింపులో కనీస ప్రాధాన్యమివ్వలేదు. బీసీ, గిరిజన బంధు హామీ, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో మాటేలేదు.

– సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

వృద్ధికి ద్రవ్యోల్బణం దెబ్బ!

- 2022-23లో క్షీణించనున్న జాతీయ, రాష్ట్ర వృద్ధిరేటు
- 2021-22లో జీఎస్డీపీ వృద్ధిరేటు 19.4%..
- 2022-23లో 15.6 శాతానికి తగ్గుతుందన్న సర్కారు
- రాష్ట్ర సామాజిక-ఆర్థిక సర్వే నివేదికలో అంచనాలు

5లో

టీచర్ల బదిలీలకు బ్రేక్

- నేడు ఇవ్వాల్సిన బదిలీ జాబితా నిలిపివేత
- కోర్టు తీర్పు మేరకు షెడ్యూల్ రద్దు
- 25 వేల మందికి బదిలీ కష్టమే
- సాఫ్ట్‌వేర్‌లో మార్పులు... రీ షెడ్యూల్‌కు 2 నెలలు

16లో

ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు

- పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం.. 3-4 లక్షల ఉద్యోగాల సృష్టి
- రెండు వారాల్లో రూ.3వేల కోట్ల పెట్టుబడుల ప్రకటన రానుంది
- రాష్ట్రంలో నాలుగు ఈవీ మెగా క్లస్టర్ల అభివృద్ధి
- తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మొబిలిటీ వ్యాలీ (టీఎంవీ) ద్వారా రానున్న ఐదేళ్లలో రూ.50వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఈ రంగంలో పెట్టుబడులతో రాష్ట్రంలో నాలుగు లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించవచ్చని చెప్పారు. హైదరాబాద్ ఈ-మొబిలిటీ వీక్‌లో భాగంగా తెలంగాణ మొబిలిటీ ఫోకస్డ్ క్లస్టర్, తెలంగాణ మొబిలిటీ వ్యాలీలను ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారమిక్కడ ప్రకటించారు. టీఎంవీ.. ఉత్తమ మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, దేశంలో తయారీని ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే, ఆర్ అండ్ డీలో తెలంగాణను అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'టీఎంవీలో ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల నాలుగు మెగా క్లస్టర్‌లను అభివృద్ధి చేస్తున్నాం. వీటిలో జహీరాబాద్‌లో ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, సీతారాంపూర్‌లో ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, దివిటిపల్లిలో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ క్లస్టర్, యెంకతల వద్ద

మిగతా 16వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వీళ్లతో ఓటేయించుకోవాలంటే మనకు ఎన్ని కోట్లు కావాలో!?



భూ విలయం

వణికిన టర్కీ, సిరియా సరిహద్దులు

2,600 మందికి పైగా దుర్మరణం

7.8 తీవ్రతతో కంపించిన భూమి
తెల్లవారుజాము కావడంతో భారీగా నష్టం
కొద్ది గంటల్లోనే 7.6తో మరో రెండు..
తర్వాత పదుల్లో శక్తిమంతమైన ప్రకంపనలు

- లెబనాన్ నుంచి ఈజిప్టు దాకా ప్రభావం
- టర్కీలో 1,600, సిరియాలో 900 పైగా మరణాలు
- మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం
- మోదీ దిగ్భ్రాంతి
- భారత్ ఆపన్న హస్తం
- వైద్య, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

కాళ్ల కింద నేల కంపించిపోయింది. కళ్లెదుటే నిలువెత్తు భవనాలు మట్టిదిబ్బల్లా మారిపోయాయి. ఎక్కడ చూసినా శిథిలాలు.. వాటి కింద చిక్కుకున్న బాధితుల ఆర్తనాదాలు.. వరుస భూప్రకంపనలతో టర్కీ, సిరియా చిగురుటాకుల్లా వణికిపోయాయి. తొలుత సోమవారం తెల్లవారుజామున సరిహద్దు సమీపంలో 7.8 తీవ్రతతో విరుచుకుపడ్డ భారీ భూకంపం ఇరు దేశాల్లో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టానికి దారితీసింది. తర్వాత కొద్ది గంటల్లోనే 7.6 తీవ్రతతో ఒకసారి, అనంతరం పదుల కొద్దీ శక్తిమంతమైన ప్రకంపనలు మధ్యప్రాచ్యాన్ని వణికించాయి. ఇప్పటిదాకా టర్కీ, సిరియాలలో 2,600 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు. సిరియాలో పరిస్థితి మరింత భీతావహంగా మారింది. కనీస వైద్య సౌకర్యాల్లేక బాధితులు అల్లాడుతున్నారు. అక్కడి ఆస్పత్రులన్నీ క్షతగాత్రులతో నిండిపోయి కన్పిస్తున్నాయి.

- వివరాలు 12లో




కుప్పకూలిన భవనాలతో మట్టిదిబ్బలా మారిపోయిన సిరియాలోని బెన్నిష్ పట్టణం

'ఎర' కేసు సీబీఐకే..

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ
క్రిమినల్ అంశాల విచారణలో అప్పీల్‌ను స్వీకరించలేం

- దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిందే..
- హైకోర్టు సీజే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు
- రాష్ట్ర ప్రభుత్వం, ఇతరుల అప్పీళ్ల కొట్టివేత.. తీర్పు అమలుపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసును సీబీఐకి అప్పగించే అంశంలో ప్రభుత్వం, సిట్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఇతరులు చేసుకున్న అప్పీళ్లను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. ఇది సాధారణ కేసే అయినా విచారణ, తీర్పు వెల్లడి అంతా క్రిమినల్ అంశాల ప్రకారమే సాగినందున.. అప్పీళ్లను అనుమతించలేమని, దీనిపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ''సింగిల్ జడ్జి ఉత్తర్వులపై రిలీఫ్ కోరుతూ సమర్పించిన రాతపూర్వక వాదనలను ఉమ్మడిగా పరిశీలించాక ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించాకే

మిగతా 2వ పేజీలో ▶

సుప్రీంకు రాష్ట్ర సర్కారు

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో అప్పీళ్లను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అడ్వొకేట్ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో పిటిషన్ వేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

వచ్చేది మా సర్కారే..

- మేడారం నుంచి మొదలైన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ డబ్బును నమ్ముకున్నారు.. కాంగ్రెస్ జనబలాన్ని నమ్ముకుంది
- అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రధాని మోదీ విశ్వప్రయత్నాలు



రేవంత్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు. చిత్రంలో ఎమ్మెల్యే సీతక్క

ములుగు: 'రాసుకోండి.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గత 75 ఏళ్లలో ఏ నేత చేయనివిధంగా రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ప్రజల్లో జోష్ నింపారని' పేర్కొన్నారు. అధికారం, ఆధిపత్యం చెలాయిస్తున్న సీఎం కేసీఆర్‌ను తుంగలో తొక్కడానికే మేడారం జంపన్నవాగు నీళ్లు తాగి, వీరవనితలైన సమ్మక్క-సారలమ్మల పోరాటగడ్డ నుంచి హాథ్ సే హాథ్ జోడో యాత్ర మొదలుపెట్టామని అన్నారు. సోమవారం ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకున్న అనంతరం రేవంత్ పాదయాత్ర మొదలుపెట్టారు. ప్రాజెక్టు నగర్ మీదుగా

మిగతా 2వ పేజీలో ▶



జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణం చేయిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యాయమూర్తుల ప్రమాణం -12లో

నిజంగానే 50 స్థానాల్లో పోటీ చేస్తారా..?

- ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బర్‌తో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా 50 స్థానాల్లో పోటీచేస్తారా అని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆరా తీశారు. ఈ ప్రశ్నకు దీటుగానే స్పందించిన అక్బర్ కచ్చితంగా పోటీచేస్తామని బదులిచ్చారు. ఈ ఘటన సోమవారం అసెంబ్లీ లాబీల్లో చోటుచేసుకుంది. ఆర్థికమంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సభ వాయిదా పడగా, లాబీల్లోని తమ చాంబర్లకు వెళ్లే క్రమంలో సీఎల్పీ నేత భట్టి, శ్రీధర్‌బాబు, అక్బరుద్దీన్ తారసపడ్డారు. ఈ సందర్భంగా వారి మధ్య సరదా సంభాషణ సాగింది. ప్రజాస్వామ్యయుతంగా ముందుకెళ్తున్నామని, తమను బీజేపీ బీటీం అని ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీ అరాచకాలు పెరిగిపోతున్నందున తమ వర్గానికి అండగా ఉంటామని అక్బర్ చెప్పారు. ఎవరేమనుకున్నా సరే, వచ్చే ఎన్నికల్లో తాము మాత్రం విస్తరించేందుకు ప్రయత్నిస్తామని కాంగ్రెస్ నేతలకు ఆయన స్పష్టం చేశారు.

ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదు

- వినియోగదారులు చార్జీలు చెల్లించాల్సిందే!
- తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ టి.శ్రీరంగారావు



కొత్తపల్లి (కరీంనగర్): విద్యుత్ పంపిణీ సంస్థలు వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలతో ప్రభుత్వానికి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు స్పష్టం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జిల్లా విద్యుత్ వినియోగదారులతో విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన ముఖాముఖిలో పలువురు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరంగారావు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలు మనుగడ సాధించడానికి, మెరుగైన విద్యుత్ అందించడానికి వినియోగదారులు సహకరించాలని కోరారు. ఏసీడీ చార్జీలు ఎత్తేసినట్లు తామెక్కడా ప్రకటించలేదని, ఆ చార్జీలను వినియోగదారులు తప్పక చెల్లించాల్సి ఉంటుందన్నారు. చార్జీలు విధించే ముందు వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సంస్థపై ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు సేఫ్టీ మెజర్‌మెంట్‌లు లేకుండా విద్యుత్ పనులు చేపట్టకూడదని ఆదేశించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు రూ.35 వేల కోట్లు అదనంగా వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేశామని, అదేవిధంగా గతేడాది ఏప్రిల్‌లో బహిరంగ మార్కెట్‌లో రూ.3,800 కోట్లు అదనంగా వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన విద్యుత్ అందించామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు 4,800 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. రూ.3,800 కోట్లు వెచ్చించి విద్యుత్ మౌలిక వసతులు చేపట్టామని, రూ.45 వేల కోట్లతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఆర్సీ సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బి.క్రిష్ణయ్య, సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ, ఎస్ఈ వి.గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం హామీలు అమలు చేయాలి

సిరిసిల్ల అర్బన్: అనాథలకు అన్నివిధాలా అండగా ఉండి ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఆయన సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనాథల కోసం ప్రత్యేక చట్టం తెస్తామని, స్మార్ట్‌కార్డులు అందజేస్తామని మంత్రివర్గ ఉపసంఘం తీర్మానాలు చేసి ఏళ్లు గడుస్తున్నా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములు రైతుబంధు పేరిట లక్షలు అందుకుంటున్నారని, వారికి ఇచ్చే డబ్బులను అనాథల కోసం వెచ్చించాలని కోరారు. ఈనెల 15 నుంచి అనాథల అరిగోస పేరుతో దీక్షలు చేపడతామని తెలిపారు.

జనసంద్రమైన పెద్దగట్టు

- లింగమంతుల స్వామి జాతరకు లక్షలాదిగా హాజరైన భక్తులు
- దర్శించుకున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్

సూర్యాపేట: శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో గట్టు ప్రాంతం జన సంద్రంగా మారింది. లింగమంతుల స్వామికి, చౌడమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించారు. రెండవ రోజు సోమవారం తెల్లవారుజాము మొదలుకొని రాత్రి వరకు భక్తులు పెద్దఎత్తున గట్టుకు చేరుకుని లింగమంతుల స్వామిని దర్శించుకున్నారు. సుమారు 5 లక్షల మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం భక్తులు గండదీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. వేడుకోలులో భాగంగా ప్రత్యేకంగా వండిన బోనాలపై ఉన్న మట్టిచిప్పలో ఒత్తులు వెలిగించి గుడిచుట్టూ ప్రదక్షిణలుచేసి దీపాలను స్వామి వారికి అప్పగించారు.

జాతర ప్రాశస్త్యం పెంచిన ఘనత కేసీఆర్‌దే..

పెద్దగట్టు జాతర ప్రాశస్త్యాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి లింగమంతుల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. అంచనాలకు మించి వస్తున్న భక్తులతో స్వరాష్ట్రంలో పెద్దగట్టు జాతర కన్నులపండువగా సాగుతుందని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు ఏ విధమైన ఇబ్బందులూ కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారని చెప్పారు.

అత్యంత వైభవంగా జాతర..

పెద్దగట్టు లింగమంతుల స్వామిని దర్శించుకున్న రాష్ట్ర పాడి పరిశ్రమ మత్స్య అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. జాతర అత్యంత వైభవంగా సాగుతోందని, లక్షలాది మంది భక్తులు తరలివస్తున్న జాతరలో మిషన్ భగీరథ తాగునీరు అందిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డికి యాదవ సమాజం రుణపడి ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు.

జాతరలకు పెద్దపీట..

ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల జాతర పెద్దగట్టు అని, సంస్కృతీ సాంప్రదాయాలకు, జాతరలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పెద్దగట్టులో శాశ్వత సౌకర్యాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో నిండిపోయిన పెద్దగట్టు, పరిసర ప్రాంతాలు. (ఇన్‌సెట్‌లో) లింగమంతుల స్వామిని దర్శించుకుంటున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని, జగదీశ్‌రెడ్డి

వచ్చేది మా సర్కారే..

▶ మొదటి పేజీ తరువాయి

గోవిందరావుపేట మండలం పస్రా వరకు నాయకులు, కార్యకర్తల సందోహం మధ్య యాత్ర కొనసాగింది. ప్రాజెక్టునగర్‌లో మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కేసీఆర్ డబ్బును నమ్ముకుంటే, కాంగ్రెస్ పార్టీ జనబలాన్ని నమ్ముకుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల ప్రయోజనాలను కేసీఆర్ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన, పాలకుల అసహనంతో ప్రజలు రగిలి పోతున్నారని అన్నారు. సీతక్క నా కుటుంబానికి ఎంత సన్నిహితులో రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు తెలుసు. సీతక్క సమ్మక్క–సారలమ్మల స్ఫూర్తితో ప్రజలకు నిత్యం అండగా ఉంటుందని, ఇదే విషయాన్ని పార్టీ పెద్దలతో చర్చించి మేడారం నుంచి జోడో యాత్ర ప్రారంభించాలని నిర్ణయించామన్నారు.

పెత్తందారుల కోసమే కేసీఆర్ రాజకీయం

గడిచిన ఎనిమిదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.25 లక్షల కోట్ల అప్పు చేసిందని, వాటి నుంచి నియోజకవర్గానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా.. మిగతా సొమ్ము ఎటు పోయిందో చెప్పాలని ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ 10 శాతం ఉన్న పెత్తందారులకు పెద్దపీట వేస్తూ, మిగతా 90 శాతం మందికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ దేశంలో ఎక్కడ రాజకీయం చేయాలనుకున్నా 10 శాతం పెత్తందారుల కోసమే పనిచేస్తారని జోస్యం చెప్పారు. సీఎంకు ఎన్నో అవలక్షణాలు ఉన్నాయని, అవేవీ బయటపడటం లేదన్నారు. బడ్జెట్ విలువ, కేసీఆర్ విలువ రెండూ గుండుసున్నా అని ఎద్దేవా చేశారు.



మేడారంలో సమ్మక్క గద్దెకు మొక్కుతున్న రేవంత్‌రెడ్డి

అధికారాన్ని కాపాడుకునేందుకు మోదీ..

సాయంత్రం ములుగు ఎమ్మెల్యే సీతక్క అధ్యక్షతన జరిగి పస్రా జంక్షన్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం కాంగ్రెస్ అధినేతలు ప్రాణాలివ్వగా, మోదీ మాత్రం అధికారాన్ని కాపాడుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు తన సోదరి తిలకం దిద్ది సాగనంపితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, నేడు నా సోదరి సీతక్క తిలకం దిద్ది రాచరిక పాలనను గద్దె దించాలని అడిగిందని అన్నారు. పేదలకు పట్టాభూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే కేసీఆర్‌ను రాజకీయంగా బొంద పెట్టాలన్నారు. రేవంత్ ప్రసంగం సాగుతున్న క్రమంలో సభికులు సీఎం..సీఎం.. అంటూ నినాదాలు చేశారు. సభలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్ అలీ, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళి, ఎర్రబెల్లి స్వర్ణ, కూచన రవళి, పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే నన్ను సస్పెండ్ చేయండి

- బీఆర్ఎస్ నేతలకు 'పొంగులేటి'సవాల్
- ఏ పార్టీలో చేరినా నా వాళ్లకు టికెట్ గ్యారంటీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దమ్ముంటే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ నేతలకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం దమ్మపేట మండలం నెమలిపేటలో జరిగిన అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'నా మద్దతుదారులను సస్పెండ్ చేస్తున్నారు. ఈరోజు కోసమే నేను ఎదురు చూస్తున్నాను. దమ్ము, ఖలేజా ఉంటే నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయండి' అంటూ సభా వేదిక నుంచి సవాల్ చేశారు. ''పొంగులేటికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉందా?' అని అడుగుతున్న నేతలు గత డిసెంబర్ వరకు పార్టీ సభలు, సమావేశాలకు నాకు ఎందుకు ఆహ్వానం పంపారు? ఫ్లెక్సీల్లో నా ఫొటోలు ఎందుకు ఉపయోగించారు? ఎన్నికలప్పుడు నా సాయం ఎందుకు కోరారు' అని శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఏ పార్టీలో చేరినా ఇప్పుడు నేను ప్రకటించిన అభ్యర్థులే, ఆ పార్టీ గుర్తుపై ఎన్నికల బరిలో ఉంటారు. అలా చేయగలిగే దమ్ము, ధైర్యం నాకు ఉంది' అని పేర్కొన్నారు. ఎవరో ఇబ్బంది పెట్టారని, మరెవరో పిలుస్తున్నారని తొందరపడి పార్టీ మారే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. కాగా, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నుంచి తమ బృందం అభ్యర్థి జారె ఆదినారాయణ ఉంటారని తెలిపారు. కాగా, పొంగులేటి ఆత్మీయ సభలకు వెళ్లొద్దని హెచ్చరికగా ఆదివారం పలువురిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినా సోమవారంనాటి సమావేశానికి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యతోపాటు నలభై మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మండల, జిల్లాస్థాయి నేతలు హాజరుకావడం గమనార్హం. గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.




అశ్వారావుపేట సమ్మేళనంలో నమస్కరిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యేల కొనుగోలుపై దేశవ్యాప్తంగా సీబీఐ విచారణ



సాక్షి, హైదరాబాద్ : అన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎంపీ, ఎమ్మెల్యేల కొనుగోలుపై దేశవ్యాప్తంగా సీబీఐ విచారణ జరపాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. సీఎల్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ సీబీఐకి ఎమ్మెల్యేల ఎర కేసు అప్పగింతపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. గతంలో ఈ వ్యవహారంపై సీఎల్పీ పక్షాన పోలీస్ స్టేషన్లలో పిటిషన్ ఇచ్చామని భట్టి గుర్తు చేశారు.

ఎమ్మెల్యేల ఎర కేసుపై సుప్రీం కోర్టుకు వెళ్తాం



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల ఎర కేసుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే.. మా హక్కులను కాపాడుకోవడానికి సుప్రీం కోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చెప్పారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ సీబీఐ, ఈడీ, పలు సంస్థలతో ఆ నలుగురు ఎమ్మెల్యేలను భయాందోళనకు గురయ్యేలా చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వాటికి భయపడమని, ధైర్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. బడ్జెట్ కూర్పు బాగుందని ఏ ఒక్క రంగాన్నీ విస్మరించకుండా ప్రతి శాఖకూ నిధులు కేటాయించారని కొనియాడారు. బడ్జెట్‌పై కొందరు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం చప్పట్లతో స్వాగతించకున్నా...విమర్శలు చేయకుండా సహకరిస్తే చాలు అని బాలరాజు హితవు పలికారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదుగుతూ సంక్షేమ రంగానికి పెద్దపీట వేశామని చెప్పారు.

రేవంత్‌ను ఆశీర్వదించాలి: ఠాక్రే



ములుగు/సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం నుంచి సోమవారం చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా తొలిరోజు గోవిందరావుపేట మండలం పస్రాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఆదివాసీ గడ్డమీది నుంచి పాదయాత్ర ప్రారంభించడం సంతోషకరమని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మద్దతుగా హాజరైన వారిలో కాంగ్రెస్ నేతలు మధుయాష్కీ, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే బోసు రాజు, ఉత్తరప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే నవీన్, రోహిత్ చౌదరి, చిన్నారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్ ఉన్నారు. కాగా, మద్దతు తెలిపిన అనంతరం మాణిక్‌రావు ఠాక్రే తిరుగు పయనమయ్యారు.

మాణిక్‌రావు ఠాక్రేతో వినోద్‌రెడ్డి భేటీ

హాథ్‌సే హాథ్ జోడో యాత్రతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. రేవంత్‌రెడ్డి మేడారంలో ప్రారంభించిన హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ యాత్రకు మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలని మాణిక్ రావు ఠాక్రే సూచించారు. రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లేలా ప్రణాళికాబద్ధంగా యాత్ర సాగుతున్నట్లు వినోద్‌రెడ్డి వివరించారు.

ఎఫ్ఐఆర్, ఆధారాలు | సీబీఐకి బదిలీ చేయాలి

- ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను, ఇతర ఆధారాలను వెంటనే సీబీఐకి బదిలీ చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం బదిలీ చేయకపోతే సీబీఐ వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని, సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించిందని తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ కీర్తి ప్రతిష్టలను భంగం కలిగించేలా ప్రభుత్వం ఈ కేసును తప్పుదోవ పట్టించిందని, జాతీయపార్టీ కీలక నేతలను బద్నాం చేసే ప్రయత్నం చేశారన్నారు. కోర్టులో ఉన్న అన్ని రిట్ అప్పీళ్లను న్యాయస్థానం కొట్టివేసిందని, రిట్ అప్పీల్ వేయడానికి లేదని డివిజన్ బెంచ్ స్పష్టం చేసిందన్నారు.

శ్రీరాంసాగర్ నీళ్లు కేసీఆర్ సొంత ఆస్తికాదు

- వైఎస్ షర్మిల



సాక్షిప్రతినిధి, వరంగల్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు సీఎం కేసీఆర్ తన సొంత ఆస్తి అయినట్లుగా ఫీలై మహారాష్ట్రకు అప్పనంగా అర్పించేందుకు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. 'కేసీఆర్ మీ స్వార్థ రాజకీయాల కోసం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ధారాదత్తం ఎలా చేస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ తెలంగాణ ఆస్తి. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి' అని షర్మిల డిమాండ్ చేశారు. ప్రజాప్రస్థానం పాదయాత్ర రెండురోజులుగా గ్రేటర్ వరంగల్‌లో సాగుతోంది. ఈ సందర్భంగా షర్మిల సోమవారం హనుమకొండలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్‌ను ఇలా వదిలేస్తే చార్మినార్‌సహా హైదరాబాద్‌ను అమ్ముతారని ఆరోపించారు. జై తెలంగాణ అనే దమ్ము కేసీఆర్‌కు లేదని, చుట్టుపక్కల ఎవరైనా జై తెలంగాణ అంటే మండిపడుతున్నారన్నారు. నాందేడ్‌లో రైతు ఆత్మహత్యలపై కేసీఆర్ మాటలు విడ్డూరంగా ఉన్నాయని, మహారాష్ట్ర రైతుల ఆత్మహత్యలపై మాట్లాడుతున్న కేసీఆర్‌కు తెలంగాణ రైతుల మరణాలు కనిపించడం లేదా, ఇక్కడి రైతుల చావులకు కేసీఆర్ బాధ్యుడు కాదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆ తర్వాత యాత్ర కాజీపేట, ధర్మసాగర్ మండలం మడికొండ, కరుణాపురం మీదుగా ధర్మాపురం వరకు కొనసాగింది.

షర్మిలకు ఫస్ట్‌ఎయిడ్ బాక్స్

షర్మిలకు ఫస్ట్ ఎయిడ్ బాక్సు అందజేస్తున్నట్లు కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సీఎంపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు అటాక్ చేసే అవకాశం ఉంది. డాక్టర్ దగ్గరకు పోయే వరకూ టైం పడుతది. అందుకే ముందస్తుగా ఫస్ట్ ఎయిడ్ బాక్సును షర్మిల అడ్రస్‌కు పంపుతున్న' అని తెలిపారు.

మెస్ చార్జీల పెంపుపై మంత్రుల తర్జనభర్జన

- ఆర్థికమంత్రి దృష్టికి చార్జీల పెంపు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు, వసతిగృహాల్లోని విద్యార్థుల మెస్ చార్జీల పెంపుపై సంబంధిత శాఖల మంత్రులు తర్జనభర్జన పడుతున్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల నేపథ్యంలో పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు మెస్ చార్జీల పెంపు తప్పదని నిర్ణయించిన సంక్షేమ శాఖల మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కోవిడ్ తర్వాత నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, ఈ క్రమంలో చార్జీల పెంపు ఏవిధంగా చేపట్టాలనే అంశంపై చర్చించారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు మెస్ చార్జీల పెంపుపై పలు సూచనలు చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎందృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

'పల్లెపల్లెకు బీజేపీ'లో 11 వేల బహిరంగ సభలు

సాక్షి, హైదరాబాద్: పల్లెపల్లెకు పార్టీ విస్తరణలో భాగంగా ఈనెల 10 నుంచి 25వ తేదీ దాకా 11 వేల చోట్ల బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు యాదవ్ వెల్లడించారు. పార్టీని మరింత విస్తరించి ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి చేరుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర పార్టీ నాయకత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని తెలియజేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కాసం మీడియాతో మాట్లాడుతూ 25వ తేదీ వరకు శక్తి కేంద్రాల వారీగా (3, 4 పోలింగ్ బూత్‌లు కలిపి ఒక శక్తికేంద్రం) పబ్లిక్ మీటింగ్స్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

ఎర కేసు సీబీఐకే...

▶ మొదటి పేజీ తరువాయి

తీర్పునిచ్చారు. విచారణ అంతా క్రిమినల్ చట్ట ప్రకారమే సాగింది. అందువల్ల అప్పీలును అనుమతించలేం. గతంలో రామ్ కృష్ణన్ ఫౌజి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. చార్జిషీట్ దాఖలు చేయడానికి ముందే నిందితులను దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. అందుకే సింగిల్ జడ్జి పోలీస్ దర్యాప్తును రద్దు చేసి, సీబీఐకి అప్పగించారు'' అని తీర్పులో వెల్లడించింది. కాగా తమకు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని, అప్పటివరకు సీబీఐ దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కేసును తమ పరిధిలోకి తీసుకునేందుకు సీబీఐకి అనుమతి ఇచ్చింది.

గత నెలలోనే ముగిసిన వాదనలు

'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో సిట్ దర్యాప్తును రద్దు చేసి, సీబీఐకి బదిలీ చేస్తూ గత ఏడాది డిసెంబర్ 26న సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. 'ఎమ్మెల్యేలకు ఎర' కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 63ని రద్దు చేశారు. సిట్‌గానీ, దర్యాప్తు అధికారి గానీ ఆ కేసులో ఎలాంటి చర్యలు చేపట్టవద్దని.. కేసు పూర్తి వివరాలు, ఆధారాలను సీబీఐకి అందజేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమే అయినా.. దర్యాప్తు ప్రారంభం సమయంలోనే వివరాలన్నీ బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టారు. దీనిపై ప్రభుత్వం, సిట్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఇతరులు జనవరి 4న హైకోర్టు ధర్మాసనానికి అప్పీళ్లు వేశారు. వాటిపై జనవరి 18 వరకు వాదనలు విన్న సీజే ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, నిందితుల తరఫున సీనియర్ న్యాయవాదులు డీవీ సీతారాంమూర్తి, ఎస్‌డీ సంజయ్ తివారీ, ఉదయ హోల్లా, జె.ప్రభాకర్, ఎల్.రవిచందర్ తదితరులు వాదనలు వినిపించారు.

అప్పీలును అంగీకరించాలి..

''కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సీబీఐకి కేసును బదిలీ చేయడమంటే మొత్తం కేసే అవసరం లేదన్నట్టుగా మారిపోతుంది. సీఎం విలేకరుల సమావేశం ఈ కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉందనేందుకు సింగిల్ జడ్జి కారణాలను పేర్కొనలేదు. పోలీసుల దర్యాప్తు ఏకపక్షంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తే సరిపోదు. అందుకు ఆధారాలు కూడా చూపాలి. నిందితులు సిట్ దర్యాప్తును రద్దు చేయాలని క్రిమినల్ పిటిషన్ వేయలేదు. రిట్ పిటిషన్ దాఖలు చేస్తే రాజ్యాంగంలోని 226 అధికరణ కింద అసాధారణ అధికారాలతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాబట్టి ఆ తీర్పును ఇదే హైకోర్టులోని ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉంది. క్రిమినల్ పిటిషన్‌లో తీర్పు చెప్పిన కారణంగా సుప్రీంకోర్టులోనే అప్పీల్ చేయాలన్న నిందితులు, బీజేపీ వాదనలు సరికాదు'' అని దుష్యంత్ దవే వాదనలు వినిపించారు.

అంతా చట్ట ప్రకారమే..

''కేసు దర్యాప్తు, ప్రొసీడింగ్స్ అంతా క్రిమినల్ చట్ట ప్రకారమే సాగాయి. ఈ కేసులో అప్పీల్‌ను విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. కావాలంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించాకే సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయడం లేదని సింగిల్ జడ్జి భావించారు. ఆ బాధ్యతను సీబీఐకి అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ అప్పీలును కొట్టివేయాలి''

– డీవీ సీతారాంమూర్తి



వెంకన్న దీవెనందుకుని..

ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో సోమవారం బడ్జెట్ ప్రవేశ పెట్టేముందు ఆనవాయితీగా తన ఇంటి నుంచి నేరుగా జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయానికి వచ్చారు. శ్రీవారి చెంత బడ్జెట్ ప్రతులుంచి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్ అసెంబ్లీకి బయల్దేరారు.

- బంజారాహిల్స్ (హైదరాబాద్)



ఓసారి మననం చేసుకుని...

శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు తన చాంబర్‌లో బడ్జెట్ ప్రతులను ఓ సారి చూసుకుంటున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు



కేంద్రం కక్ష గట్టినా దేశానికే ఆదర్శంగా..

2023-24 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి హరీశ్‌రావు

పట్టుదలతో ముందుకు సాగుతున్న రాష్ట్రం

'కేంద్రం సహకరించకుండా, నిధులు ఇవ్వకుండా నష్టం చేస్తున్నా.. తెలంగాణ మాత్రం పట్టుదల, క్రమశిక్షణ, దూరదృష్టితో పథకాలకు రూపకల్పన చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఒకప్పుడు సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయానికి తిరిగి జవజీవాలను అందించటంలోనూ, నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడే రైతుల్లో తిరిగి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సఫలీకృతమైంది. నాడు కరువు కాటకాలతో అలమటించిన తెలంగాణ.. నేడు ప్రభుత్వం చేసిన అసాధారణ కృషితో సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవతరించింది. ఈ అపూర్వ, అద్భుత పరివర్తనకు ముఖ్యమంత్రి కేసీఆరే కర్త కర్మ క్రియగా నిలిచారు..' అని హరీశ్ కొనియాడారు.

- కేంద్రం కక్ష, వివక్ష ప్రదర్శిస్తూ ఆంక్షలు విధిస్తున్నా వెనుకంజ లేదు
- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోంది
- అనతికాలంలోనే అబ్బురపడే ఫలితాలు సాధించింది
- సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవతరించింది
- 'తెలంగాణ మోడల్'ను దేశం ముందుంచింది
- 'తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది' అనే భావన తెచ్చింది
- ఇదంతా ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఘనతే
- తన దార్శనికత, పాలనా పటిమతో తెలంగాణకు మన్ననలు తెస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాలు, వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తోంది
- కేంద్రం మాత్రం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందన్న మంత్రి
- రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌ను సభ ముందుంచుతున్నట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్ష, వివక్ష ప్రదర్శిస్తున్నా, అనేక ఆర్థిక ఆంక్షలు విధిస్తున్నా.. సంక్షేమం, అభివృద్ధిలో వెనుకంజ వేయకుండా దూసుకుపోతూ తాను ఎదగటమే కాకుండా 'తెలంగాణ మోడల్'ను రాష్ట్రం దేశం ముందుంచింది. ఎనిమిదిన్నరేళ్ల స్వల్ప కాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా మారి యావత్ దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచింది. 'తెలంగాణ ఆచరిస్తుంది..దేశం అనుసరిస్తుంది' అన్న భావనను తీసుకొచ్చింది. దేశం అబ్బురపడే స్థాయిలో ఫలితాలను అనతికాలంలోనే తెలంగాణ సాధించిందంటే అది సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఘనతే. కేసీఆర్ ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా ప్రజల అవసరాలే ప్రామాణికంగా భావిస్తారు తప్ప ఎన్నికల ప్రయోజనాల కోసం ఆలోచించరు. నాడు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపి, ఇప్పుడు స్వరాష్ట్ర ప్రగతి యాత్రకు సారథ్యం వహిస్తున్న ఆయన.. తన దార్శనికత, మేధాశక్తి, సృజనాత్మకత, పరిపాలన పటిమతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు మన్ననలు దక్కేలా చేస్తున్నారు..' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు కొనియాడారు. సోమవారం 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో.. రాష్ట్ర ప్రగతిని గణాంకాలతో వివరిస్తూనే, కేంద్ర వైఖరిని తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు.

ప్రధాన రంగాలే కాదు ఉప రంగాల్లోనూ..

'రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రధాన రంగాల్లోనే కాకుండా వాటి ఉప రంగాల్లోనూ తెలంగాణ గణనీయమైన వృద్ధి రేటు సాధిస్తోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో సాధించిన అభివృద్ధితో మత్స్య సంపద, పశు సంపద భారీగా పెరిగింది. చేపల ఉత్పత్తి ప్రతికూల వృద్ధి రేటు నుంచి రెండంకెల వృద్ధి రేటుకు చేరుకుంది. ఐటీ, వాణిజ్యం, విద్యుత్తు, రవాణా, హోటళ్ల తదితర సేవా రంగాల్లో అధిక వృద్ధి రేటు నమోదవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడినా, దాని ప్రభా వం తెలంగాణపై అంతగా లేదు. రాష్ట్రంలో విని యోగంతో పాటు, అన్ని రంగాల్లో పెట్టుబడులు పె రగటం వల్లనే ఇది సాధ్యమైంది..' అని తెలిపారు.

తెలంగాణ అపూర్వ ప్రగతికి ఇది నిదర్శనం..

'రాష్ట్రం సాధించిన ఆర్థిక వృద్ధికి తలసరి ఆదాయం మరో కొలమానంగా నిలుస్తుంది. 2013-14లో రూ.1,12,162గా ఉన్న తలసరి ఆదాయం, 2022-23లో రూ.3,17,115గా ఉండనుందని అంచనా వేస్తున్నాం. ఇది జాతీయ సగటు అయిన రూ.1,70,620 కంటే 86 శాతం ఎక్కువ. ఇది తెలంగాణ అపూర్వ ప్రగతికి నిదర్శనం..' అని హరీశ్‌రావు తెలిపారు.

సమాఖ్య స్ఫూర్తికి కేంద్రం తూట్లు..

'రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డంకుల మీద అడ్డంకులు సృష్టిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయటం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిధికి లోబడి బడ్జెటేతర రుణాలు సమీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మనకున్న ఆర్థిక సామర్థ్యం మేరకు రుణ పరిమితిని రూ.53,970 కోట్లుగా బడ్జెట్‌లో పొందుపరిచాం. కానీ కేంద్రం ఏకపక్షంగా రూ.15,033 కోట్లు కోత పెట్టింది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఈ తరహాలో పెడుతున్న ఆంక్షలు, తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయి. ఆర్థిక సంఘం చేసే సిఫారసులను యథాతథంగా అమలుపరిచే సంప్రదాయానికి కూడా కేంద్రం తిలోదకాలిచ్చింది. పన్నుల వాటాలో తెలంగాణకు 2019-20 సంవత్సరంలో ఇచ్చిన మొత్తానికి తగ్గకుండా రూ.723 కోట్ల స్పెషల్ గ్రాంట్ ఇవ్వాలని, పోషకాహార కార్యక్రమాల కోసం రూ.171 కోట్ల గ్రాంటు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం చెప్పినప్పటికీ కేంద్రం మొండిచేయి చూపింది. 2021-26 సంవత్సరాలకు గాను 15వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.5,374 కోట్లు గ్రాంటుగా ఇవ్వాలని సిఫారసు చేస్తే ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసింది. విభజన చట్టంలోని 94(2) సెక్షన్ ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం ఏడాదికి రూ.450 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉన్నా ఇవ్వటం లేదు. మిషన్ భగీరథ పథకానికి రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసినా నయా పైసా ఇవ్వలేదు..' అని ధ్వజమెత్తారు.

రైతుల్లో దీనత్వం పోయి ధీరత్వం

'రాష్ట్రం ఏర్పాటుకు ముందు పదేళ్లలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు అప్పటి ప్రభుత్వాలు కేవలం రూ.7,994 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఇప్పటివరకు రూ.1,91,612 కోట్లను ఖర్చు చేసింది. ఫలితంగా ఇప్పుడు రాష్ట్ర రైతుల కళ్లలో దీనత్వం పోయి ధీరత్వం కనిపిస్తోంది. సమైక్య రాష్ట్రంలో ఎంతోమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. నేడు తెలంగాణ సాగునీటి రంగం స్వర్ణయుగాన్ని తలపిస్తోంది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామల మాగాణంగా సాక్షాత్కరిస్తోంది. అన్నపూర్ణగా అవతరించి దేశానికే అన్నం పెట్టే స్థాయికి చేరింది..' అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.




సోమవారం శాసనసభలో బడ్జెట్ ప్రసంగం చేస్తున్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావ్. శ్రద్ధగా పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు.

దయనీయ స్థితిని అధిగమించి..

'రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సమగ్రాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నాం. రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రెండేళ్లలో జీఎస్డీపీ వార్షిక వృద్ధి రేటు 12 శాతం. ఇది జాతీయ వృద్ధి రేటుకంటే తక్కువ. కానీ ప్రభుత్వ కృషి, పట్టుదల, క్రమశిక్షణ వల్ల 2019-20 నాటికి రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 13.2 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 10.2 శాతానికి తగ్గింది. 2021-22 నాటికి దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికంగా తెలంగాణ తలసరి ఆదాయం వృద్ధి రేటు 11.8 శాతం నమోదు చేసి రికార్డు సృష్టించింది. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని నీతి ఆయోగ్ తేల్చింది. 2014-15లో దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.1 శాతం కాగా 2020-21 నాటికి 4.9 శాతానికి పెరిగింది. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.9 శాతం మాత్రమే కాగా.. జీడీపీ 4.9 శాతం కావడం గర్వకారణం..' అని హరీశ్ అన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

'ప్రభుత్వం ఆసుపత్రులు, విద్యాలయాల భవనాలు నిర్మించినా, సమీకృత కలెక్టరేట్లు, ఆదివాసీ భవనాలు ఏర్పాటు చేసినా, సచివాలయ భవనం రూపొందించినా, యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని వైభవంగా పునర్నిర్మించినా, అమరుల స్మారక కేంద్రాన్ని సాక్షాత్కరింపజేసినా, అంబేడ్కర్ విగ్రహాన్ని ఆకాశమంత ఎత్తున ప్రతిష్ఠిస్తున్నా.. ప్రజలకు మెరుగైన సేవలు అందించటం కోసమే. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని ప్రపంచం ముందు సమున్నతంగా నిలబెట్టాలనే ఆశయం కోసమే..' అని హరీశ్ స్పష్టం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,90,396 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను సభ ముందుంచుతున్నట్టు తెలిపారు. 'సాధించిన దానికి సంతృప్తి చెంది అక్కడే ఆగిపోవటం కార్యశూరుల లక్షణం కాదు. సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందడుగు వేయటమే మా నైజం. ప్రజల ఆశీర్వాద బలంతో మరింత పట్టుదలతో ముందుకు సాగుతాం..' అంటూ ఆయన ముగించారు.



ఎన్నికల స్టంట్‌ను తలపిస్తోంది..

- బడ్జెట్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజం
- శుష్క వాగ్దానాలు–శూన్య హస్తాలు.. ఆత్మస్తుతి–పరనింద
- దళితబంధును దళితులందరికీ వర్తింపజేయాలంటే శతాబ్దం కూడా సరిపోదు



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా డొల్ల అని, ఇది ఎలక్షన్ స్టంట్‌ను తలపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. బడ్జెట్‌ను 'శుష్క వాగ్దానాలు–శూన్య హస్తాలు'గా అభివర్ణించారు. 'ఆత్మస్తుతి – పరనింద' మాదిరి కేసీఆర్ ప్రభుత్వాన్ని పొగడటం.. కేంద్రాన్ని తిట్టడం తప్ప ఏమీ లేదని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ సహా అన్ని వర్గాలను వంచించేలా బడ్జెట్‌ను రూపొందించారని బండి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో, వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని ఆశించిన ప్రజలకు ఈసారి కూడా మొండిచేయి చూపారని పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు, ఆచరణలో ఖర్చు చేస్తున్న నిధులకు పొంతనే లేదని ఎత్తిచూపారు. 'రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆదాయం మాత్రం రూ.1.31 లక్షల కోట్లుగానే చూపింది. మిగిలిన రూ.1.60 లక్షల కోట్లు ఎక్కడి నుంచి సమకూరుస్తారో చెప్పకపోవడం సిగ్గుచేటు. కేంద్రం గ్రాంట్లు, పన్నుల వాటా రూపేణా ఈ బడ్జెట్‌లో రూ.62 వేల కోట్లకు పైగా చెల్లిస్తోంది. ఇవిపోగా మిగిలిన ఆదాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం మద్యం, భూముల అమ్మకం, అప్పులు, ప్రజలపై భారం మోపి సమకూర్చుకునేందుకు కుట్ర చేస్తోంది.సర్కార్ డొల్ల బడ్జెట్‌ను ప్రజల్లో ఎండగడతాం' అని ప్రకటించారు.

ప్రజలపై మరింత భారం మోపేలా...

'విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి. ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబం సంపాదనలో విద్య, వైద్యానికి 50 శాతానికిపైగా ఖర్చు చేస్తున్నారు. మొత్తం బడ్జెట్‌లో విద్యకు 7 శాతం, వైద్యానికి 4 శాతంలోపు మాత్రమే నిధులు కేటాయించడాన్ని చూస్తుంటే పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం మోపేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి' అని విమర్శించారు. 'తెలంగాణకు కేంద్రం నిధులివ్వడం లేదని విమర్శిస్తున్న కేసీఆర్ కేంద్రం నిధులతో నిర్మించిన రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులు, వీధిదీపాల ఏర్పాటన్నీ తామే చేస్తున్న ట్లుగా నీచ రాజకీయాలకు అద్దం పడుతోంది. దళితబంధుపై ప్రజలను దగా చేశారు. రాష్ట్రంలోని దళితులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలంటే మరో శతాబ్దం సమయం కూడా సరిపోదు. ఎస్టీ శాఖకు కేటాయించిన నిధులు గిరిజనబంధుకు చాలని పరిస్థితి. రాష్ట్రంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలకు 2 శాతం నిధులే కేటాయించడం బాధాకరం' అని విమర్శించారు.

అంకెల గారడీ.. రంగుల మెగా బడ్జెట్

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు అంకెలగారడీ, మాయమాటలతో మేడిపండు మాదిరిగా రంగుల మెగా బడ్జెట్ ప్రవేశపెట్టారని సీఎల్పీనేత భట్టి విక్రమార్క అభివర్ణించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో కొత్తగా కేటాయింపులులేవని, గతంలో ఇచ్చిన హామీల అమలుకు కూడా కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టడం, మోసం చేయడానికి అంకెలు పెంచి బడ్జెట్ పెట్టారని ఆరోపించారు. బడ్జెట్‌ను సంపూర్ణంగా అమలు చేయాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంటే వాస్తవిక బడ్జెట్ పెట్టేవారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటిస్థలాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నట్టు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం 5 గంటలు కూడా నాణ్యంగా సరఫరా చేయడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. 50 శాతం జనాభా కలిగిన బీసీలకు బడ్జెట్ కేటాయింపులో కనీస ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ఎనిమిదేళ్లుగా పక్కదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. రుణమాఫీ అమలు చేయకపోవడం వల్ల సుమారు 16 లక్షలమంది రైతులు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారారని విచారం వ్యక్తం చేశారు. బీసీ, గిరిజనబంధు హామీ, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్‌లో మాటలేదని విమర్శించారు.



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు అభినందనలు తెలుపుతున్న మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక దిగ్బంధనం చేసినా..



కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా ఆర్థిక దిగ్బంధనం చేసి, సహకారం అందించకున్నా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత రాబడి నుంచి గణనీయంగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. ప్రస్తుత బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రెవెన్యూ రాబడి గణనీయంగా పెరగ్గా, ముఖ్యంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో రూ.18,500 కోట్లు, ఎక్సైజ్‌లో రూ.20,000 కోట్లు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో రూ.7,512 కోట్లు, మైనింగ్‌లో రూ.5,917 కోట్ల ఆదాయం సమకూరింది. సీఎం కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావడం వల్లే గతేడాది కంటే ఎక్కువ కేటాయింపులు సాధ్యమైంది. - బి.వినోద్, వైస్‌చైర్మన్, రాష్ట్ర ప్రణాళికా సంఘం

కేటాయింపులు ఘనం.. ఖర్చులు నామమాత్రం



బడ్జెట్ కేటాయింపుల్లో ఘనంగా ఉన్నా.. ఖర్చులు మాత్రం నామమాత్రంగా ఉన్నాయి. ఒకవైపున తలసరి ఆదాయం పెరుగుతుండగా, మరోవైపు రాష్ట్రంలో దరిద్రుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. 37 శాతం జనాభా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దారిద్ర్యరేఖ నుంచి ఎగువకు తీసుకురావడానికి, విద్య-వైద్యానికి అదనపు నిధులు కేటాయించాలి. కేటాయించిన నిధులను కూడా పూర్తిగా అభివృద్ధికోసం ఖర్చుచేయాలి.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఆ రాష్ట్రాలతో పోలిస్తే ప్రగతిశీల బడ్జెట్



బడ్జెట్‌లో చేసిన కేటాయింపులన్నీ పూర్తిగా ఆచరణలో చూపించాలి. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. 80వేల ఉద్యోగాల భర్తీని ప్రకటనకే పరిమితం చేయకుండా వెంటనే నియామక ప్రక్రియ చేపట్టాలి. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలి. యూనివర్సిటీలకు మరిన్ని నిధులు కేటాయించాలి. వ్యవసాయ రంగంలో పంటల బీమాను అమల్లోకి తీసుకొచ్చి కౌలు రైతులకూ సంక్షేమ పథకాలు అందించాలి. జూరాల, నెట్టంపాడు, కల్వకుర్తి లాంటి ప్రాజెక్టులకు నిధులు పెంచాలి. మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణ బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్. - కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రంలో ప్రగతి పరుగులు

మంత్రి హరీశ్‌రావు వెల్లడి

- ద్రవ్య విధాన వ్యూహ పత్రం సభకు సమర్పణ
- సవరించిన అంచనాల్లో రెవెన్యూ మిగులు రూ. 2,980 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం)ను క్రమశిక్షణతో నిర్వహిస్తున్నందునే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్‌లో భాగంగా ద్రవ్య విధానాన్ని మంత్రి వెల్లడించారు. ద్రవ్య విధాన వ్యూహపత్రాన్ని సభకు సమర్పించారు. 'కోవిడ్ తరువాత పరిస్థితుల్లో రాష్ట్రం పురోగమనంలో ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆదాయ వనరులు 21.1 శాతం అద్భుత ప్రగతి కనబరుస్తున్నట్లు సవరించిన బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రంలోనూ పన్నుల వసూళ్లు ఆశించిన దానికంటే అధికంగా ఉన్నందున కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా 5.06 శాతం పెరుగుతుంది. జీఎస్డీపీలో ద్రవ్యలోటు 4 శాతం ఉంటుందని 2022-23 బడ్జెట్‌లో అంచనా వేశాం. కానీ, ఆర్థిక ప్రగతి కారణంగా 3.21 శాతానికి తగ్గింది. తెలంగాణ కొత్త రాష్ట్రమైనప్పటికీ.. అనేక కొత్త పథకాలు, భారీ కమిట్‌మెంట్స్‌తో వ్యయం అధికంగా ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ మిగులు రూ.2,980 కోట్లుగా ఉంటుంది. 2022-23 ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్ర అప్పులు జీఎస్డీపీలో 25.9 శాతం ఉంటాయని అంచనా వేసినా. సవరించిన బడ్జెట్ అంచనాల్లో అది 24.33 శాతంగానే ఉండనుంది'అని హరీశ్ తెలిపారు.

పన్నుల ఆదాయమే వెన్నుదన్ను

'రాష్ట్రానికి పన్నుల ఆదాయమే వెన్నుదన్నుగా ఉంది. అందులో భాగంగా పన్ను వసూళ్లలో ఎలాంటి లోపాలు ఉండకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, సామాన్యులపై భారం వేయకుండా ఎక్కడెక్కడ పన్నులు ఇంకా వసూలు అయ్యే అవకాశం ఉందో వాటిని పకడ్బందీగా అమలు చేయడం ద్వారా ఆదాయం మరింత పెంచుకుంటాం. జీఎస్టీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, మార్కెట్ ధరల స్థిరీకరణ, స్టాంపు డ్యూటీ పెంపుతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడులు రూ.1.31 లక్షల కోట్లు ఉంటాయని అంచనా వేశాం. పన్ను ఎగవేతలను అరికట్టడానికి ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఏర్పాటు చేశాం. ఇక పన్నేతర ఆదాయ కూడా పెరుగుతోంది. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని విక్రయించడం వల్ల ఆదా యం పొందుతున్నాం..'అని మంత్రి వివరించారు.

కేంద్రం కంటే బెస్ట్

'స్థిర, ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి కేంద్రంతో పోలిస్తే అభివృద్ధి అధికంగా ఉంది. 2020-21 కోవిడ్ సమయంలో అభివృద్ధి తిరోగమంలో ఉన్నా కేంద్రంతో పోలిస్తే మెరుగ్గా ఉంది. ఆ సంవత్సరం కేంద్రం 6.6 శాతం తిరోగమనంలో ఉంటే.. రాష్ట్రం 4.9 శాతం తిరోగమనంలో ఉంది. ఆ మరుసటి సంవత్సరం నుంచి ఆర్థిక పురోగతి సాధ్యమైంది. తిరోగమనం నుంచి పురోగతి వైపు మళ్లడమే కాకుండా ఏకంగా 10.9 శాతం పెరుగుదల సాధ్యమైంది. సెకండరీ సెక్టార్‌లోని ఉత్పత్తి, విద్యుత్, నీటి సరఫరా, నిర్మాణం రంగం పురోగతిలో ఉంది. ప్రాథమిక రంగమైన వ్యవసాయం, గనులు, క్వారీ కూడా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించాయి. నిరంతర విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, రైతుబంధు వంటి పథకాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి'అని హరీశ్ తెలిపారు.



"మూర్ఖులుండేది తెలివైనవాళ్ల లాభం కోసమే.
– ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ

సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 7

ఆ పాలన నేర్పిన పాఠాలెన్నో!

అధికారాంతమున చూడవలె ఆ అయ్య సౌభాగ్యముల్ అని నానుడి. పాకిస్తాన్ సైనిక నాయకుడిగా, ఆ పైన పాలకుడిగా చక్రం తిప్పిన జనరల్ పర్వేజ్ ముషారఫ్‌కు ఇది అక్షరాలా వర్తిస్తుంది. అధికారం పోయాక పరాయి దేశానికి పలాయనమై, ఆఖరికి అరుదైన వ్యాధితో ఆదివారం నిస్సహాయంగా కన్నుమూయాల్సి వచ్చింది. సైనిక దిగ్గజాలు అయూబ్, జియాల బాటలో నడిచి, పాకిస్తాన్‌ను నేరుగా పాలించే స్థాయికి ఎదిగిన ఈ జనరల్ మూటగట్టుకున్న అప్రతిష్ఠ అపారం. ఆ దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియ హఠాత్తుగా స్తంభించింది ఆయన వల్లే. 1999 నాటి కుట్రలో ప్రధాని నవాజ్ షరీఫ్ నుంచి అధికారం హస్తగతం చేసుకొని, 'ఛీఫ్ ఎగ్జిక్యూటివ్'గా, ఆ పైన సైనికాధ్యక్షుడిగా, చివరకు పౌర అధ్యక్షుడిగా తొమ్మిదేళ్ళ కాలం దేశాన్ని గుప్పెట్లో పెట్టుకొన్నారు. ఆఖరికి మెడ మీద అభిశంసన కత్తితో 2008లో అంత శక్తిమంతమైన అధినేత కూడా గద్దె దిగారు.

అనేక వివాదాలు ముసిరిన ముషారఫ్ పాలన చిత్రమైన పరస్పర వైరుద్ధ్యాల గాథ. అవిభజిత భారతావనిలో ఢిల్లీలో పుట్టిన ఈ జనరల్ సైనికకుట్రకు పాల్పడినప్పుడు ప్రజా ప్రభుత్వాల అవినీతితో విసిగిన పాక్ పౌరసమాజం సంతోషించింది. ఆ సంతోషం తొందరలోనే ఆవిరైంది. పాక్ భద్రతా పరిస్థితిని చిక్కుల్లో పడేసిన పాపం ముషారఫ్‌దే. తీవ్రవాదంపై పోరులో ఆయన ద్వంద్వ నీతి ఆ దేశాన్ని నిప్పుల కుంపటి చేస్తే, ఆ రాజకీయ దుశ్చర్యలో తానే దగ్ధమైన దుఃస్థితి. దాయాది దేశంలో మరణశిక్ష పడ్డ ఏకైక సైనిక పాలకుడనే దుష్కీర్తి ఆయనదే. 2007లో రెండోసారి ఎమర్జెన్సీ విధించి, రాజద్రోహానికి పాల్పడ్డారన్న కారణంపై మరణశిక్ష పడింది. వైద్యచికిత్సకంటూ 2016లో దేశం విడిచి దుబాయ్ చేరి, అక్కడే స్వీయప్రవాసంలో తిరిగిరాని లోకాలకు తరలిపోయారు.

ముషారఫ్ వ్యవహారమంతా ఓ నిగూఢ ప్రహేళిక. నిరంకుశ పాలన సాగిస్తూనే, ఉదారవాద సంస్కరణలూ తెచ్చారు. మీడియా వర్ధిల్లడానికి వీలు కల్పించిందీ ఆయనే. ఆనక అవి తనకు అడ్డం తిరిగాక వాటి నోరు మూయించేందుకు ప్రయత్నించి, భంగపడ్డదీ ఆయనే. 1999 మేలో సైనిక ప్రధానాధికారిగా దుందుడుకుగా కార్గిల్ యుద్ధానికి కారణమై, పాక్ పరువు తీసిందీ ఆయనే. అదే అక్టోబర్‌లో కరాచీలో తన విమానం దిగనివ్వని ప్రధాని నవాజ్ షరీఫ్‌ను సాగనంపి, ఎమర్జెన్సీ విధించి పగ్గాలు చేపట్టి, ఆనక 2001లో ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ నుంచి దేశాధ్యక్షుడై, భారత్‌తో శాంతి ప్రయత్నాలు చేసిందీ ఆయనే. ఆ మాటకొస్తే ఆయన హయాంలోనే అయిదేళ్ళు భారత్, పాక్‌ల మధ్య శాంతి నెలకొంది. చిత్రంగా ఈ సైనిక నియంత ఏలుబడిలోనే 2003–04ల్లో సియాచిన్, కశ్మీర్ వివాదం దాదాపు పరిష్కారమయ్యే దాకా వెళ్ళింది. ఆఖరున ఆ అవకాశం చేజారింది.

1999 నుంచి తొమ్మిదేళ్ళు పాక్‌ను పాలించిన శక్తిమంతమైన దేశాధినేత ముషారఫ్. అధ్యక్షుడైన కొద్దినెలలకే 'తీవ్రవాదంపై పోరు' అంటూ దోస్తీ చేసిన అమెరికాని సైతం బురిడీ కొట్టించిన తంత్రం ఆయనది. అల్‌ఖాయిదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఆచూకీ కోసం అగ్రరాజ్యం జల్లెడ పడుతుంటే, అతణ్ణి పెరట్లోనే పెట్టుకొని కాలక్షేపం చేయగలిగారు. అలా ఇటు తీవ్రవాద విషనాగుతో, అటు 9/11 ఘటనతో తీవ్రవాదంపై శివాలెత్తుతున్న అమెరికాతో ఏకకాలంలో నెయ్యం నెరిపారు. ఈ కత్తి మీద సాము వికటించి, పాలు పోసిన పామే కాటేసింది. దేశాన్ని అమెరికాకు అమ్మేస్తున్నాడంటూ తీవ్రవాద బృందాలు రెండుసార్లు ఆయన ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించాయి.

దేశంలో రాజ్యాంగ వ్యవస్థను పట్టాలు తప్పేలా చేయడం సహా ఆయన ఘోర తప్పిదాలు అనేకం. రాజకీయ మనుగడ కోసం వివిధ మతతత్త్వ పార్టీలతోనూ జట్టు కట్టారు. ఆఖరికి 2006లో బలూచ్ నేత అక్బర్ ఖాన్ బుగ్తీని హతమార్చడంతో బలూచిస్తాన్‌లో దిగజారిన పరిస్థితి ఇప్పటికీ సాధారణ స్థితికి రానే లేదు. బుగ్తీ హత్యతో ఆరంభమైన ముషారఫ్ పతనం దేశ ప్రధాన న్యాయమూర్తిని పక్కకు తప్పించాలన్న విఫలయత్నంతో వేగవంతమైంది. 2008లో కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ అభిశంసనకు సిద్ధమవడంతో అవమానకరమైన రీతిలో ముందుగానే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. మరో మూడు నెలలకు 26/11 ముంబయ్ దాడులతో భారత్ కూడా పాఠం నేర్చుకుంది. సైనిక నియంతతోనో, సైన్యాధ్యక్షుడితోనో మాట్లాడినంత మాత్రాన దాయాదితో సంబంధాలు మెరుగవడానికి అన్ని వర్గాలూ కలిసొస్తాయనుకుంటే అంతకన్నా అవివేకం లేదన్న చేదు నిజం తెలిసొచ్చింది.

ఇక, 2010లో ముషారఫ్ పెట్టిన 'ఆల్ పాకిస్తాన్ ముస్లిమ్ లీగ్' సైతం అనేక ఇతర ఏకవ్యక్తి రాజకీయ పార్టీల లానే అచిరకాలంలోనే తెర మరుగైంది. దేశ సమస్యల్ని పరిష్కరించగల సత్తా సైన్యానికే ఉందని గుడ్డిగా నమ్మిన పాక్ సైనిక నేతల్లో కడగొట్టువాడైన ముషారఫ్ కష్టాలు కొనితెచ్చారు. ఇస్లామాబాద్‌లో అధికార కేంద్రంగా ఆనాటి నుంచి సైన్యం సాగిస్తున్న ఆటకు ఇప్పటికీ తెరపడనే లేదు. ఆయన హయాంలో జరిగిన అనేక నిర్ణయాలే ఇవాళ్టికీ పాక్ రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాల ముఖచిత్రం ఇలా మిగలడానికి కారణం. నేడు రాజకీయ అనిశ్చితి, తీవ్రవాదుల ఎదురుదాడి మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తానీ పాలక శిష్టవర్గం, పౌరులు, సైన్యం ముషారఫ్ శకం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం. ఆయన తప్పొప్పులు పాకిస్తానే కాదు... పొరుగుదేశమైన మనతో సహా ప్రపంచం ఎప్పటికీ మర్చిపోదు. ఎక్కడైనా, ఎప్పుడైనా రాజకీయాల్లో సైనిక జోక్యం దుష్పరిణామాలు అంత తొందరగా ఆగవు.

ఏనాడో గాడితప్పిన కేంద్ర బడ్జెట్లు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

2023 సంవత్సర కేంద్ర బడ్జెట్ తీరుతెన్నుల్ని పరిశీలిస్తే– 'అన్నం మెతుకునీ/ ఆగర్భ శ్రీమంతుణ్ణీ వేరు చేస్తే/ శ్రమ విలువేదో తేలిపోదూ?' అని కవి అలిశెట్టి ప్రభాకర్ అంటించిన చురక జ్ఞాపకం వచ్చింది. దేశ ప్రజాబాహుళ్యం స్థితిగతుల్ని పాలకులు పరిశీలించకపోబట్టే శ్రమ విలువను 75 ఏళ్లుగా గణించలేకపోయారు. ప్రణాళికలకూ, ఆచరణలో అమలు చేయని అతిశయోక్తులకూ మాత్రం తక్కువేమీ లేదు! భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దేశీయ ప్రైవేటు సంస్థల పరం చేసి, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను 'శంకరగిరి మాన్యాలు' పట్టించడానికి అన్ని రకాలా సిద్ధమయింది పాలకవర్గం! ఇదే అదునుగా గాంధీజీ పేరిట ప్రారంభించిన 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' కాస్తా నీరు కార్చడానికి పాలకులు నడుం కట్టారు.

దేశ తొలి ప్రధానమంత్రి పదవిలోకి రాక ముందు, దేశానికి స్వాతంత్ర్యమనేది ఏ పరిస్థితుల్లో 'నామమాత్రపు స్వాతంత్ర్యం కూడా కాదో' ఇలా స్పష్టం చేశారు: ''ప్రత్యేక హక్కులనూ, స్వార్థ ప్రయోజనాలనూ అనుభవిస్తున్న ఏ ప్రత్యేక సంపన్న వర్గమూ తమ హక్కుల్ని తాముగా వదులుకున్నట్టు చరిత్రకు దాఖలాల్లేవు. సాంఘిక మార్పులు రావాలంటే ఒత్తిడి, లేదా బల ప్రయోగం అవసరం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడమంటే అర్థం, ఈ స్వార్థ ప్రయోజనాలకు భరతవాక్యం పలకడమనే. విదేశీ ప్రభుత్వ పాలన తొలగి దాని స్థానంలో స్వదేశీ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఈ స్వార్థ ప్రయోజనాలను ముట్టకుండా అలాగే అట్టిపెడితే ఇక అది నామమాత్రపు స్వాతంత్ర్యం కూడా కాదు''.

ఇంతకన్నా మరో గొప్ప సత్యాన్ని 1992లో సుప్రసిద్ధ అమెరికన్ పత్రిక 'టైమ్' ప్రకటించింది: ''కమ్యూనిజం పతనం కావొచ్చు. కానీ క్యాపిటలిజమూ, ప్రజాస్వామ్యమూ శాశ్వతంగానూ, ప్రపంచ వ్యాప్తంగానూ జయప్రదం కాగలగవన్న గ్యారంటీ ఏమీ లేదు''! ఎందుకంటే మొదటి ప్రపంచ యుద్ధం నాటికి పెరిగి పెద్ద మహమ్మారి రూపం దాల్చిన అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని 'చిట్కా వైద్యాల'తో ఉపశమింప జేసుకోవడమే గానీ ఆ సంక్షోభ లక్షణాలు ఈ రోజుకీ సమసిపోలేదు. కనుకనే అమెరికా ఆశీర్వాదాలతోనే నెలకొన్న ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలలో అత్యున్నత స్థాయి అధికారిగా, సలహాదారుగా ఈ సంస్థలను విశ్వసించి రంగంలోకి దిగి ఎలాంటి దారుణానుభవం చూడవలసి వచ్చిందో వివరించారు డేవిసన్ బుధూ. ఇప్పటికీ అమెరికా, ప్రపంచబ్యాంకు సంస్థలను నమ్ముతున్న భారత నాయకులు డేవిసన్ బుధూ అనుభవాల నుంచి గుణపాఠం తీసుకోలేక పోతున్నారు. చివరికి ఆంగ్లో – అమెరికన్ సంస్థలే భారత ఆర్థిక వ్యవస్థను పాలకులు నిర్వహిస్తున్న తీరుపై వ్యంగ్యాస్త్రాలు వదులు తున్నా 'మనసూ, చర్మం' మందబారిపోయి దులిపేసుకునే దశలో ఉన్నారు.

ఆసియా, ఆఫ్రికాలలో తన దారుణానుభవాలను డేవిసన్ ఇలా గుండె బరువుతో ప్రపంచం కళ్లముందుంచారు (బుధూ 1988లో అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ మైకేల్ కామ్డెసెస్‌కు రాసిన సుదీర్ఘ రాజీనామా): ''మీరు లాటిన్ అమెరికా, కరేబియన్, ఆఫ్రికా దేశాల ప్రభుత్వాలకూ, ప్రజలకూ అందించమని నా చేతికి అందించిన వరల్డ్ బ్యాంక్ – ఐ.ఎం.ఎఫ్ సంస్కరణల ఔషధాన్నీ, రకరకాల చిట్కాలనూ (బ్యాగ్ ఆఫ్ ట్రిక్స్) సంవత్సరాల తరబడిగా అందజేస్తూనే వచ్చాను. కానీ ఏళ్ల తరబడిగా ఈ దేశాల్లో గడించిన అనుభవం దృష్ట్యా నా పదవికి రాజీనామా చేస్తున్నాను. ఎందుకంటే, ఆకలితో అలమటిస్తున్న కోటానుకోట్ల సామాన్య ప్రజల రక్తంతో నా చేతులు రక్తసిక్తమయ్యాయి. మలినమై పోయిన ఈ నా

రెండో మాట



చేతుల్ని కడుక్కోవడానికి నేను తీసుకున్న మంచి నిర్ణయమే ఈ రాజీనామా. అయ్యా! కామ్డెసెస్ గారూ! ఈ దేశాల్లో మనం చేస్తున్న పనుల వల్ల పేదల రక్తం నదులై పారుతోంది. ఒక్కోసారి నాలో నేననుకుంటాను – ఐఎంఎఫ్ బ్యాంకుల తరఫున మీ పేరిట, మీకు ముందు పని చేసిన అధిపతుల పేరిట లేదా మీ అధికార ముద్రల చాటున నేను చేయవలసి వచ్చిన పాపాలను కడిగేసుకోవడానికి మొత్తం ప్రపంచంలో దొరికే సబ్బులు కూడా ఏ మూలకూ చాలవని.'' (ఎనఫ్ ఈజ్ ఎనఫ్: 1988).



ఆర్.కె. లక్ష్మణ్ పాత కార్టూన్

కాగా, కడిగి పారేసిన ఆ 'సబ్బుల్ని' ఇండియాలో మొదటగా పీవీ నరసింహారావు హయాంలో అందుకుంటే, వాటిని ఆంధ్రప్రదేశ్‌లో వాడి ప్రజలకు 'టోపీ' పెట్టడానికి ప్రయత్నించినవాడు ప్రపంచ బ్యాంక్ 'పెంపుడు బిడ్డ' చంద్రబాబు! ఇక భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దేశీయ ప్రైవేటు సంస్థల పరం చేసి, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను 'శంకరగిరి మాన్యాలు' పట్టించడానికి అన్ని రకాలా సిద్ధమయింది బీజేపీ పాలకవర్గం! ఇదే అదునుగా గాంధీజీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' నీరు కార్చడానికి పాలకులు నడుం కట్టారు. ఆ పథకం కింద కేటాయింపులన్నీ దారి మళ్లుతున్నాయి. పైగా 2023 బడ్జెట్ ఏడాది కాలపరిమితికి మించకపోయినా, దేశ స్వాతంత్ర్యం వందేళ్లు పూర్తి చేసుకునే సమయానికి అంటే 2047 నాటి 'లక్ష్యాల దిశగా ఈ బడ్జెట్ ఉంద'ని స్వయంగా ప్రధానమంత్రి 'కోత' కోయడాన్ని ఏమనాలో అర్థం కావడం లేదు.

ఇండియా లాంటి వర్ధమాన దేశాలలోని కారుచౌక కూలీరేట్ల ఫలితంగా విదేశీ కంపెనీలు పోటీ మీద ఇండియాలో ప్రవేశించి, ఉద్యోగుల్ని తొలగించడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితిని అదుపు చేయకపోగా ఆ విధానాలనే ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు ఎసరు పెట్టడంలో పాలకులు అనుసరిస్తూ, ప్రైవేటు వారికి 'ఆదర్శం'గా నిలుస్తున్నారు. దీన్ని ఎవరో కాదు, స్వయానా 'అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' డైరెక్టర్ సి.ఫ్రెడ్ బెర్గ్‌స్టెన్ ఎదురు తన్నిన ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్ బ్యాక్‌లాష్) అని వర్ణించాల్సి వచ్చింది. 'వ్యవస్థాగతమైన సర్దుబాట్లు అంటే, 'ఖర్చులు తగ్గించుకుని ఉద్యోగాల నుంచి పౌరుల్ని తొలగించేయడమేనని బెర్గ్‌స్టెన్ స్పష్టం చేశాడు. స్విస్ బ్యాంకులు, తదితర విదేశీ బ్యాంకుల్లోకి దొంగ చాటుగా ప్రవేశించిన డబ్బును తిరిగి దేశంలోకి తెచ్చి దేశ ప్రజలకు కుటుంబం ఒక్కింటికి రూ. 15 లక్షల చొప్పున పంచుతామన్న పాలకులు ఆచరణలో మొండి చేయి చూపించడం మరపురాని అనుభవంగా మిగిలి పోయింది. 'కోవిడ్' వల్ల ప్రజా బాహుళ్యానికి కల్గిన నష్టం కన్నా దాని పేరిట జరిగిన మిలాఖత్ వ్యాపార లావాదేవీల వల్ల ప్రజలకు వాటిల్లిన నష్టం ఎక్కువ.

పోతన భాగవత కథల్లో 'రహూగణుడ'నే ఒక అహంకారి ఉంటాడు. అతడెక్కిన పల్లకీ ఈ దేహమే. కానీ, దాన్ని మోసే బోయీలు 'ఓంకారాన్ని' వల్లిస్తూ నడుస్తారు, అలసట తెలియకుండా ఉండటం కోసం. పల్లకీలో కూర్చున్నవాడి ప్రయాణం మాత్రం సుఖంగానే సాగుతుంది. నేడు మన దేశ ప్రజల్ని పాలకులు పల్లకీ బోయీలుగా మార్చారు. నేటి దేశ వ్యవసాయ సంక్షోభానికి పాలకుల విధానాలు ఎలా దోహదం చేస్తున్నాయో ఆంత్రోపాలజిస్ట్ గ్లెన్ డేవిస్‌స్టోన్ వెల్లడించాడు: ''పాలకులు వ్యవసాయం పేరిట వెచ్చిస్తున్న డబ్బంతా రైతాంగ శ్రేయస్సుకు కాదు, వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుతున్న పారిశ్రామిక వేత్తల శ్రేయస్సు కోసం''.

క్రీ.పూ. 2100 సంవత్సరంలోనే సుమేరియా ఏలికలు ఆర్థిక వ్యవస్థను ప్రజాపరం చేసి ఎలా ప్రజా బాహుళ్యాన్ని కరువు కాటకాలు లేకుండా కాపాడుతూ వచ్చిందీ చరిత్ర నమోదు చేసింది. బాబిలోనియా, ఈజిప్టులలో సహితం రాచరిక పాలనల్లోనూ ప్రజలు సుఖంగా జీవించారన్న చరిత్ర దాఖలాలు ఉన్నాయి. కానీ ఇప్పటికీ భారత ప్రజలకు మనకబారని ఉషోదయాన్ని 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా పాలకులు ప్రసాదించగల స్థితిలో లేకపోవడం విషాదకరం.

కరెన్సీ సంక్షోభం వల్లనే దేశ పరిస్థితులు ఒడుదొడుకుల్లో పడ్డాయని పాలకులు చెప్పే మాటలు విని సుప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె. లక్ష్మణ్ గతంలో ఓ కార్టూన్ వేశాడు. ఆ కార్టూన్‌లో ఉన్న పేదలంతా పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ 'ఇది మనం పుట్టినప్పటి నుంచీ నోరు మూసుకుని అనుభవిస్తున్నదే కదరా' అనుకుంటారు. ఆ తంతే 75 ఏళ్ల స్వతంత్ర భారతంలోనూ కొనసాగుతూండటం సిగ్గుచేటు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మెరుగుపరచాలి



ఈ 'మైక్రోసాఫ్ట్ టీమ్స్' అనవసరంగా సంక్లిష్టంగా ఉంది. అదే గూగుల్ మీట్స్, జూమ్ లాంటివి వాడుకోవడానికి చాలా సరళంగా ఉన్నాయి. – నిఖిల్ కామత్, ఆంట్రప్రెన్యూర్

భారమైన గుండె



టర్కీ, సిరియా, లెబనాన్, ఇంకా భూకంప ప్రభావిత ప్రదేశాలన్నీ గుండెను భారం చేశాయి. చనిపోయినవారి మీద అల్లాహ్ దయ ఉండనీ. బతికి ఉన్నవారికి సాంత్వన ఇవ్వనీ. ఆమీన్.

– ఒమర్ సులేమాన్, ఇమామ్

మూడో ముచ్చట



భారతీయ సంగీత దర్శకుడు రిక్కీ కేజ్ తన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కుగానూ తన కెరీర్‌లో మూడో గ్రామీ అవార్డు గెలుచుకున్న సందర్భంగా అభినందనలు. మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన చైతన్యాన్ని మీరు మీ సంగీతం ద్వారా వ్యాపింపజేస్తారని ఆశిస్తాను.

– నవీన్ పట్నాయక్, ఒడిషా ముఖ్యమంత్రి

చెప్పేందుకే నీతులా?



కేంద్ర బడ్జెట్ 2023–24 ప్రకారం, కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ. 4,227 కోట్లు అప్పు తెస్తుంది. రూ.2,958 కోట్లు వడ్డీగా చెల్లిస్తుంది. అయినప్పటికీ, అది అప్పులు తేవడం గురించి రాష్ట్రాలకు ప్రబోధిస్తోంది. నీతులు చెప్పే ముందు ఆచరించాలి.

– కె. నాగేశ్వర్, మాజీ ఎంఎల్‌సీ, ప్రొఫెసర్

శాస్త్రీయ జోస్యం?



భారీ భూకంపం వల్ల బాధితులైన మధ్య టర్కీలోని ప్రతి ఒక్కరి పట్లా నాకు దుఃఖం కలుగుతోంది. నేను ఇంతకుముందు చెప్పినట్టు, క్రీ.శ. 115, 526 సంవత్సరాల మాదిరిగానే ఇది సంభవించింది. ఫిబ్రవరి 4– 5లలో ఏర్పడ్డ సంక్లిష్ట గ్రహాల జ్యామితిని అనుసరించే ఈ భూకంపాలు ఎప్పుడూ వస్తాయి.

– ఫ్రాంక్ హూగర్‌బీట్స్, నెదర్లాండ్స్ పరిశోధకుడు

మీరెలా మాట్లాడుతారు?



ఉమ్మడి పౌర స్మృతి అప్రజాస్వామికం అన్న ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎంపీఎల్‌బీ) వ్యాఖ్యలను 'పస్మాందా ఆందోళన్' ఖండిస్తోంది. ముస్లింలలో 90 శాతంగా ఉన్న పస్మాందా జనాభాకు ఈ బోర్డులో ఏ ప్రాతినిధ్యమూ లేదు. అందరు ముస్లింల తరఫున మాట్లాడే నైతిక హక్కు ఎంపీఎల్‌బీకి లేదు.

– ఫయ్యాజ్ అహ్మద్ ఫైజీ, పస్మాందా యాక్టివిస్ట్

బాగుపడలేం



ప్రతీ ఎన్నికైన ప్రతినిధి, ప్రభుత్వ అధికారి, తనను తాను వీఐపీ అని చెప్పుకొనే వ్యక్తి ఎప్పటివరకు ప్రత్యేక గౌరవం అందుకుంటూ, అన్ని నియమాలను ఉల్లంఘిస్తుంటారో– అప్పటివరకూ మన భారతీయులకు అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉండవు. అవాంతరాలు లేని ప్రజా సేవలు లభించవు– వాటికోసం మనం భారీ మూల్యం చెల్లిస్తున్నప్పటికీ!

– సుచేతా దలాల్, జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.విదియ రా.3.03 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మఖ సా.4.55 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.1.34 నుండి 3.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు తదుపరి రా.10.58 నుండి 11.50 వరకు, **అమృతఘడియలు:** లేవు

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఇన్‌బాక్స్

ప్రజ్ఞాశాలి వేటూరి ప్రభాకరశాస్త్రి

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో ప్రముఖ కవిగా, భాషా పరిశోధకుడిగా, సుప్రసిద్ధ చరిత్రకారుడిగా, ప్రసిద్ధ పీఠికా రచయితగా వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగులో తొలి పదం అమరావతి శిలాఫలకంపై ఉన్న 'నాగబు'ను గుర్తించిన పరిశోధకుడు. తెలుగుభాషా చారిత్రక సాహిత్య నిర్మాణానికి అవిరళ కృషి చేసిన అవిశ్రాంత పండితుడు. ఆయన 'పీఠికలు సాహితీ సుగంధ వాటికలు' అని విమర్శకులు ప్రశంసించారు. ప్రభాకరశాస్త్రి 1888 ఫిబ్రవరి 7వ తేదీన కృష్ణాజిల్లా పెదకళ్లేపల్లిలో జన్మించారు. 16 ఏళ్ల వయసులో బందరులో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి... ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా ఉన్నారని తెలిసి తన సహాధ్యాయులతో కలసి వేంకటశాస్త్రి దగ్గర చదువుకొనేందుకు వెళ్లారు. 19వ ఏట మద్రాసు వెస్లీ మిషన్ హైస్కూల్‌లో రెండేళ్లు తెలుగు పండితుడిగా పనిచేశారు. ఆ సమయంలో ప్రాచ్యలిఖిత భాండాగారానికి వెళ్లి గ్రంథాలు చదువుతుండే వారు.

కవిగా కడుపుతీపు, కపోతకథ వంటి ఖండకావ్యాలు రాశారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరు రాజుల చరిత్ర వంటి గ్రంథాలను పరిష్కరించి ప్రచురించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డి రాజులు వంటి చారిత్రక గ్రంథాలను ప్రామాణికంగా రచించారు. ప్రసిద్ధ సంస్కృత రూపకాలైన ప్రతిమ (1910), కర్ణభారం, మధ్యమవ్యాయోగం (1913), నాగానందం (1914) వంటివి అనువదించారు. ప్రభాకర శాస్త్రి చారుచర్య, ఉద్భటారాధ్య చరిత్ర, బసవ పురాణం, సుగ్రీవ విజయం వంటి 40 గ్రంథాలను పరిష్కరించి విపులమైన పీఠికలతో ప్రచురించిన ప్రజ్ఞాశాలి. తెలుగులో క్రీ.శ. నాలుగో శతాబ్ది నుంచి 12వ శతాబ్ది వరకు శాసనాలను సేకరించి సముచిత వ్యాఖ్యానంతో 'శాసన సంకలం'గా ప్రచురించిన శాసన పరిశోధకుడు. తెలుగువారికి వారు చిరస్మరణీయులు.

– డా॥ పీవీ సుబ్బారావు, చిలకలూరి పేట
(నేడు వేటూరి ప్రభాకర శాస్త్రి జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దారీ తెన్నూ లేని బడ్జెట్

అభిప్రాయం




బండి సంజయ్ కుమార్

ముఖ్యమంత్రి కేసీఆర్ మాటల మరాఠీ. రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్ రావు ద్వారా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్ అంతా డొల్ల. ఎలక్షన్ స్టంట్‌ను తలపిస్తోంది. అందులో ఉన్నది శుష్క వాగ్దానాలూ–శూన్య హస్తాలే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలు సహా అన్ని వర్గాలనూ పూర్తిగా వంచించేలా బడ్జెట్‌ను రూపొందించారు.

ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రూ. 1 లక్షలోపు రైతులకు రుణమాఫీ చేయాలంటే రూ. 19,700 కోట్లు నిధులు కావాలి. కానీ ఈ బడ్జెట్‌లో రూ. 6,285 కోట్లు మాత్రమే కేటాయించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రవేశపెట్టిన 'దళిత బంధు' పథకం విషయంలో ప్రజలను మరోసారి దగా చేశారు. గతేడాది దళిత బంధు పథకం కింద రూ. 17,700 కోట్లు కేటాయించినా పెద్దగా ఖర్చు చేయని ప్రభుత్వం... ఈసారి కూడా అంతే మొత్తంలో నిధులు కేటాయించడం హాస్యాస్పదం. పైగా దళితులకు మూడెకరాల స్కీం ఊసే లేదు. గిరిజన శాఖకు కేటాయించిన నిధులు గిరిజన బంధు అమలుకు ఏ మాత్రం చాలని పరిస్థితి. రాష్ట్రంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో 2 శాతం నిధులే కేటాయించడం బాధాకరం.

తెలంగాణలోని ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబం తమ సంపాదనలో విద్య, వైద్యానికి 50 శాతానికిపైగా ఖర్చు చేస్తున్నారు. మొత్తం బడ్జెట్‌లో విద్యకు 7 శాతం, వైద్యానికి 4 శాతంలోపు మాత్రమే నిధులు కేటాయించడం గమనార్హం. యూపీ, గుజరాత్, ఏపీ రాష్ట్రాల్లో ఏటా విద్య, వైద్య రంగాలకు నిధుల కేటాయింపును పెంచుతుంటే... తెలంగాణలో మాత్రం ఏటేటా కోతలు పెట్టడం అన్యాయం.

సాగునీటి పారుదల శాఖకు కేటాయించిన 26 వేల కోట్లు... చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికీ,



సిబ్బంది జీతభత్యాలు చెల్లించడానికే సరిపోయేలా ఉంది. విద్యుత్ శాఖకు ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 12 వేల కోట్లు కేటాయించడం దారుణం. ప్రభుత్వ శాఖల కరెంట్ బిల్లుల బకాయిలే రూ. 20 వేల కోట్లకు పైగా ఉన్నాయి. బడ్జెట్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లకు కేటాయించింది రూ. 12 వేల కోట్లు మాత్రమే. రాష్ట్రంలో ఇండ్లులేని వారి సంఖ్యతో పోలిస్తే ఈ నిధులు ఏమూలకూ సరిపోవు. పైగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి చెల్లిస్తున్న రూ. 2.63 లక్షల సొమ్మును రాష్ట్రం తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించినట్లు అర్థమవుతోంది. రైతు వేదికలు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులు, వీధి దీపాల ఏర్పాటు వంటివి కేంద్ర నిధులతో జరిగేవే అనే విషయం గుర్తుంచుకోవాలి. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులనూ, నిరుద్యోగులనూ మరోసారి వంచించేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పిన మాటను మరచిన ప్రభుత్వం మళ్లీ ఈ ఎన్నికల బడ్జెట్‌లో వారిని రెగ్యులరైజ్ చేస్తామంటే నమ్మేదెవరు?

గత 9 ఏళ్లలో వేలాది జీవోలను బయట పెట్టకుండా దాచిపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం... బడ్జెట్‌లో పారదర్శకత్వం గురించి మాట్లాడటం విడ్డూరం. గత నాలుగేళ్లలో ప్రతిపాదించిన బడ్జెట్‌కు, సవరించిన అంచనాలకు దాదాపు రూ. 60 వేల కోట్లకు పైగా తేడా కనిపిస్తోంది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి రూ. 2,90,396 కోట్లు ఖర్చు చేయబోతున్నట్లుగా బడ్జెట్‌లో లెక్కలు చూపిన కేసీఆర్ ప్రభుత్వం... రాష్ట్ర ఆదాయం మాత్రం రూ. 1.31 లక్షల కోట్లుగానే చూపింది. మిగిలిన రూ. 1.60 లక్షల కోట్లు ఎక్కడి నుండి సమకూరుస్తారో చెప్పకపోవడం గమనార్హం.

వ్యాసకర్త ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

సుఖం వెంటే దుఃఖం!

ప్రాపంచిక సుఖాలు ప్రధానంగా నాలుగు కారణాల వల్ల కలుగుతాయి. ధన కనక వస్తు వాహనాల లాంటి భౌతిక సాధనాల ద్వారా, సాటి వారికంటే ఏదో విషయంలో ఎంతో కొంత ఉన్నత స్థాయి సాధించడం ద్వారా, మనం ప్రేమించే వారితో సాన్నిహిత్యం ద్వారా; అసలు సజీవంగా, స్వేచ్ఛగా ఉండటం అనే స్థితి మాత్రం ద్వారా. కానీ ఈ నాలుగు విధాల సుఖాలలోనూ దుఃఖ బీజాలు నిక్షిప్తమయ్యే ఉంటాయి.

రామాయణంలో, వనవాసంలో ఉన్న రాముడిని భరతుడు కలిసినప్పుడు, ఆ సోదరుల మధ్య జరిగిన చర్చ అద్భుతంగా వివరించాడు ఆదికవి.



జ్యోతిర్మయం

ఆ చర్చలో సుఖ సాధనాల గురించి శ్రీరాముడు చెప్పిన ఒక చక్కని సూక్తి ఉంది: సర్వే క్షయాంతాః నిచయాః, పతనాంతాః సముచ్ఛ్రయాః/సంయోగాః విప్రయోగాంతాః, మరణాంతం హి జీవితమ్.

మనం పోగుచేసుకొనే సుఖ సాధనాల రాశులన్నీ (నిచయాః) క్రమంగా క్షయించి తరిగిపోయేవే. వాటి వలన మనకు కలిగే సుఖం మరింత త్వరగా క్షయించిపోతుంది. సాటివారికంటే మనం ఎక్కువ 'గొప్ప'తనాలు (సముచ్ఛ్రయాః) సాధించినా, అవి చిరకాలం ఉండవు. పదవీచ్యుతి, పదవీ విరమణ లాంటి అనేక కారణాలవల్ల ఉన్నత స్థానాలనుండి ఎప్పటికో ఒకప్పటికి పతనం తప్పనిసరి. అందాల రాణి కలకాలం అందాల రాణిగా ఉండదు. మహాబలశాలి మహాబలశాలిగానే ఉండిపోడు. తాడి తన్నే ఉన్నతుడి తలదన్నే మరింత ఉన్నతుడు పుట్టుకురావడం ప్రకృతి ధర్మం. ప్రేమించిన వారి సాన్నిహిత్యం ఆహ్లాదకరమే. కానీ, అక్కడా అదే చిక్కు. యావజ్జన్మమూ ఏక రీతిగా సాగే బంధాలు ఎక్కడుంటాయి? సంయోగాః విప్రయోగాంతాః. అన్ని కలయికలకూ, విడిపోవడం కూడా తప్పనిసరి.

అసలు అన్ని సుఖానుభవాలకూ ఆధారమైన శరీరమూ, ప్రాణమూ అనేవే అశాశ్వతాలు. అందుకే, సుఖ దుఃఖాలు తాత్కాలికాలని మరచి పోకుండా, వాటిని తామరాకు మీద నీటిబొట్టులా, వైరాగ్య భావంతో అనుభవిస్తూ, శాశ్వతమైన ఆనందం కోసం యత్నించమని శాస్త్రాలు చెప్తాయి.


– ఎం. మారుతిశాస్త్రి



జీసీల బడ్జెట్‌ను రూ.20వేల కోట్లకు పెంచాలి

బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.6,229 కోట్లు కేటాయించారు. ఇది రాష్ట్రంలో 52 శాతం జనాభా ఉన్న బీసీలకు ఏ మూలకు సరిపోదు. బీసీల బడ్జెట్‌ను రూ.20వేల కోట్లకు పెంచాలి.

– ఎంపీ ఆర్.కృష్ణయ్య





..కేరాఫ్ ఊరు

'సాగు' నిధుల్లో సగానికిపైగా అప్పులకే

- నీటి పారుదల రంగానికి బడ్జెట్‌లో రూ.26,446 కోట్లు
- ఇందులో రూ.15,700 కోట్లు రుణ కిస్తీలు, వడ్డీల చెల్లింపులకే..
- ప్రాజెక్టుల పూర్తికి మళ్లీ కొత్త అప్పులే ఆధారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగానికి భారీగా కేటాయింపులు చూపినా.. నిధుల్లో సింహభాగం రుణ కిస్తీలు, వడ్డీల చెల్లింపునకే ఖర్చవుతున్నాయి. రాష్ట్ర బడ్జెట్ 2023–24లో నీటి పారుదలశాఖకు నిర్వహణ పద్దు కింద రూ.17,504.1 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.8942.86 కోట్లు కలిపి మొత్తం రూ.26,446 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో చేసిన రూ.22,675 కోట్ల కేటాయింపులతో పోల్చితే ఇది రూ.3,771 అదనం. తాజా కేటాయింపుల్లో మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.7,715.89 కోట్లు, మధ్యతరహా ప్రాజెక్టులకు రూ.335.58 కోట్లు, చిన్న ప్రాజెక్టులకు రూ.1,301.58 కోట్లు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.256.56 కోట్లను చూపారు.

నిర్వహణ పద్దు అప్పులకే..

తాజా బడ్జెట్‌లో నిర్వహణ పద్దు కింద చూపిన రూ.17,504 కోట్లలో ఏకంగా రూ.15,700 కోట్లు రుణ వాయిదాలు, వడ్డీల చెల్లింపులకే పోనున్నాయి. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి కాళేశ్వరం కార్పొరేషన్ పేరిట తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం గత ఏడాది బడ్జెట్‌లో రూ.11,745 కోట్లను కేటాయించారు. ఈ ఏడాది మరో రూ.3,955 కోట్లు పెరిగాయి. అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, దేవాదుల, సీతమ్మసాగర్, వరద కాల్వ వంటి ప్రాజెక్టుల పూర్తికి మళ్లీ కొత్త రుణాలపై ఆధారపడక తప్పని పరిస్థితి ఉందని అధికార వర్గాలే చెప్తున్నాయి.

రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టులకు కేటాయింపులు ఇవీ.. (రూ.కోట్లలో)

కాళేశ్వరం	2,614	దేవాదుల	285
పాలమూరు-రంగారెడ్డి	1,187	చనాకా-కొరట	289
సీతారామ	948	ఫ్లడ్ ఫ్లో కెనాల్	219
డిండి	250	నిజాంసాగర్	146
కల్వకుర్తి	212	నాగార్జునసాగర్	147
నెట్టెంపాడు	120	ఎస్సారెస్పీ వరద కాల్వ	300
ఎస్ఎల్బీసీ	250		
ఎల్లంపల్లి	349		

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నిధులను గ్రీన్‌చానల్ (ట్రెజరీ ఆంక్షలు లేకుండా) విధానంలో పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధికి వెచ్చించనున్నారు. గతంలో టీయూఎఫ్ఐడీసీ కింద మున్సిపాలిటీలకు ఇచ్చే రూ.300 కోట్లను కూడా నేరుగా బడ్జెట్‌లోనే కేటాయించడం గమనార్హం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,426 కోట్లు ప్రతిపాదించడం విశేషం

సంక్షేమం యథాతథం

బీఆర్ఎస్ మార్కు సంక్షేమ పథకాలకు ఈసారి బడ్జెట్‌లో కూడా తగిన ప్రాధాన్యత లభించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.3,210 కోట్లు (గత ఏడాది కంటే రూ.460 కోట్లు ఎక్కువగా) చూపెట్టింది. విద్యుత్ సబ్సిడీల (వ్యవసాయం, హెయిర్ సెలూన్‌లు, ఇస్త్రీ షాపులకు ఇచ్చే సబ్సిడీలు) రూపంలో గత బడ్జెట్ కంటే అధికంగా రూ.12 వేల కోట్లు, ఉచిత బియ్యం పంపిణీకి రూ.213 కోట్లు అదనంగా రూ.3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూ.919 కోట్లు ఎక్కువగా రూ.5,609 కోట్లు కేటాయించింది. కొత్తగా న్యూట్రిషన్ కిట్ల కోసం 33 జిల్లాలకు గాను రూ.200 కోట్లను ప్రతిపాదించింది. గత బడ్జెట్‌లో కేటాయించిన విధంగానే దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించింది. నియోజకవర్గానికి 1,500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నిధులను పంపిణీ చేయాలని ప్రతిపాదించింది. ఆసరా పింఛన్లకు గత బడ్జెట్‌లో రూ.11,728 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు చూపెట్టింది. బడ్జెటేతర నిధుల నుంచి నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అదనంగా 'సొంత జాగా ఉంటే రూ.3 లక్షలు' పథకానికి కూడా నిధులు కేటాయించింది. గృహ నిర్మాణ పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించగా, ఇందులో సొంత జాగాల ఇళ్లకు రూ.7,890 కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించింది. సీఎం విచక్షణ మేరకు మరో 25 వేల మందిని ఎంపిక చేస్తారు. కొత్త తాయిలాలు పెద్దగా లేకపోగా.. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3,016 ఇచ్చే పథకాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించకపోవడం గమనార్హం.



విద్య, వైద్య రంగాలకూ ప్రాధాన్యం

బడ్జెట్‌లో నిధులు ఆశించే విద్య, వైద్య రంగాలకు ఈసారి కూడా తగిన ప్రాధాన్యత నిస్తూ కేటాయింపులు చూపెట్టారు. విద్యాశాఖకు రూ.19 వేల కోట్లు, వైద్య శాఖకు రూ.12,161 కోట్లు ప్రతిపాదించారు. వీటితో పాటు పురపాలక శాఖకు రూ.11,372 కోట్లు, ప్రణాళిక శాఖకు రూ.11,495 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ.22,260 కోట్లు చూపెట్టారు. ఇక బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు కలిపి రూ.31 వేల కోట్ల వరకు ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు, మిషన్ భగీరథ నిర్వహణకు రూ.1,000 కోట్లు, హరిత హారానికి రూ.932 కోట్లు, ఐఅండ్‌పీఆర్‌కు రూ.1,000 కోట్లు, ఎయిర్‌పోర్ట్–మెట్రో అనుసంధానానికి రూ.500 కోట్లు, ఓల్డ్ సిటీ మెట్రోకు రూ.500 కోట్లు, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల ఏర్పాటుకు రూ.400 కోట్ల వరకు బడ్జెట్ కేటాయింపులు చేయడం గమనార్హం. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లతో పాటు ఇతర అవసరాల నిమిత్తం ఆర్థిక శాఖకు రూ.49,749 కోట్లు కేటాయించగా, అందులో కొత్త నియామకాలకు అవసరమయ్యే వేతనాల కోసం రూ.100 కోట్లు ప్రతిపాదించారు.



వ్యవసాయానికి ఊతం

బడ్జెట్‌లో వ్యవసాయానికి ఊతమిచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు చూపెట్టింది. వ్యవసాయ, సహకార రంగాలకు ఈసారి రూ.26,831 కోట్లు కేటాయించింది. రైతుబంధు కింద 2022–23లో రూ.14,800 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.15,075 కోట్లు ప్రతిపాదించింది. గత ఏడాదితో పోలిస్తే రైతుబంధు పథకానికి రూ.275 కోట్లు ఎక్కువ చూపెట్టింది. తాజా బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ.6,380 కోట్లు కేటాయించింది. రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసేందుకు రూ.20 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేసినప్పటికీ రూ.90 వేల లోపు రుణాలను మాఫీ చేయడమే లక్ష్యంగా నిధులు కేటాయించింది. రైతు బీమా కోసం రూ.123 కోట్లు, మత్స్యశాఖకు రూ.100 కోట్లు చూపెట్టిన ప్రభుత్వం.. సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించి, ఎన్‌సీడీసీ ఇచ్చే రూ.4,500 కోట్ల రుణం ద్వారానే గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పకనే చెప్పింది.

స్పష్టత

- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్
- దళితబంధు కింద నియోజకవర్గానికి 1,500 మంది ఎంపిక
- సొంత జాగా రూ.3 లక్షల ఆర్థిక సాయం 2 వేల మందికి..
- కొత్త పథకాలు పెద్దగా లేవు..
- నిరుద్యోగ భృతి ఊసు లేదు

ఏప్రిల్ 1 నుంచి క్రమబద్ధీకరణ



కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత నిచ్చింది. రాష్ట్రంలోని 11 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని, సెర్ప్‌లో పనిచేస్తోన్న ఉద్యోగులకు వేతన సవరణను కూడా ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అయితే వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపజేసే అంశాన్ని మాత్రం ప్రస్తావించలేదు.

2.37 లక్షల కోట్ల రూపాయల మేర అంచనా సవరణ

2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను గత ఏడాది మార్చి 6వ తేదీన రూ.2.56 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించగా, ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రెవెన్యూ రాబడులు, మూలధన రాబడులు కలిపి రూ.2,37,884.55 కోట్లుగా సవరించారు. అంటే ప్రతిపాదించిన మొత్తం కంటే రూ.19 కోట్ల వరకు లోటు తేలిందని బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. అప్పులు తీసుకోవడంలో ఎఫ్ఆర్‌బీఎం పేరుతో కేంద్రం విధించిన నిబంధనల వల్లే రూ.13 వేల కోట్లు నష్టపోయామని, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.40 వేల కోట్లు ప్రతిపాదిస్తే చాలా తక్కువగా కేంద్రం ఇస్తోందని, పన్నుల్లో వాటా తగ్గిస్తోందని చెప్పిన ప్రభుత్వం.. సవరించిన అంచనాల్లో మాత్రం గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ నిధులను భారీగానే చూపెట్టడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ.2.90 లక్షల కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌కు అనుగుణంగా ఖజానా నింపేందుకు ఐదు పద్దులు దోహద పడనున్నాయి. ఇందులో సొంత

పంచ సూత్రతోనే ఖజానాకు కిక్కు

పన్ను ఆదాయ పద్దు కింద రూ.1.31 లక్షల కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కలిపి దాదాపు రూ.62,500 కోట్లు, రుణాల సమీకరణ ద్వారా రూ. 46,317 కోట్లు, పన్నేతర ఆదాయం కింద (భూముల అమ్మకాలతో కలిపి) రూ.22,808 కోట్లు, ఇతర రూపాల్లో మరో రూ.20 వేల కోట్లు సమకూర్చుకునేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం.

అన్నింటికీ నిధులు పెంచాం: ఆర్థికమంత్రి

ఈసారి బడ్జెట్‌లో ఉన్న పథకాలకు నిధులు పెంచుతూనే కొన్ని కొత్త పథకాలను ప్రవేశపెట్టామని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ వెల్లడించారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఆర్థిక, ప్రణాళిక, గణాంక శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. పలు పథకాలకు నిధుల కేటాయింపు క్రమాన్ని వివరించారు. 2023 సంవత్సరానికి గాను ఆర్థిక, సామాజిక సర్వేను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3.17 లక్షలకు చేరిందని, 2022–23లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15.6 శాతంగా నమోదయిందని వెల్లడించారు. కాగా హరీశ్‌రావు సుమారు 105 నిమిషాల్లో తన ప్రసంగాన్ని పూర్తి చేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు రూ.3210 కోట్లు

గత ఏడాది రూ.2,750 కోట్లు | 460 కోట్లు

- 2023–24 బడ్జెట్‌లో కేటాయించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: 'కల్యాణ' కానుకకు 2023–24 బడ్జెట్లో ప్రాధాన్యత దక్కింది. క్షేత్రస్థాయి నుంచి సాయం అందుకునే వారి సంఖ్య పెరుగుతుండడంతో కేటాయింపులను సైతం రాష్ట్ర ప్రభుత్వం అమాంతం పెంచేసింది. తాజా బడ్జెట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.3210 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.2750 కోట్లు కేటాయించగా... ఈసారి బడ్జెట్లో ఏకంగా రూ.460 కోట్లు పెంచింది. తాజా కేటాయింపులతో 3.20లక్షల మందికి కల్యాణ కానుక అందనుంది.

కేటాయింపులు(రూ.కోట్లలో)

సంక్షేమ శాఖ	2022–23	2023–24
బీసీ	1850	200
ఎస్సీ	400	500
మైనారిటీ	300	450
గిరిజన	200	260

తలసరి అప్పు.. రూ. 98,033

బడ్జెట్ అంచనాల మేరకు 23-24లో రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై అప్పు

- మొత్తంగా రూ.3.57 లక్షల కోట్లకు చేరనున్న రుణాలు.. పూచీకత్తు అప్పులు అదనం.. వడ్డీల చెల్లింపుల కోసమే బడ్జెట్‌లో రూ.22,407 కోట్లు కేటాయింపు..
- నాలుగేళ్లుగా జీఎస్‌డీపీతో పోలిస్తే తగ్గుతున్న అప్పుల శాతం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రజలపై తలసరి అప్పు లక్ష రూపాయలకు చేరువైంది. రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో తీసుకునేవి కలిపి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ.3,57,059 కోట్లకు (పూచీకత్తు రుణాలు కాకుండా) చేరనున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే.. ఒక్కొక్కరి తలపై అప్పు రూ.98,033కు చేరనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర అంచనాల మేరకు తలసరి అప్పు రూ.94 వేలు కాగా.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో నాలుగు వేలు పెరుగుతోంది. ఇక ప్రభుత్వం పూచీకత్తులు ఇచ్చి కార్పొరేషన్ల పేరిట తీసుకున్న రుణాలనూ కలిపితే.. తలసరి అప్పు మరో రూ.30వేల వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

జీఎస్‌డీపీతో పోలిస్తే తగ్గుదల

కాగా, రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన బడ్జెట్ గణాంకాల ప్రకారం గత నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో అప్పుల శాతం తగ్గుతోంది. 2020–21 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి జీఎస్‌డీపీలో 25.4 శాతం అప్పు ఉండగా, అదే 2023–24 సంవత్సరం ముగిసే సమయానికి ఇది జీఎస్‌డీపీలో 23.8 శాతానికి తగ్గుతుండడం గమనార్హం. ఇదే క్రమంలో 2021–22, 2022–23 సంవత్సరాల్లో కూడా జీఎస్‌డీపీలో అప్పుల శాతం తగ్గిందన్నమాట.



వడ్డీల చెల్లింపులకే రూ.22,407 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో తీసుకుంటున్న అప్పులకు వడ్డీల కింద ఈసారి రూ.22,407.67 కోట్లు చెల్లించనుంది. 2022–23లో వడ్డీల కింద రూ.18,911 కోట్లు చెల్లించగా.. ఈసారి మరో రూ.3,500 కోట్ల మేర పెరిగాయి.

➤ ఇక రుణాల తిరిగి చెల్లింపుల కింద ఈ ఏడాది ప్రభుత్వం రూ.12,606 కోట్లను చూపింది. ఇందులో ప్రజా రుణం కింద రూ.9,341.17 కోట్లు,, కేంద్రం నుంచి తీసుకునే రుణాలకు రూ.427.16 కోట్లు, ఇతర రుణాలకు రూ.2,837.76 కోట్లు తిరిగి చెల్లించనుంది.

తగ్గిన పూచీకత్తు రుణాలు!

2021–22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022–23లో వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, సంస్థలకు రుణాల కోసం ప్రభుత్వమిచ్చిన పూచీకత్తులు తగ్గిపోయాయి. 2021–22 ముగిసే నాటికి ప్రభుత్వ పూచీకత్తులు మొత్తం రూ.1,35,282.51 కోట్లు ఉండగా.. 2022–23లో రూ.1,29,243.60 కోట్లకు తగ్గాయి. పూచీకత్తు ఇచ్చి కార్పొరేషన్లు, సంస్థల పేరిట తీసుకునే రుణాలనూ ఎఫ్ఆర్‌బీఎం కింద రాష్ట్ర ప్రభుత్వ అప్పుగానే పరిగణిస్తామన్న కేంద్ర నిబంధనే దీనికి కారణం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏ కార్పొరేషన్‌కూ పూచీకత్తు ఇవ్వలేదు. ఇదే సమయంలో గత ఏడాది ఇచ్చిన పూచీకత్తుల అసలులో కొన్ని నిధులు చెల్లించడంతో.. 2022–23లో ప్రభుత్వ గ్యారెంటీలు రూ.6 వేల కోట్ల మేర తగ్గాయి. మొత్తంగా పూచీకత్తులతో కలిపి రాష్ట్ర రుణం రూ.4,52,235 కోట్లకు చేరడం గమనార్హం.

గత రెండేళ్లలో రాష్ట్ర అప్పుల గణాంకాలివీ.. (రూ.కోట్లలో)

	తీసుకున్నవి		తిరిగి చెల్లించినవి		ఇంకా ఉన్న అప్పు	
రుణ వనరు	2021–22	2022–23	2021–22	2022–23	2021–22	2022–23
బహిరంగ మార్కెట్	45,716	44,970	6,460.42	8,336.00	2,42,454.86	2,79,088.86
కేంద్రం ఇచ్చినవి	214.14	3,852.00	509.92	367.94	7,498.79	10,982.85
ఎన్ఎస్ఎస్ఎఫ్	-	-	827.30	827.30	6,377.77	5,550.46
ఆర్థిక సంస్థలు/బ్యాంకులు	1,278.53	1,500.00	1,044.79	2,070.66	14,208.23	13,637.57
ప్రావిడెంట్, బీమా నిధులు	2,658.66	3,006.74	1,591.63	2,185.72	12,912.19	13,733.21
మొత్తం	49,867.33	53,328.74	10,434.05	13,787.62	2,83,451.84	3,22,992.95

2016–17 నుంచి రాష్ట్ర అప్పుల తీరు.

సంవత్సరం	రుణాలు	జీఎస్‌డీపీలో శాతం
2016–17	1,29,531	20.04
2017–18	1,52,190	20.21
2018–19	1,75,281	20.25
2019–20	2,05,858	21.32
2020–21	2,44,019	25.04
2021–22	2,83,452	24.07
2022–23	3,22,993	24.30
2023–24 (అంచనా)	3,57,059	23.80

రాష్ట్ర సామాజిక-ఆర్థిక సర్వే నివేదిక

వృద్ధికి ద్రవ్యోల్బణం దెబ్బ!

2022-23లో క్షీణించనున్న జాతీయ, రాష్ట్ర వృద్ధిరేటు

- 2021-22లో జీఎస్డీపీ వృద్ధి రేటు 19.4%.. 2022-23లో 15.6 శాతానికి తగ్గుతుందన్న సర్కారు
- దేశ జీడీపీ పరిస్థితీ ఇంతేనని వ్యాఖ్య
- తలసరి ఆదాయంలో రాష్ట్రం దూకుడు.. 2022-23లో రూ.3,17,115కు చేరుతుందని అంచనా
- నిరుద్యోగ రేటు తగ్గుతోందని.. ఉద్యోగ భద్రత, సదుపాయాలు పెరుగుతున్నాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వృద్ధి రేటుపై ద్రవ్యోల్బణం ప్రభావం పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022–23లో రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటు గణనీయంగా తగ్గనుందని 'ముందస్తు ప్రాథమిక అంచనాలు (ప్రొవిజనల్ అడ్వాన్స్ ఎస్టిమేట్స్/పీఏఈ)' స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ధరల వద్ద 2021–22లో రాష్ట్ర జీఎస్డీపీ 19.4శాతం వృద్ధి రేటును నమోదుచేయగా.. 2022–23లో 15.6 శాతానికి తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. జాతీయ స్థాయిలో చూసినా.. 2021–22లో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 19.5శాతం వృద్ధిరేటు నమోదు చేయగా.. 2022–23లో 15.4 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. రాష్ట్ర శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టిన తెలంగాణ సామాజిక–ఆర్థిక సర్వే–2023 నివేదికలో ఈ గణాంకాలను వెల్లడించింది.

స్థిర ధరల వద్ద 7.4%

దేశ, రాష్ట్ర వృద్ధిరేటు తగ్గుదలకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరగడం, సప్లై మందగమనం, డిమాండ్ తగ్గడంతో వృద్ధికి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయని.. ప్రధానంగా తయారీ రంగంపై ఈ ప్రభావం అధికంగా ఉందని తెలిపింది. ఇక గత ఏడాది (2021–22) సాధించిన 19.4శాతం భారీ వృద్ధిరేటుపై అంతకు మించిన వృద్ధిరేటును ఈ ఏడాది ఆశించడం సాధ్యం కాదని వివరించింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014–15 నుంచి 2019–20 వరకు జాతీయ సగటును మించి వృద్ధిరేటును తెలంగాణ నమోదు చేసిందని.. కోవిడ్ తర్వాత కాలంలో జాతీయ సగటుతో సమానంగా వృద్ధి రేటు కొనసాగుతోందని పేర్కొంది. ఇక స్థిర (2011–12 నాటి) ధరల వద్ద 2022–23లో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 7.4 శాతం, దేశ జీడీపీ వృద్ధి రేటు 7శాతం ఉంటుందని అంచనా వేసింది.


తగ్గిన నిరుద్యోగం

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్) ప్రకారం రాష్ట్ర లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) 65.4 శాతంగా ఉంది. ఏదో ఒక పనిచేస్తూ లేదా ఏదైనా పనికోసం ఎదురు చూస్తున్న 15–59 ఏళ్ల జనాభా శాతాన్ని ఎల్ఎఫ్‌పీఆర్‌గా పరిగణిస్తారు. ఈ సర్వే ప్రకారం.. 2019–20తో పోల్చితే 2020–21లో రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 7.5 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) డేటా ప్రకారం.. 2022 ఏప్రిల్‌తో పోల్చితే 2022 డిసెంబర్‌లో రాష్ట్ర నిరుద్యోగ రేటు 9.9 శాతం నుంచి 4.1 శాతానికి దిగొచ్చింది. ముఖ్యంగా పట్టణాల్లోనే నిరుద్యోగం అధికంగా ఉంది. 2019–20తో పోల్చితే 2020–21లో గ్రామీణ నిరుద్యోగం 5.7శాతం నుంచి 3.6శాతానికి, పట్టణ నిరుద్యోగం 10.7శాతం నుంచి 8శాతానికి తగ్గాయి. ఇదే సమయంలో పురుషుల్లో నిరుద్యోగం 8.4శాతం నుంచి 5.5 శాతానికి, మహిళల్లో నిరుద్యోగం 6.1 శాతం నుంచి 4.5శాతానికి తగ్గాయి.

పెరిగిన ఉద్యోగ భద్రత

సామాజిక–ఆర్థిక సర్వే ప్రకారం.. రాష్ట్రంలో ఉద్యోగులకు సదుపాయాలు, భద్రత క్రమంగా పెరుగుతున్నాయి. 2019–20తో పోల్చితే 2020–21లో పెయిడ్ లీవ్‌కు అర్హతగల ఉద్యోగులు 45.2శాతం నుంచి 50.9శాతానికి.. పెన్షన్లు, ఆరోగ్య సేవలు వంటి సదుపాయాలు కలిగిన ఉద్యోగులు 40.8శాతం నుంచి 46.9శాతానికి పెరిగారు. రాతపూర్వక జాబ్ కాంట్రాక్టు కలిగిన ఉద్యోగులు 39.9శాతం నుంచి 36.2శాతానికి తగ్గారు. ఈఓడీబీ, టీ–ఐడియా, టీ–ప్రైడ్ వంటి కార్యక్రమాలతో పాటు ఐటీ, ఇతర సేవా రంగాలను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలతో ఉద్యోగుల పరిస్థితులు మెరుగయ్యాయని ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్ర, జాతీయ వృద్ధిరేటు తీరు



(ప్రస్తుత ధరల వద్ద గణాంకాలు)


జీఎస్డీపీ వృద్ధిలో మూడో స్థానం

➤ స్థిర ధరల వద్ద 2022–23లో రాష్ట్ర జీఎస్డీపీ విలువ రూ.13.27 లక్షల కోట్లు, దేశ జీడీపీ విలువ రూ.273.08 లక్షల కోట్లు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. 2021–22లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.11.48 లక్షల కోట్లు, దేశ జీడీపీ రూ.236.65 లక్షల కోట్లుగా నమోదైందని తెలిపింది.

➤ జీఎస్డీపీ వృద్ధిరేటులో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో (19.4 శాతంతో) నిలిచిందని.. ఒడిశా (20.5శాతం), మధ్యప్రదేశ్ (19.7 శాతం) తొలి రెండు స్థానాల్లో నిలిచాయని పేర్కొంది.

➤ 2021–22లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.9 శాతమని.. 2022–23లో కూడా ఇదే స్థాయిలో భాగస్వామ్యం ఉండనుందని ప్రభుత్వం అంచనా వేసింది.

జీడీపీలో రాష్ట్ర భాగస్వామ్యమిలా..






కాళేశ్వరం పర్యాటక ప్రాజెక్టుకు రూ.750 కోట్లు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకోసం ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌కు ప్రభుత్వం రూ.750 కోట్లు కేటాయించింది. కాళేశ్వరం ప్రధాన బ్యారేజీతోపాటు దాని పరిధిలోని పంప్‌హౌస్‌లున్న ప్రాంతాలు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ లాంటి జలాశయాల వద్ద తగిన వసతులు కల్పించనున్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేసేందుకు ఈ నిధులు వినియోగిస్తారు. ఈ పనులు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతాయి. గత బడ్జెట్‌లో కూడా ఇంతే మొత్తాన్ని కేటాయించినప్పటికీ, నిధులు విడుదల కాలేదు. దీంతో వాటిని ఈ బడ్జెట్‌లో మళ్లీ చూపించారు.

వ్యవసాయం
అంకెలు రూ. కోట్లలో



పౌరసరఫరాల శాఖ

బడ్జెట్ రూ. 3,117 కోట్లు

సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖకు ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో రూ. 3,117 కోట్లు కేటాయించింది. గత సంవత్సరం బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఈసారి పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, వినియోగదారుల ఫోరాలకు కలిపి రూ. 1,259 కోట్లు అధికంగా కేటాయించారు. పౌరసరఫరాల శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో రూ. 1,879 కోట్లు పేదలకు, విద్యార్థులకు అందిస్తున్న ఉచిత బియ్యంకు ఇచ్చే రాయితీలకే వెచ్చించనున్నారు. గతంలో రేషన్‌కార్డుదారులకు రూపాయికి కిలో బియ్యం పంపిణీ చేసిన ప్రభుత్వం 2020–21లో కరోనా నేపథ్యంలో ఉచితంగానే బియ్యం సరఫరా చేస్తోంది. కాగా ఈ సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ వరకు ఉచితంగానే బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉచిత సరఫరాకే మొగ్గు చూపిస్తోంది.

మత్స్యశాఖకు

రూ.530 కోట్లు

గత ఏడాది కంటే
రూ.65 కోట్లు అదనం

సాక్షి, హైదరాబాద్: వార్షిక బడ్జెట్‌లో మత్స్యశాఖకు ప్రభుత్వం రూ.530 కోట్లు కేటాయించింది. గత ఏడాది బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఈసారి రూ.65 కోట్లు అధికంగా కేటాయించారు. ఈ నిధులను ఉచిత చేపపిల్లలు, రొయ్యలు, మత్స్య, పారిశ్రామిక అభ్యున్నతికి, మత్స్యకారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు ఖర్చు చేయనున్నారు.

ఇంధన శాఖకు

రూ.9,486 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంధన శాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.9,486.92 కోట్లను కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ. 624.17 కోట్లు, ప్రగతి పద్దు కింద 8862.75 కోట్ల నిధులను ప్రతిపాదించింది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, గృహాలకు రాయితీపై విద్యుత్ సరఫరాకు గత బడ్జెట్‌లో రూ.7,665 కోట్ల విద్యుత్ సబ్సిడీలను కేటాయించగా, ఈసారి రూ. 8,260 కోట్లకు పెంచింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10,535 కోట్ల ఆదాయ లోటు ఉండనుందని, ఈమేరకు విద్యుత్ సబ్సిడీలను ప్రభుత్వం అందిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని రెండు నెలల కిందట రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు నివేదించాయి. ప్రభుత్వం రూ.8,260 కోట్ల విద్యుత్ సబ్సిడీలను మాత్రమే కేటాయించడంతో రూ. 2,275 కోట్ల ఆదాయ లోటు ఉండనుంది. ఈ మేరకు లోటు భర్తీకి ఈఆర్సీ ఏం నిర్ణయం తీసుకుంటుందో ఆసక్తికరంగా మారింది.

అటవీ శాఖకు

రూ.1,471 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో అటవీ, పర్యావరణ శాఖ, హరితహారం కార్యక్రమానికి కలిపి రూ.1,471 కోట్లు ప్రతిపాదించారు. ఇందులోనే అటవీ శాఖ సిబ్బంది వేతనాలు, వివిధ కార్యక్రమాల నిర్వహణ, ప్రాజెక్ట్ టైగర్, నెహ్రూ జూలాజికల్ పార్క్ నిర్వహణ, కంపా నిధుల్లో రాష్ట్ర వాటా, తదితరాలకు చేసిన కేటాయింపులున్నాయి. గతేడాది బడ్జెట్‌లో హరితహారానికి రూ.932 కోట్లు, ఇతర అవసరాలకు కలిపి రూ.1,410 కోట్ల కేటాయింపులు చేశారు. 2022–23 బడ్జెట్ మేజర్ స్కీమ్స్‌లో భాగంగా ఫారెస్ట్ కాలేజీ ఏర్పాటు కోసం రూ.వంద కోట్లు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,500 కోట్ల వ్యయంతో 13 లక్షల ఎకరాల అటవీ పునరుజ్జీవన కల్పన, 11 వేల కి.మీ పరిధిలో అడవుల రక్షణకు సరిహద్దు కంచెలను ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నివేదికలో దేశంలోనే పచ్చదనం పెంపుదలలో తెలంగాణ ప్రథమస్థానంలో నిలిచినట్టు పేర్కొన్నారు. దక్షిణ కొరియాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హార్టికల్చర్ ప్రొడ్యూసర్స్.. హైదరాబాద్ మహానగరానికి 'వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డు–2022'ను ప్రకటించింది.

రెగ్యులరైజేషన్‌పై హర్షం

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని అసెంబ్లీలో మంత్రి హరీశ్ రావు చేసిన ప్రకటనపై తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకృష్ణాగౌడ్, రాష్ట్ర కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అమలు సాధన సమితి కన్వీనర్ కొప్పిశెట్టి సురేశ్ హర్షం ప్రకటించారు. 23 ఏళ్లుగా పనిచేస్తున్న వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుందని కృతజ్ఞతలు తెలిపారు.

రుణమాఫీపై నీలినీడలు!

వ్యవ'సాయం' రూ. 26,831 కోట్లు | రూ. 2,577 కోట్లు ▲

రూ.17,991 కోట్లకుగాను కేటాయించింది రూ. 6,380 కోట్లే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతు రుణమాఫీపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత ఎన్నికల సందర్భంగా లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామన్న సర్కారు ఇందుకు రూ. 19,198 కోట్లు లెక్కగట్టగా ఇప్పటివరకు రూ. 37 వేలలోపు రుణాలున్న రైతులకు రూ. 1,207 కోట్లు మాత్రమే చెల్లించింది. ఇంకా రూ. 17,991 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం ఈ ఏడాదితో ముగుస్తుంది. కానీ రుణమాఫీకి ప్రభుత్వం 2023–24 బడ్జెట్లో రూ. 6,380 కోట్లే కేటాయించింది. అంటే అవసరమైన సొమ్ములో దాదాపు మూడో వంతు కేటాయించారు. మొత్తంగా 36.68 లక్షల మంది రైతులకు చెందిన రూ. 19,198.38 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 5.66 లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయగా మరో 31 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత కేటాయింపుతో ఎంతమంది రైతులు లబ్ధిపొందుతారన్నది స్పష్టం కావాల్సి ఉంది.

పంటనష్ట పరిహారానికి ఈ'సారీ'...

రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావించినా ఈ బడ్జెట్లో దానికి సంబంధించి ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. వాస్తవంగా నెల కిందట దీనికి సంబంధించి వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలో కొత్తగా బెంగాల్ తరహా పంటల బీమా పథకాన్ని ప్రారంభించి రైతులను ఆదుకోవాలని నిర్ణయించింది. కానీ చివరకు బడ్జెట్లో రైతులకు నిరాశ కలిగించింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నుంచి 2020లో వైదొలిగాక రాష్ట్రంలో ఎలాంటి పంటల బీమా పథకం అమలు కావడంలేదు. దీంతో పంట నష్టం జరిగినా రైతులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది.

మూడు పథకాలకే సింహభాగం కేటాయింపులు..

2022–23 బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ. 24,254 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఈసారి బడ్జెట్లో రూ. 26,831 కోట్లు కేటాయించింది. అంటే గత బడ్జెట్‌కన్నా సుమారు రూ. 2,500 కోట్ల మేర కేటాయింపులు పెంచింది. అయితే ఈసారి మొత్తం కేటాయింపుల్లో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ పథకాలకే సింహభాగం కేటాయించింది. రైతుబంధుకు 2022–23లో రూ. 14,800 కోట్లు కేటాయిస్తే 2023–24 బడ్జెట్లో రూ. 15,075 కోట్లు కేటాయించింది. రైతు బీమాకు 2022–23లో రూ. 1,466 కోట్లు కేటాయింపులు చేయగా ఈసారి బడ్జెట్లో రూ. 1,589 కోట్ల మేర కేటాయింపులు చేసింది. రైతు రుణమాఫీకి 2022–23 బడ్జెట్లో రూ. 4 వేల కోట్లు కేటాయించి విడుదల చేయని ప్రభుత్వం ఈసారి రూ. 6,380 కోట్లు కేటాయించింది. ఈసారి మొత్తం వ్యవసాయ బడ్జెట్‌లో ఈ మూడు పథకాలకే రూ. 23,049 కోట్లు కేటాయించింది. వ్యవసాయ విస్తరణ, అభివృద్ధికి కేటాయించింది తక్కువేనన్న విమర్శలున్నాయి.



రుణమాఫీ కోసం 31 లక్షల మంది ఎదురుచూపు
- ఊసేలేని పంటల బీమా పథకం.. రైతులకు తప్పని నిరాశ
- అత్యధికంగా రైతుబంధుకు రూ.15,075 కోట్లు కేటాయింపు

ప్రగతి పద్దులో వ్యవసాయ కేటాయింపులు

- వ్యవసాయ యాంత్రీకరణకు ప్రగతి పద్దులో రూ. 377.35 కోట్లు కేటాయించారు.
- రైతులకు విత్తనాల సరఫరా కోసం రూ. 39.25 కోట్లు
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ. 75 కోట్లు
- కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ. 17.50 కోట్లు
- రైతుబంధు సమితికి రూ. 3 కోట్లు
- రైతువేదికలకు రూ. 12 కోట్లు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌కు రూ. 75.47 కోట్లు
- వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలకు రూ. 1.99 కోట్లు
- విత్తనాభివృద్ధి సంస్థకు సాయం రూ. 25 కోట్లు
- మైక్రో ఇరిగేషన్‌కు కేవలం రూ. 1.25 కోట్లు
- ఉద్యాన కార్యకలాపాలకు ప్రోత్సాహం రూ. 7.50 కోట్లు
- ప్రభుత్వ ఉద్యానవనాల అభివృద్ధికి రూ. 3.50 కోట్లు

ఆయిల్‌పామ్ సాగుకు రూ. వెయ్యి కోట్లు...



రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టిపెట్టింది. నీటివనరులు పుష్కలంగా ఉండటంతో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రానున్న కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది దాదాపు 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా బడ్జెట్లో రూ. వెయ్యి కోట్లు కేటాయించింది.

ఇది ప్రజల బడ్జెట్



వ్యవసాయ రంగానికి రూ. 26,831 కోట్లు కేటాయించడంపై వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజల బడ్జెట్ అని, తమది రైతు ప్రభుత్వమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ సాగునీటి రంగానికి రూ. 26,885 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు రూ.వెయ్యి కోట్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 1,91,612 కోట్లు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. సీఎంకేసీఆర్ రైతు, వ్యవసాయ అనుకూల విధానాలు దేశానికి ఆదర్శమన్నారు. – వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

కేటాయింపే..ఖర్చేది?



వ్యవసాయరంగ మొత్తం కేటాయింపుల్లో రైతుబంధుకు, రైతుబీమా పథకాలకు తప్ప మిగిలిన వాటికి కేటాయించిన నిధులను ఎక్కువగా ఖర్చు చేయడం లేదని రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, విస్సా కిరణ్‌కుమార్ ఆరోపించారు. రైతు బంధుకు భారీగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులలో కనీసం 40 శాతం నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. ముఖ్యంగా ఈ నిధులు వ్యవసాయం చేయని రైతులకు, వ్యవసాయం చేయని భూములకు కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర సాగుదారుల్లో 35 శాతంగా ఉన్న కౌలు రైతులకుగానీ, పోడు రైతులకుగానీ, భూమిపై హక్కులులేని మహిళా రైతులకుగానీ ఒక్క రూపాయి కూడా రైతుబంధు సాయం అందడం లేదన్నారు.

– రైతు స్వరాజ్య వేదిక

రాష్ట్ర సామాజిక-ఆర్థిక సర్వే నివేదిక

తలసరి ఆదాయంలో రాష్ట్రం దూకుడు

తెలంగాణ ప్రజల తలసరి ఆదాయంలో దూసుకుపోతోందని ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సర్వేలో పేర్కొంది. 2021–22లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,75,443 కాగా.. 2022–23లో 15.1శాతం వృద్ధితో రూ.3,17,115కు పెరుగుతుందని అంచనా వేసింది. మరోవైపు దేశంలో ప్రజల తలసరి ఆదాయం 2021–22లో రూ.1,50,007 కాగా.. 2022–23లో 1,70,620కు పెరుగుతుందని పేర్కొంది. 2020–21లో రాష్ట్రంలో చూస్తే.. రంగారెడ్డి జిల్లా రూ.6,69,102 తలసరి ఆదాయంతో టాప్‌లో ఉందని.. హైదరాబాద్ (రూ.3,49,061), సంగారెడ్డి (రూ.2,49,091) తర్వాతి స్థానాల్లో ఉన్నాయని తెలిపింది.

రాష్ట్ర, జాతీయ వృద్ధిరేటు తీరు



ఆ రంగాల్లోనే ఉపాధి

రాష్ట్ర జీఎస్డీపీని వ్యవసాయం/అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవలు అనే మూడు రంగాల ఆర్థిక సహకారం ఆధారంగా లెక్కిస్తారు. తెలంగాణ ఆవిర్భావం నుంచీ రాష్ట్ర స్థూల విలువ జోడింపుకు సేవల రంగం అధిక సహకారం అందిస్తుండగా.. పరిశ్రమలు, వ్యవసాయం/అనుబంధ రంగాలు తర్వాతి స్థానాల్లో ఉంటున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం.. 2022–23లో తెలంగాణ జీఎస్వీఏకు సేవల రంగం 62.8శాతం, పరిశ్రమల రంగం 19శాతం, వ్యవసాయం/అనుబంధ రంగాలు 18.2శాతం తోడ్పాటు అందించాయి.

- 2022–23 ఆర్థిక సంవత్సరంలో సేవల రంగం 17.5శాతం, వ్యవసాయ రంగం 11.9 శాతం, పరిశ్రమల రంగం 10.5శాతం వృద్ధి నమోదు చేస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది.
- సామాజిక-ఆర్థిక సర్వే గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో ఉపాధి కల్పనకు వ్యవసాయ రంగమే అండగా నిలుస్తోంది. 2020–21 నాటికి రాష్ట్రంలో 45.8శాతం మందికి వ్యవసాయం, 21శాతం మందికి పరిశ్రమలు, 33.2 శాతం మందికి సేవల రంగం ఉపాధి కల్పిస్తోంది.

'ఊరి'కి కొత్త రూపం

రాష్ట్రంలోని గ్రామాల్లో మెరుగైన పాలన, అభివృద్ధి కోసం.. గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్య సాధన దిశగా భారీగా సంస్కరణలు అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం సామాజిక-ఆర్థిక సర్వే నివేదికలో పేర్కొంది. రాష్ట్ర జనాభాలో 61.12 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని తెలిపింది. కొత్త పంచాయతీరాజ్‌చట్టం ద్వారా పల్లె ప్రగతి, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించింది. 2019 సెప్టెంబర్ నుంచి 2022 డిసెంబర్ దాకా పంచాయతీరాజ్ సంస్థలకు రూ.11,088.80 కోట్లు (కేంద్రం, రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్‌ల కింద) విడుదల చేశామని వివరించింది. 2022–23లో పంచాయతీరాజ్ సంస్థలకు నెలకు రూ.256.66 కోట్ల చొప్పున మొత్తం రూ.1,684.47 కోట్లు విడుదల చేశామని.. ఐదు విడతల పల్లె ప్రగతిలో భాగంగా (2022 జూన్ దాకా) రూ.14,235.50 కోట్లు వ్యయం చేశామని వివరించింది. స్వయం సహాయక సంఘాలకు 2022–23 జనవరి 18 నాటికి రూ.12,684.59 కోట్లు ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపింది.

పుంజుకున్న పర్యాటకం

రాష్ట్రంలో పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలు ఎన్నో ఉన్నా.. వాటిపై ప్రచారం లేక పర్యాటకుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంటూ వస్తోంది. అయితే కోవిడ్ ఆంక్షల సడలింపు తర్వాత పర్యాటక రంగం పుంజుకుంది. రాష్ట్రంలో 2021–22లో 3,20,00,620 మంది దేశీయ టూరిస్టులు పర్యటించగా.. ఈ సంఖ్య 2022–23లో 6,07,48,425కు పెరిగింది. విదేశీయుల సంఖ్య కూడా 5,917 మంది నుంచి 68,401కి పెరిగింది.

రాష్ట్రానికి 'హరిత' హారం!



రాష్ట్రంలో 26,969.61 చదరపు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం విస్తరించి ఉందని.. మొత్తం తెలంగాణ భౌగోళిక ప్రదేశంలో ఇది 24.06 శాతం అని సామాజిక-ఆర్థిక సర్వేలో ప్రభుత్వం పేర్కొంది. ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం.. తెలంగాణలో అడవుల శాతం 2015లో 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా.. 2021 నాటికి 21,214 చ.కిలకు పెరిగినట్టు తెలిపింది. హరితహారంతోపాటు ఇతర కార్యక్రమాలతోపాటు అడవుల పునరుద్ధరణ జరుగుతోందని పేర్కొంది.

- 2011–21 మధ్య అతి తక్కువగా అడవులు, పచ్చదనం క్షీణత నమోదైన ఏడు నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని ప్రభుత్వం తెలిపింది.
- పట్టణప్రాంతాల్లో 109 అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి చేపట్టగా.. ఇప్పటికే 77 పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని వివరించింది.
- 2020, 2021 సంవత్సరాల్లో ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (యూఎన్ ఎఫ్ఏఓ) ద్వారా 'ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్'గా హైదరాబాద్ గుర్తింపు పొందిందని గుర్తు చేసింది.

పల్లెకు పట్టాభిషేకం

బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,426 కోట్లతో అగ్రతాంబూలం

- గతేడాది రూ.29,586 కోట్ల నుంచి పెరిగిన కేటాయింపులు
- గ్రామ పంచాయతీల ఖాతాల్లోకి నేరుగా ఫైనాన్స్ కమిషన్ నిధులు
- గ్రామీణరోడ్ల మెయింటెనెన్స్‌కు రూ.2 వేల కోట్లు

పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖలో విభాగాల వారీగా బడ్జెట్ ఇలా(రూ. కోట్లలో)

	2022-23	2023-24
ఆసరా పింఛన్లు	11,728	12,000
జీతాలు, మెయింటెనెన్స్	7,000	9,072
పల్లెప్రగతి	3,330	3,360
గ్రామీణ రోడ్ల నిర్వహణ(ఎఫ్‌డీఆర్‌కలిపి)	1,000	2,000
గ్రామీణరోడ్ల నిర్మాణం	585	587
జాతీయ ఉపాధి హామీ మ్యాచింగ్ గ్రాంట్	1,710	1.635
మిషన్ భగీరథ(మెయింటెనెన్స్)	480	1,000
వడ్డీలేని రుణాలు(గ్రామీణ)	---	849
మిషన్‌భగీరథ	520	600
ఎస్టీ పంచాయతీల్లో జీపీ భవనాల నిర్మాణం	300	300

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో పల్లెకు పట్టాభిషేకం చేశారు. అత్యధిక కేటాయింపులు చేసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అగ్రతాంబూలం ఇచ్చారు. మొత్తం రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌లో పీఆర్‌శాఖకు రూ.31,426 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్‌లో ఇచ్చిన రూ.29.586 కోట్ల కేటాయింపుల కంటే రూ.1,840 కోట్లు అధికం. ఐతే పీఆర్ శాఖతోపాటు మిషన్ భగీరథకు ఇచ్చిన రూ. 600 కోట్లు కూడా కలిపితే ఉమ్మడిగా (పీఆర్, ఆర్‌డీ, మిషన్‌భగీరథ శాఖకు కలిపి) రూ.32,026 కోట్లు కేటాయించినట్టు అవుతుంది. వివిధ పథకాలు, కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయింపులు కోరుతూ ఈ శాఖ ఉన్నతాధికారులు పంపిన ప్రతిపాదనలకు ఆర్థికశాఖ చాలామటుకు ఆమోదముద్ర వేసినట్టు సమాచారం. కొత్తగా వేసే గ్రామీణ రోడ్లతోపాటు గతంలో వేసిన రోడ్ల నిర్వహణకు కలిపి రూ.2,587 కోట్లు, మిషన్ భగీరథ మెయింటెనెన్స్, మిషన్‌భగీరథ ఇతర ఖర్చుల కోసం రూ.1,600 కోట్లు, జూనియర్ పంచాయతీ సెక్రెటరీల సర్వీసుల క్రమబద్ధీకరణ, దానికి తగ్గట్టుగా వేతనాల పెంపు నిమిత్తం రూ.315 కోట్లు, వడ్డీలేని రుణాల కోసం రూ.849 కోట్లు, గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల పేస్కేళ్ల సవరణ నిమిత్తం కేటాయింపులు చేశారు. కాగా, పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి నిధులతోపాటు ఫైనాన్స్ కమిషన్ నిధులను కూడా స్థానిక సంస్థల ఖాతాల్లోకి బదిలీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఫైనాన్స్ ట్రెజరీల ఆమోదం కోసం వేచిచూడకుండా స్వతంత్రంగా నిధులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.



'సంక్షేమం' కాస్త మెరుగు!



గత బడ్జెట్‌తో పోలిస్తే సంక్షేమ శాఖలకు పెరిగిన నిధులు | ఎస్సీలకు దళితబంధు కింద రూ.17,700 కోట్లు | బీసీల స్వయం ఉపాధికి మాత్రం అరకొరగానే కేటాయింపులు


సాక్షి, హైదరాబాద్

సంక్షేమ శాఖలకు 2023–24 వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు మెరుగుపడ్డాయి. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి నిధులు కాస్త పెరిగాయి. నూతన నియామకాలు, ఇతరత్రా ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను పెంచింది. అయితే పెరిగిన కేటాయింపులతో మాత్రం క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలకు పెద్దగా ప్రయోజనం లేదు. గత బడ్జెట్‌లో సంక్షేమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలకు జరిగినట్లుగానే ఈదఫా అటుఇటుగా కేటాయింపులు చేశారు. ఎస్సీ అభివృద్ధి శాఖ (ఎస్సీడీడీ)కు గత బడ్జెట్ కంటే దాదాపు రూ.400 కోట్లు పెరిగాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న దళితబంధు పథకానికి ఈసారి కూడా రూ.17,700 కోట్లు కేటాయించారు. అయితే ఈ పథకం కింద 2022–23లో ఎలాంటి ఖర్చులు చేయలేదు. ఆ నిధులనే ఈసారి క్యారీఫార్వర్డ్ చేశారు.

బీసీలకు అంతంతే...!

బడ్జెట్ వెనుకబడిన తరగతుల్లో పెద్దగా ఉత్సాహం నింపలేదు. ఈసారి బీసీ సంక్షేమ శాఖకు రూ.6,229 కోట్లు కేటాయించగా, గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.531 కోట్లు పెరిగాయి. తాజాగా బీసీ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు చొప్పున కేటాయించారు. గత బడ్జెట్‌లో ఎంబీసీ కార్పొరేషన్లకు రూ.400 కోట్లు కేటాయించగా... ఈసారి రూ.100 కోట్లు తగ్గింది. 2022–23లో ఈ రెండు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికి సంబంధించిన పథకాలేవీ అమలు కాలేదు. దీంతో గత కేటాయింపులే ఈసారీ జరిపినట్లు చెప్పొచ్చు. ఇక రజక, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్లకు గత బడ్జెట్ మాదిరిగానే ఈసారీ రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు. కల్లుగీత కార్మికుల ఫెడరేషన్‌కు కూడా గతంలో మాదిరిగానే రూ.30 కోట్లు కేటాయించగా... మిగతా ఫెడరేషన్లకు నామమాత్రపు నిధులే కేటాయించడంతో ఆయా వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసినట్టైంది. బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల పరిధిలో 2023–24 సంవత్సరంలో కొత్త విద్యా సంస్థల ఏర్పాటు, ప్రస్తుత సంస్థల అప్‌గ్రెడేషన్, తరగతుల పెరుగుదల, కొత్తగా ఉద్యోగుల నియామకాలు తదితరాలకు నిధుల ఆవశ్యకత పెరగడంతో కేటాయింపుల్లో పెరుగుదల కనిపిస్తోంది. అదేవిధంగా క్రిస్టియన్ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్‌లకు ఆర్థిక చేకూర్పు పథకాల కింద 270 కోట్లు కేటాయించారు. కార్మిక సంక్షేమ శాఖకు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలకు కూడా కేటాయింపులు కాస్త మెరుగుపడ్డట్లు బడ్జెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ శాఖల పరిధిలో కొత్త పథకాల ఊసులేదు.

గత బడ్జెట్‌తో పోలిస్తే సంక్షేమశాఖలో కేటాయింపులు ఇలా.. (రూ.కోట్లలో)





చెప్పేది గొప్ప.. చేసేది సున్నా: ఈటల



రాష్ట్ర ప్రభుత్వం చెప్పేది గొప్ప.. చేసేది సున్నా. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 50 శాతం కూడా విడుదల కావడం లేదు. సంక్షేమశాఖలకు డబ్బులు విడుదల చేయకుండా మోసం చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే. రుణమాఫీ చేస్తామని మేనిఫెస్టో ప్రకటించి నాలుగున్నరేళ్లయినా మాఫీ చేయలేదు. కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. కేసీఆర్ కిట్, అంగన్‌వాడీలకు నిధులు సకాలంలో అందడం లేదు. ఆరోగ్యశ్రీ నిధులు విడుదల లేక ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందడం లేదు. కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

విద్య

అంకెలు రూ. కోట్లలో



మార్కులు కొంచెం మెరుగు

చదివింపులు రూ.19,093 కోట్లు ▲ 3,050 కోట్లు

- సింహభాగం వేతనాలకే చెల్లు
- ఇంటర్‌విద్యకు కోత.. ఉన్నత విద్యకు కొంత

సాక్షి, హైదరాబాద్


రాష్ట్ర బడ్జెట్‌లో ఈసారి చదివింపులు పెరిగాయి. అక్షరాలా రూ.19,093 కోట్లు కేటాయించారు. గతేడాది (2022–23) రూ.16,043 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.3,050 కోట్ల మేర పెరిగాయి. పాఠశాల విద్యకు రూ.16,092 కోట్లు ఇవ్వగా, ఉన్నత విద్యకు రూ.3,001 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో చాలావరకూ ఉద్యోగుల వేతనాలు, సంస్థల నిర్వాహణకే సరిపోతుంది. ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖలో పదోన్నతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ప్రమోషన్లు పొందే ఉద్యోగుల వేతనాలు పెరుగుతాయి. ఇప్పటికే ఉన్న ఖాళీలు, పదోన్నతుల వల్ల ఏర్పడే ఖాళీలు కలుపుకుని పాఠశాలవిద్యలో దాదాపు 18 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే దీనికి సంబంధించిన నిధుల అంశాన్ని బడ్జెట్‌లో ఎక్కడా పేర్కొనలేదు. ఉన్నతవిద్యకు అత్తెసరుగానే నిధులు కేటాయించారు. సాంకేతిక, కళాశాల విద్యకు నిధులు తగ్గాయి. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పనకు, గతేడాది ప్రకటించిన మహిళావర్సిటీకి కలిపి రూ.600 కోట్లు కేటాయించారు. గతేడాది మహిళావర్సిటీకి రూ.వంద కోట్లు కేటాయించినా, అవి ఖర్చవ్వలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'మన ఊరు–మనబడి'పథకానికి ప్రణాళికేతర పద్దుల్లో నిధులు ఖర్చుచేయాలని నిర్ణయించారు.



కొన్ని ముఖ్యాంశాలు

- ఆంగ్ల మాధ్యమాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాల ముద్రణకు నిధులు పెంచారు. పాఠశాల విద్యలో గతంలో రూ.32.07 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ. 73.07 కోట్లకు పెంచారు.
- కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో నిర్వహించే సమగ్ర శిక్షా అభియాన్‌కు రాష్ట్రవాటాను రూ.799.91 కోట్ల నుంచి రూ.1,100 కోట్లకు పెంచారు.
- అసంపూర్తిగా ఉన్న మోడల్ స్కూల్ భవన నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చి నిధులను రూ.2.66 కోట్ల నుంచి రూ.6.68 కోట్లకు పెంచారు.
- ప్రధానమంత్రి పోషక్ (మధ్యాహ్న భోజనం) పథకానికి రాష్ట్రవాటాను రూ.2.66 కోట్ల నుంచి రూ.6.68 కోట్లకు పెంచారు.
- కళాశాల విద్యలో భవన నిర్మాణాల నిర్వహణకు గతేడాది రూ.62.27 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.42.34 కోట్లకు తగ్గించారు.
- ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు గతంలో మాదిరిగానే రూ. 1.59 కోట్లే కేటాయించారు. అదనపు నిధుల ప్రతిపాదనకు మోక్షం దక్కలేదు.
- ఇంటర్‌విద్య కేటాయింపులు గతేడాదితో పోలిస్తే రూ.34.60 నుంచి 13.13 కోట్లకు తగ్గాయి.

విద్యా రంగం కేటాయింపులు ఇలా... (రూ. కోట్లలో)



పురోగతికి విఘాతమే.. విద్యా రంగానికి 6.75% నిధులే కేటాయించడం పురోగతికి విఘాతమే. ఉమ్మడి ఏపీ 11%, ఢిల్లీ 23%, బిహార్ 18%, రాజస్తాన్ 17% నిధులు కేటాయించాయి.

– చావా రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎస్ యూటీఎఫ్

ఉపకారానికి 'ఉపకారం'..!

కేటాయింపులు రూ.5,609 కోట్లు ▲ 919 కోట్లు

సాక్షి, హైదరాబాద్: కళాశాల విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో కరుణ చూపింది. గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల డైట్ చార్జీలకూ ప్రాధాన్యత ఇచ్చింది. ఈ క్రమంలో 2023–24 బడ్జెట్లో కేటాయింపులను భారీగా పెంచేసింది. ఏకంగా రూ.5,609 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్లో రూ.4,690 కోట్లు కేటాయించగా... ఈసారి అదనంగా రూ.919 కోట్లు పెంచింది. ఈ పెరుగుదలతో ఇప్పటివరకు వివిధ సంక్షేమ శాఖల్లో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మోక్షం కలగనున్నట్లు అధికార వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. మరోవైపు బీసీ, మైనార్టీ గురుకులాల సంఖ్య పెరగడంతో ఆయా విద్యాలయాల్లో విద్యార్థులకు డైట్ పథకాల అమలు కోసం బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయి. పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు తాజా బడ్జెట్లో రూ.2877 కోట్లు కేటాయించింది.



గత, ప్రస్తుత కేటాయింపులు(రూ.కోట్లలో)

కేటగిరీ	2022–23	2023–24
ఫీజు రీయింబర్స్‌మెంట్	2,422	2,877
డైట్	1,764	2,036
స్టైపెండ్	169	316
ఓవర్సీస్	170	209
ఉపకారవేతనాలు	164	172

'అక్షరాలా' నిర్లక్ష్యమే..

- విద్యారంగానికి అరకొర కేటాయింపులు
- ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. కనీసం 10 శాతం నిధులైనా కేటాయిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డాయి. 6.75 శాతానికి పరిమితం చేస్తే విద్యాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించాయి.

ఒక్క శాతం నిధులా?

జీతాలకే సరిపోయేలా నిధులు ఇవ్వడం విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. ఉన్నత విద్యకు కేవలం ఒక్క శాతం నిధులా? మన ఊరు–మనబడిపైనైనా స్పష్టత ఇస్తే బాగుండేది.

– ముత్యాల రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీపీటీఎఫ్

ఇది నిర్లక్ష్యమే

పాఠశాల విద్యకు కేవలం 5.54 శాతం నిధులే ఇచ్చి, నిరాశ పరిచారు. కొఠారి కమిషన్‌తో పాటు అనేక ఇతర కమిటీలు విద్యారంగానికి రాష్ట్రాల వార్షిక బడ్జెట్లో 20 శాతం తగ్గకుండా నిధులు కేటాయించాలని సిఫార్సు చేస్తే, తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

– టి.లింగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీటీఎఫ్

పూర్తిగా విస్మరించారు

బడ్జెట్ కేటాయింపుల్లో విద్యా రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. యూనివర్సిటీల అభివృద్ధి మాట గాలికొదిలారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు లేదు.

– కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, ఏఐఎస్ఎఫ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ మాటేమిటి?

ఇప్పటికీ దాదాపు రూ.4వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాలి. విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇందుకు అవసరమైన నిధులు పెంచకపోతే పరిష్కారం ఎలా?

– నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

డబుల్ రోడ్లకు రూ. 2,007 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పూర్తిగా మందగించిన డబుల్ రోడ్ల నిర్మాణాన్ని మళ్లీ పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం రూ.2,007 కోట్లు కేటాయించింది. గతేడాదితో పోలిస్తే రూ.7 కోట్లు తక్కువ. గత బడ్జెట్ కేటాయింపుల్లో పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవటంతో పనులు బాగా మందగించాయి. ఈసారి ప్రతిపాదించిన నిధులు ఎంతమేర విడుదలవుతాయో వేచిచూడాలి. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలు, జిల్లా కేంద్రాల నుంచి రాజధానికి డబుల్ రోడ్లను గతంలోనే ప్రభుత్వం పెద్దఎత్తున ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆదిలో చాలావేగంగా పనులు జరిగినప్పటికీ, రెండేళ్లగా నిధులు పూర్తిస్థాయిలో అందక పడకేశాయి. గత రెండేళ్లగా భారీ వర్షాలతో రోడ్లకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. కానీ, వరద ప్రభావిత రోడ్ల పునర్నిర్మాణానికి నిధులు లేక పనులు జరగలేదు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. ఇటీవలే సీఎం ఆ పనులపై సమీక్షించి రూ.2,500 కోట్లు మంజూరు చేశారు. వరదతో దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణతోపాటు దెబ్బతిన్న రోడ్ల రెన్యూవల్ పనులు కూడా చేపట్టాలని ఆదేశించారు. ఇప్పుడు బడ్జెట్‌లో నాన్‌ప్లాన్ కింద ఆ పనులకు రూ.2,434 కోట్లు, భవనాల కోసం రూ.1,515 కోట్లు కేటాయించారు. ఇందులో కొత్త సచివాలయ భవనం పూర్తికి రూ.400 కోట్లు ప్రతిపాదించారు. రీజినల్ రింగురోడ్డు భూసేకరణకు సంబంధించి ఉత్తర భాగంలో రాష్ట్రప్రభుత్వ వాటాగా రూ.2,600 కోట్లు చెల్లించాల్సి ఉంది. దానికిగాను రూ.500 కోట్లు ప్రతిపాదించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.1,600 కోట్లు కేటాయించారు.



సొంత పన్నులు పైపైకి..

2023-24లో రూ.1.31 లక్షల కోట్లు వస్తాయని అంచనా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం పన్నుల రాబడిలో స్వయం సమృద్ధి సాధిస్తోంది. ఏటేటా పెరుగుతున్న సొంత ఆదాయ వనరులే ధీమాగా ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌కు రూపకల్పన చేయడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. బడ్జెట్ గణాంకాలను పరిశీలిస్తే 2022–23 (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం)లో రాష్ట్ర పన్నుల కింద రూ.1.10 లక్షల కోట్లకు పైగా సమకూరగా, 2023–24కు ఇవి రూ.1.31 లక్షల కోట్లకు పెరగనున్నాయి. ఇందులో ముఖ్యంగా ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల పద్దు కిందనే రూ.40వేల కోట్ల వరకు సమకూరనుండగా, ఎక్సైజ్ పద్దు కింద రూ.19,884 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.18,500 కోట్ల ఆదాయం రానున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. దీనికితోడు రాష్ట్రంలో జరిగే వ్యాపారం, అమ్మకాల ద్వారా రూ.39,500 కోట్లు, వాహనాలపై పన్నుల ద్వారా రూ.7,512 కోట్లు సమకూరనున్నాయి. ఇతర ఆదాయాలతో కలిపితే మొత్తం రూ.1.31 లక్షల కోట్లు దాటుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

అప్పుల రూపంలో రూ. 46 వేల కోట్లు

రెవెన్యూ రాబడుల కింద పరిగణించే అప్పుల రూపంలో రూ.46వేల కోట్లకు పైగా ప్రతిపాదించింది. ఇందులో బహిరంగ మార్కెట్‌లో తీసుకునే రుణాలు రూ.40,615 కోట్లు కాగా, కేంద్రం, ఇతర సంస్థల నుంచి మరో రూ.6 వేల కోట్లు తీసుకోనున్నట్టు ప్రతిపాదించింది. కాగా, అంతర్రాష్ట్ర సెటిల్‌మెంట్ల కింద ఈసారి బడ్జెట్ రాబడులను రూ. 17,828 కోట్ల కింద చూపెట్టారు. ఈ నిధులు ఏపీ నుంచి రావాల్సి ఉందని, డిస్కంల కింద తమకు ఏపీ చెల్లించాల్సింది ఉందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తాన్ని మంజూరు చేస్తే ఏపీ ఇచ్చినప్పుడు తిరిగి చెల్లిస్తామని ఇటీవల కేంద్రానికి రాసిన లేఖ మేరకు నిధులు వస్తాయనే అంచనాతో ఈ మొత్తాన్ని ప్రతిపాదించినట్లు పేర్కొంటున్నాయి. ఇదే పద్దు కింద 2022–23లో నిధులు చూపకపోయినా సవరించిన అంచనాల్లో అంతర్రాష్ట్ర వివాదాల పరిష్కారం కింద రూ.7,500 కోట్లు సమకూరినట్టు చూపడం గమనార్హం.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.18,500 కోట్లు

ఎక్సైజ్ ఆదాయం రూ.19,884 కోట్లు

అంతర్రాష్ట్ర సెటిల్‌మెంట్ల రూపంలో రూ.17,828 కోట్లు

బహిరంగ మార్కెట్ రుణాలు రూ. 40,615 కోట్లు

గత నాలుగేళ్లలో పన్ను ఆదాయం ఇలా..

సంవత్సరం	రాష్ట్ర పన్నుల ఆదాయం (రూ.కోట్లలో)
2020-21	66,650.37
2021-22	91,271.42
2022-23	1,10,592.28
2023-24	1,31,028.65

మూడేళ్ల క్రితం లక్ష కోట్లు


సంవత్సరాలవారీగా లెక్కిస్తే రెవెన్యూ రాబడుల్లో గణనీయ వృద్ధి కనిపిస్తోందని బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. మూడేళ్ల క్రితం అంటే 2020–21లో అన్ని రకాల పన్నులు, ఆదాయాలు కలిపి రెవెన్యూ రాబడుల కింద ఖజానాకు రూ.లక్ష కోట్లు సమకూరితే 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అవి రూ.2.16 లక్షల కోట్లకు చేరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. 2021–22లో రూ.1.27 లక్షల కోట్లు రాగా, 2022–23 సవరించిన అంచనాల ప్రకారం రూ.1.75 లక్షల కోట్లు రానుండటం గమనార్హం.

ఆ రెండు పద్దులు.. రూ.62 వేల కోట్లు

కేంద్రంపై ఆశలతో భారీగా 'గ్రాంట్స్', కేంద్ర పన్నుల్లో వాటా కింద రాబడి చూపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన రీతిలో కేంద్ర ప్రభుత్వం తగినన్ని గ్రాంట్లు ఇవ్వడం లేదని గత మూడు బడ్జెట్‌ల గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. పన్నుల్లో వాటా కింద ప్రతిపాదించిన నిధులు కూడా కేంద్రం ఇవ్వడం లేదని రాష్ట్రం ఆరోపిస్తోంది... కానీ, కేంద్రంపై ఆధారపడి ఉన్న రెండు పద్దుల కింద మాత్రం తాజా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులను చూపెట్టింది. వచ్చే ఏడాదికైనా కేంద్రం వైఖరిలో మార్పు రాకపోతుందా అనే ఆశతో పెట్టిన గ్రాంట్స్ ఇన్ ఎయిడ్, కేంద్ర పన్నుల్లో వాటా కింద మొత్తం రూ. 62,730.01 కోట్ల మేర రాబడులను ఈసారి బడ్జెట్‌లో చూపెట్టడం గమనార్హం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సోమవారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.41,259.17 కోట్లు చూపెట్టగా, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.21,470.84 కోట్లు చూపారు. అయితే, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు కింద గత ఏడాది (2021–22) వచ్చింది కేవలం రూ.8,619 కోట్లు మాత్రమే. 2022–23 బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ. 41,001.73 కోట్లు వస్తుందని ప్రతిపాదించినా డిసెంబర్ నాటికి వచ్చింది రూ.7,770.92 కోట్లే. మిగిలిన మూడు నెలల్లో ఎంత వస్తుందనే అంచనా మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు కింద ఏకంగా రూ.30,250 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు 2022–23 సవరించిన అంచనాల్లో పేర్కొంది. అయితే, వచ్చే ఏడాది (2023–24)కి గాను తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 30వేల కోట్లకు మరో రూ.11వేల కోట్లు అదనంగా 'గ్రాంట్స్'రూపంలో రూ.41,259.17 కోట్లు వస్తాయని అంచనా వేయడం గమనార్హం. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి గ్రాంట్స్ పద్దు కింద రాష్ట్రం ఆశిస్తున్న మొత్తానికి, కేంద్రం ఇస్తున్న నిధులకు చాలా వ్యత్యాసం ఉంది. కరోనా కష్టకాలంలో 2019–20, 2020–21 ఆర్థిక సంవత్సరాల్లో మినహా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన మేరకు కాదు కదా అందులో సగం కూడా ఎప్పుడూ కేంద్రం ఇవ్వలేదు.

2014 నుంచి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు కింద వచ్చిన నిధులు



పన్నుల్లో వాటా... పరవాలేదా?

ఇక, కేంద్ర పన్నుల్లో వాటా విషయంలో ప్రతిపాదనలు, మంజూరు గణాంకాలు కొంత ఆశాజనకంగానే ఉన్నా కేటాయించిన మేరకు రాష్ట్రాలకు పన్నుల్లో వాటా ఇవ్వడం లేదని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. కేంద్ర పన్నుల్లో వాటా కింద 2021–22లో రూ.18,720.54 కోట్లు కేంద్రం నుంచి రాగా, 2022–23 సవరించిన అంచనాల మేరకు రూ.19.668.15 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇక, తాజా బడ్జెట్‌లో ఈ పద్దును రూ.21,470.84 కోట్లుగా చూపెట్టడం గమనార్హం. మొత్తం మీద కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయంగా విభేదాలున్నప్పటికీ కేంద్రంపై నమ్మకంతో తాజా బడ్జెట్‌లో ఈ రెండు పద్దుల కింద రూ.62 వేల కోట్ల (దాదాపు 20 శాతం) రాబడులు చూపారు. ఇదే విషయమై ఆర్థిక శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ.. కేంద్ర పన్నుల్లో వాటా కింద రావాల్సిన నిధులను అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్రం తెలంగాణకు కూడా కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు కింద కొన్నేళ్లుగా తక్కువగానే వస్తున్నా కేంద్రంపై ఆశలు పెట్టుకునే ప్రతిపాదనలు చేశామని చెప్పారు.

దళిత, గిరిజనులకు భారీ 'నిధి'

కేటాయింపులు రూ.51,983.09 కోట్లు ▲ 4,632.72 కోట్లు



సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) చట్టానికి తాజా బడ్జెట్లో ప్రభుత్వం భారీ కేటాయింపులు చేసింది. 2023–24 బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు ఏకంగా రూ. 51,983.09 కోట్లు కేటాయించింది. ఇందులో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 36,750.48 కోట్లు, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ. 15,232.61 కోట్ల చొప్పున నిధుల కేటాయింపులు చేసింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి ఎస్‌డీఎఫ్ కేటాయింపులు రూ. 4,632.72 కోట్లు పెరిగాయి. ఇందులో ఎస్సీఎస్‌డీఎఫ్ కేటగిరీలో రూ. 2,182.73 కోట్లు పెరగగా... ఎస్టీఎస్‌డీఎఫ్ కేటగిరీలో రూ. 1,819.99 కోట్లు పెరిగాయి. దళిత, గిరిజనులకు భారీ స్థాయిలో నిధులివ్వడంతో ఆయా వర్గాల సమగ్ర అభివృద్ధి ముందుకు సాగనుంది.

దళితబంధుకు 17,700 కోట్లు..

తాజా బడ్జెట్‌లో దళితబంధు వాటా అగ్రభాగాన నిలిచింది. 2023–24 బడ్జెట్లో దళితబంధు పథకానికి ప్రభుత్వం రూ. 17,700 కోట్లు కేటాయించింది. హుజూరాబాద్ మినహా మిగతా 118 అసెంబ్లీ నియోజకవర్గాలకు 2023–24 వార్షిక సంవత్సరంలో ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. ఒక్కో నియోజకవర్గానికి 1500 యూనిట్ల చొప్పున లబ్ధిదారుల ఎంపిక చేయనుంది.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి ఏర్పాటు తర్వాత బడ్జెట్‌లో కేటాయింపులు ఇలా... (రూ. కోట్లలో)

కేటగిరీ	2021-22	2022-23	2023-24
ఎస్సీ ఎస్‌డీఎఫ్	21,306.84	33,937.75	36,750.48
ఎస్టీ ఎస్‌డీఎఫ్	12,304.22	13,412.62	15,232.61

మూలధన వ్యయం రూ.37 వేల కోట్లు

- గత బడ్జెట్ కంటే రూ. 8 వేల కోట్లు అధికంగా ప్రతిపాదన
- సవరించిన అంచనాలతో పోలిస్తే రూ. 11 వేల కోట్ల వరకు పెంపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం కింద రూ. 37,524.70 కోట్లు వెచ్చించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. మొత్తం బడ్జెట్ పరిమాణంలో ఇది దాదాపు 13 శాతం. 2022–23 బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. 29,728.44 కోట్ల మూలధన వ్యయ కేటాయింపులతో పోలిస్తే ఈసారి కేటాయింపులు రూ. 8 వేల కోట్లు అధికం. అదే సవరించిన బడ్జెట్ 2022–23 అంచనాల (రూ. 26,934.02 కోట్లు) ప్రకారం అయితే సుమారు రూ. 11 వేల కోట్లు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి మూలధన వ్యయ కేటాయింపులు భారీగా పెంచడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇందులో మొదటిది కేంద్రం తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన వడ్డీలేని రుణాలని పేర్కొంటున్నారు. రాష్ట్రాలకు రూ. 5 లక్షల కోట్ల వరకు వడ్డీలేని రుణాలిస్తామని, కానీ వాటిని మూలధన వ్యయం కిందనే వెచ్చించాలని కేంద్రం పేర్కొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో మూలధన వ్యయ కేటాయింపులను పెంచిందని వివరిస్తున్నారు. అలాగే రాష్ట్ర బడ్జెట్ పరిమాణం ఈసారి దాదాపు రూ. 34 వేల కోట్లు పెరిగిన నేపథ్యంలో ఆ మేరకు మూలధన వ్యయాన్ని ప్రభుత్వం పెంచిందని చెబుతున్నారు.

పరిశ్రమకు 'ప్రోత్సాహం'

కేటాయింపులు రూ.4,037 కోట్లు ▲ 817 కోట్లు



సాక్షి, హైదరాబాద్: పారిశ్రామికాభివృద్ధి ప్రోత్సాహకాలకు పెద్దపీట వేస్తూ పారిశ్రామిక రంగానికి 2023–24 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో రూ.4,037 కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుత (2022–23) బడ్జెట్‌తో పోలిస్తే రూ.817 కోట్లు అదనంగా కేటాయించారు. నిర్వహణ పద్దు కింద రూ.254.77 కోట్లు, ప్రగతి పద్దు కింద వివిధ అవసరాల కోసం రూ.2,235.29 కోట్లు కేటాయించారు. వీటితో పాటు ఎస్సీ అభివృద్ధి నిధి నుంచి రూ.834.67 కోట్లు, ఎస్టీ అభివృద్ధి నిధి నుంచి రూ.717.25 కోట్లు కేటాయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రూ.2,937.20 కోట్లు (సుమారు 72 శాతం) కేటాయించారు. విద్యుత్ సబ్సిడీకి రూ.316.39 కోట్లు, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పావలావడ్డీని వర్తింప చేస్తూ రూ.266.20 కోట్లు ప్రతిపాదించారు.

నేత కార్మికుల బీమాకు రూ.50 కోట్లు

నేత కార్మికుల బీమాకు రూ.50 కోట్లు, పరిశ్రమల శాఖకు అనుబంధంగా ఉన్న చేనేత, జౌళి పరిశ్రమల అభివృద్ధి కోసం రూ.2 కోట్లు చొప్పున కేటాయించారు. ఇసుక తవ్వకానికి టీఎస్ఎండీసీ వెచ్చిస్తున్న ఖర్చులను తిరిగి చెల్లించేందుకు రూ.120 కోట్లు ప్రతిపాదించారు. వాణిజ్యం, ఎగుమతులు, చెరుకు, గనులు, భూగర్భ వనరులు, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్, టీఎస్ లిప్కో తదితరాలకు నామమాత్ర కేటాయింపులే దక్కాయి.

ఐటీ రంగానికి రూ.366 కోట్లు

ఐటీ రంగానికి నిర్వహణ, ప్రగతి పద్దులను కలుపుకుని రూ.366 కోట్లను తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుత ఏడాదితో పోలిస్తే ప్రగతిపద్దు కింద రూ.6 కోట్ల మేర స్వల్ప పెంపుదల కనిపించింది. టీ హబ్ ఫౌండేషన్‌కు రూ.177.61 కోట్లు, వీ హబ్‌కు రూ.7.95 కోట్లు కేటాయించింది. ఓఎఫ్‌సీ టెక్నాలజీతో అన్ని మండలాల్లోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో వీడియో సమావేశ సదుపాయాల కోసం రూ.18.14 కోట్లు కేటాయించారు. స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌కు రూ.8.88 కోట్లు, టీ ఎలక్ట్రానిక్స్‌కు రూ.8 కోట్లు కేటాయించింది.




సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.10,384 కోట్లు

ముఖ్యమంత్రి విచక్షణాధికారంతో అభివృద్ధి పనుల కోసం కేటాయించే ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్)కి తాజా బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించారు. సీఎం కేసీఆర్ జిల్లాల పర్యటనకు వెళ్లే సమయంలో అక్కడి ప్రజాప్రతినిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కోరితే అక్కడికక్కడే ప్రకటించేందుకు ఎస్‌డీఎఫ్ కింద రూ. 10,384 కోట్ల మేర కేటాయింపులు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపులు కేవలం రూ. 2 వేల కోట్లుగానే ఉండటం గమనార్హం. మరోవైపు అసెంబ్లీ అభివృద్ధి పథకం కింద ప్రతి శాసనసభ్యుడు లేదా శాసనమండలి సభ్యులకు రూ. 5 కోట్ల నిధిని కొనసాగించాలని బడ్జెట్లో నిర్ణయించారు. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ కేటాయింపులు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆరోగ్యం

అంకెలు రూ. కోట్లలో



ఆరోగ్య పథకంపై పీఆర్టీయూటీఎస్ హర్షం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నూతన హెల్త్ స్కీంను ప్రభుత్వం ప్రకటించడం పట్ల ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూటీఎస్) హర్షం తెలిపింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నగదు రహిత సేవలందించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పథకం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని వారు కోరారు.

వైద్య ఆరోగ్య శాఖకు గతేడాదికన్నా అధిక నిధులు

సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ప్రజారోగ్య సంచాలకుడు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలోనే వైద్య ఆరోగ్య శాఖకు రికార్డు స్థాయిలో రూ.12,161 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన జారీచేశారు. గత ఏడాదితో పోల్చితే రూ.721 కోట్లు అధికంగా కేటాయింపులు జరిగాయన్నారు. ఇందుకు కృషి చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాజా బడ్జెట్ కేటాయింపులు ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా మరింత దోహదం చేయనున్నాయన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం... ఈ బడ్జెట్లో వాటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పథకాన్ని రాష్ట్రమంతా విస్తరించడం గొప్ప విషయమన్నారు.

ఆరోగ్య పథకంపై టీజీవో హర్షం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వి.మమత, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం కోసం ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. 11 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని వారు స్వాగతించారు.

ఆర్టీసీకి విదిలింపులే...

- బడ్జెట్‌లో మళ్లీ రూ.1,500 కోట్లతోనే సరి
- గతేడాది రూ.1,500 కోట్లలో విడుదలయ్యింది రూ. 400 కోట్లే

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీకి బడ్జెట్‌లో మళ్లీ నిరాశే ఎదురైంది. డొక్కు బస్సులతో కుస్తీ పట్ట లేక కొత్త బస్సులు కొనేందుకు వరస ఆర్డర్లు ఇస్తున్న ఆర్టీసీ.. ప్రభుత్వం నుంచి ఈసారి ఎక్కువ నిధులు ఆశించింది. కానీ, ఎప్పటిలాగే రూ.1,500 కోట్లతో ప్రభుత్వం సరిపెట్టింది. గత బడ్జెట్‌లో రూ.1,500 కోట్లు ప్రతిపాదించినా ఇప్పటివరకు కేవలం రూ.400 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని అధికారులంటున్నారు. ఆ లెక్కన ఆ బడ్జెట్ చివరి దశకు చేరుకున్నా ఇంకా రూ.1,100 కోట్లు బకాయి ఉండటం విశేషం. ఈసారి కనీసం వేయి కోట్లు అదనంగా ఇస్తే కొత్త బస్సుల కొనుగోలుకు ఉపయోగపడతాయని అధికారులు ఆశించారు. ఇందుకు రూ.2,500 కోట్లను ప్రతిపాదించాలని నిర్ణయించారు. కానీ, ఆర్థిక శాఖ అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ తర్వాత ఎప్పటిలాగానే రూ.1,500 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. అంతకంటే ఎక్కువ నిధులు అందవన్న సంకేతాలతోనే ఈ మార్పు జరిగిందని అంటున్నారు. రాయితీ బస్‌పాస్‌ల మూలంగా ఆర్టీసీకి ఏర్పడే నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వం రీయింబర్స్ చేసే రూ.850 కోట్లు, కొత్త బస్సుల కోసం రుణంగా రూ.650 కోట్లు దక్కాయి. ఎలాంటి గ్రాంట్ కేటాయించలేదు. దీనిపై ఆర్టీసీ కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రోజుకు 32 లక్షల మంది ప్రయాణికులను చేరవేసే ఆర్టీసీకి కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే ఇవ్వటం దారుణమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆర్టీసీకి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.6 వేల కోట్లు కేటాయించాలని ఎన్‌ఎంయూ నేతలు కమాల్‌రెడ్డి, నరేందర్ పేర్కొన్నారు. సంస్థకోసం మొక్కుబడిగా రూ.1,500 కోట్లు ఇవ్వటమంటే దానిపై సవతితల్లి ప్రేమ చూపటమేనని టీఎంయూ అధ్యక్షుడు తిరుపతి పేర్కొన్నారు. బడ్జెట్‌లో 2 శాతం నిధులు అడిగినా ఇవ్వకపోవటం దారుణమని ఈయూ నేత రాజిరెడ్డి పేర్కొన్నారు.

భాగస్వామ్యంతో.. ఉద్యోగుల ఆరోగ్యం!

- ఈహెచ్‌ఎస్‌కు రూ.362 కోట్లు కేటాయించిన రాష్ట్ర సర్కారు
- ఉద్యోగుల వాటాగా వేతనాల్లోంచి 1 శాతం వసూలు
- మొత్తం రూ.700 కోట్లకుపైగా నిధులతో కార్పస్ ఫండ్
- ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా ట్రస్టు.. మార్గదర్శకాలపై కసరత్తు
- అన్ని జిల్లాలకూ కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం విస్తరణ
- మరో 9 జిల్లాల్లో కొత్తగా మెడికల్ కాలేజీలు
- కొత్తగా 100 బస్తీ దవాఖానాల ఏర్పాటుకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నట్టుగా 'ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)'ను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉద్యోగుల భాగస్వామ్యంతో విధానంలో ఆరోగ్య పథకాన్ని రూపొందించనున్నట్టు బడ్జెట్‌లో పేర్కొంది. ఈ పథకం కోసం రూ.362 కోట్లు కేటాయించడంతోపాటు.. ఉద్యోగుల వాటాగా వారి జీతాల నుంచి ఒక శాతం చొప్పున దాదాపు రూ.350 కోట్లు సేకరించనుంది. మొత్తంగా ఈ పథకం కోసం రూ.700 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కార్పస్ ఫండ్‌ను ఒక ట్రస్టుగా ఏర్పాటు చేసి, ఉద్యోగులు చికిత్స చేయించుకున్న తర్వాత సదరు ఖర్చు సొమ్మును ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు బదిలీ చేయనున్నట్టు వివరించింది. ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా ఈహెచ్‌ఎస్ ట్రస్టుకు ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి.



'హెల్త్'కు కేటాయింపులివీ..

- మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణానికి రూ.1.033 కోట్లు
- మెడికల్ కాలేజీలకు రూ.225.90 కోట్లు.. నర్సింగ్ కాలేజీలకు రూ. 26.26 కోట్లు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి రూ.500 కోట్లు
- వైద్య విధాన పరిషత్‌కు రూ.82.85 కోట్లు
- ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రికి రూ.37.76 కోట్లు..
- నిమ్స్‌కు రూ.15.67 కోట్లు
- వైద్య విధాన పరిషత్‌లోని ఆస్పత్రుల ఆధునికీరణకు రూ.200 కోట్లు
- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సర్జికల్ కన్జూమబుల్స్ కోసం రూ.75 కోట్లు
- ఆరోగ్యశ్రీ కింద కవర్‌కాని బీపీఎల్ కుటుంబాలకు నిమ్స్‌లో చికిత్సకు రూ.2 కోట్లు
- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు రూ.108 కోట్లు, డయాగ్నస్టిక్ పరికరాల కోసం రూ. 100 కోట్లు
- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి రూ. 1.60 కోట్లు
- ఆదిలాబాద్ రిమ్స్‌కు రూ.2.71 కోట్లు, టిమ్స్‌కు రూ. 5 కోట్లు
- జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్పత్రుల్లో రోగి సహాయకులకు సబ్సిడీపై ఆహారానికి రూ.70 కోట్లు
- ఇతర ఆస్పత్రుల్లో ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు రూ. 267 కోట్లు
- ఆయుష్మాన్ భారత్‌కు రూ.115 కోట్లు
- ఔషధాల కేంద్రీకృత కొనుగోలుకు రూ.377.43 కోట్లు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధునికీరణకు రూ.50 కోట్లు
- 108 సేవలకు రూ.29.82 కోట్లు, 104 సేవలకు రూ. 15 కోట్లు
- కేసీఆర్ అమ్మ ఒడికి రూ.325 కోట్లు
- 102 సేవలు (అమ్మ ఒడి) రూ.5 కోట్లు

మార్గదర్శకాలపై కసరత్తు షురూ..

కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈహెచ్‌ఎస్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను వైద్యారోగ్యశాఖ వర్గాలు సిద్ధం చేస్తున్నాయి. ఈ పథకం కింద పాత కార్డుల స్థానంలో కొత్త వాటిని ఇవ్వనున్నారు. ఇప్పటివరకు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఎవరో ఒకరికే ఆరోగ్య కార్డు ఇచ్చేవారు. కొత్త పథకంలో ఇద్దరికీ ఇస్తారు. తద్వారా భార్య తరఫున వారి తల్లిదండ్రులకు, భర్త తరఫున వారి తల్లిదండ్రులకు వైద్య వసతి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇక జర్నలిస్టులకు కూడా ఇదే కొత్త పథకంలో చోటు కల్పిస్తారు. అయితే ఉద్యోగుల తరహాలో జర్నలిస్టుల నుంచి వాటాను వసూలు చేయకుండా.. ప్రభుత్వమే సొమ్మును కార్పస్ ఫండ్‌లో జమచేస్తుందని ఉద్యోగ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ప్రభుత్వానికి, జర్నలిస్టులకు, ఉద్యోగులకు మధ్య ఒప్పందం కుదిరిందని చెప్తున్నాయి.

గుర్తింపు ఉన్న ఆస్పత్రుల్లోనే..

ఉద్యోగుల కొత్త పథకాన్ని కేవలం 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్‌ఏబీహెచ్)'లోనే అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. అంటే కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనే వైద్యసేవలు అందుతాయి. ఈ గుర్తింపు పొందిన ఆస్పత్రులు రాష్ట్రంలో 120 ఉన్నాయి. కొత్త ఆరోగ్య కార్డు పొందిన ఉద్యోగులు, జర్నలిస్టుల్లో ఎవరికైనా జబ్బు చేస్తే.. నేరుగా కార్డు తీసుకొని ఈ ఆస్పత్రులకు వెళ్లవచ్చు.

వైద్యారోగ్యశాఖకు రూ.12,161 కోట్లు

మొత్తంగా వైద్యారోగ్యశాఖ బడ్జెట్ ఏటా పెరుగుతూ వస్తోంది. 2022-23లో రూ.11,440 కోట్లు కేటాయించగా.. తాజాగా బడ్జెట్లో రూ.12,161 కోట్లు ఇచ్చారు. గత బడ్జెట్లో కేసీఆర్ కిట్‌కు రూ. 443 కోట్లు కేటాయిస్తే.. ఈసారి అంతేమొత్తం చూపారు. ఆరోగ్యశ్రీ పథకానికి నిధులను రూ.981 కోట్ల నుంచి రూ. 1,101 కోట్లకు పెంచారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం కోసం రూ.200 కోట్లు కేటాయించారు. అన్ని జిల్లాలకు ఈ పథకాన్ని విస్తరిస్తామని, 4 లక్షల మంది గర్భిణులకు ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఇక ప్రతి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తారు. మరో 100 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయనున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా నిర్మల్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల, వికారాబాద్‌లలో మెడికల్ కాలేజీలు ఏర్పాటవుతాయి.



పేదల ఇళ్లకు రూ.12,000 కోట్లు

- ఇందులో సొంత జాగాల్లో ఇళ్లు నిర్మించుకునే పథకానికి రూ.7,350 కోట్లు
- డబుల్ బెడ్రూం పథకానికి రూ.4,650 కోట్లు



సాక్షి, హైదరాబాద్: పేదల గృహ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లను ప్రతిపాదించింది. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో తీవ్ర చికాకులు వచ్చిన నేపథ్యంలో, దాని స్థానంలో.. సొంత జాగా ఉన్న అర్హులైన పేదలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించి, వారే ఇళ్లను నిర్మించుకునేలా కొత్త పథకానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. గత బడ్జెట్‌లో ఇలాంటి 4 లక్షల ఇళ్లకు సంబంధించి రూ.12 వేల కోట్లను ప్రతిపాదించినా.. నయా పైసా విడుదల కాలేదు. ఈ కొత్త పథకం విధివిధానాలు రూపొందించకపోవటంతో నిధులు బడ్జెట్ అంకెలకే పరిమితమయ్యాయి. దీంతో ఆ పథకాన్ని ప్రకటించిన తొలి ఏడాది వృథాగా గడిచిపోయింది. ఇప్పుడు మళ్లీ 4 లక్షల ఇళ్లకు ప్రభుత్వం నిధులు ప్రతిపాదించింది. అయితే, ఈ సారి కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయాన్ని కలుపుకొని, మిగతా మొత్తాన్ని తన వాటాగా ప్రతిపాదించటం విశేషం. నాలుగు లక్షల ఇళ్లకు సంబంధించి కేంద్రం నుంచి నిధులు వస్తాయని రాష్ట్ర సర్కార్ ఆశిస్తోంది. ఇందులో 60% గ్రామీణ ప్రాంతాలు, 40% **పట్టణ** ప్రాంతాలకు సంబంధించి యూనిట్లు **మంజూరు** అవుతాయని భావిస్తోంది. గ్రామీణ **ప్రాంతాలకు** యూనిట్ కాస్ట్‌గా ఒక్కో ఇంటికి రూ.**72 వేలు, పట్టణ** ప్రాంతాలకు ఒక్కో ఇంటికి రూ.**లక్షన్నర అందాల్సి ఉం**టుంది. ఇవి పోను మిగతా నిధులకు **సంబంధించి రాష్ట్ర ప్ర**భుత్వం తాజా బడ్జెట్‌లో 7,350 కోట్లను **ప్రతిపాదించింది. సొం**త జాగా ఉన్నవారికి ఇళ్లను నిర్మించుకునేందుకు **నిధులు కేటాయిం**చాలంటే, తొలుత ఆ పథకానికి విధివిధానాలు రూ**పొందించాలి.**

డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ. 4,650 కోట్లు..

ఇక డబుల్ బెడ్రూం ఇళ్ల పథకానికి సంబంధించి ప్రభుత్వం రూ.**4,650 కోట్లను** ప్రతిపాదించింది. ఇప్పటికే ప్రారంభమై వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, పరి**పాలన అను**మతులు వచ్చి ఇంకా ప్రారంభంకాని ఇళ్లను ఈ నిధులతో పూర్తి చేయాలన్న**ది ప్రభుత్వ** ఆలోచన. ఇలా దాదాపు 2.70 లక్షల ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంది.

అంతా గందరగోళం..

పేదల ఇళ్ల నిధులకు సంబంధించి గందరగోళం నెలకొంది. బడ్జెట్ ప్రసంగం తర్వాత **హరీశ్‌రావు** మీడియాతో మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన రూ.12 వేల కోట్లు పూర్తిగా సొంత జాగా**లో ఇళ్లు** నిర్మించే పథకానికే చెందుతాయని, డబుల్ బెడ్రూం ఇళ్లకు బడ్జెటేతర నిధులు సమకూరుస్తామని వెల్ల**డిం**చారు. అంటే.. సొంత జాగా పథకంలో యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలు అయినందున, రూ.12 వేల కోట్ల నిధులు కేటాయిస్తే మొత్తం 4 లక్షల ఇళ్లను మంజూరు చేయడానికి వీలుకల్పిస్తున్నట్లవుతుంది. కానీ, ఆర్థిక శాఖ విడుదల చేసిన బడ్జెట్ స్వరూపం నోట్‌లో అంకెలు మరోలా ఉన్నాయి. సొంత జాగాలో ఇళ్ల పథకం కింద 2,63,000 ఇళ్లకు, రూ.7,890 కోట్ల నిధులు ప్రతిపాదించినట్టు ఉంది. దీంతో ఆ విభాగం అధికారులు కూడా గందరగోళంలో పడ్డారు. మంగళవారం సంబంధిత మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కలిసి ఏ లెక్కలు సరైనవో తెలుసుకున్నాక గాని దీనిపై స్పష్టత రాదని ఒక నిర్ణయానికి రావడం గమనార్హం.

పట్టణాలకు రూ. 11,372 కోట్లు

- గత ఏడాది కన్నా రూ. 469 కోట్లు అధిక కేటాయింపులు
- ప్రగతి పద్దు కింద రూ. 7,176 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.3,906 కోట్లు
- వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీలకు రాష్ట్ర వాటా రూ. 356 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.11,372 కోట్లు కేటాయించారు. ఇందులో జీతభత్యాలు, నిర్వహణ వ్యయం కింద రూ. 3,906 కోట్లు కేటాయించగా, ప్రభుత్వ గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.7,176 కోట్లు కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ శాఖకు బడ్జెట్‌లో అదనంగా కేటాయించింది రూ.469 కోట్లు. ప్రస్తుతం కేటాయింపుల్లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.221.18 కోట్లు, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.149.97 కోట్లు ఖర్చు చేయనుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా పురపాలక సంఘాలకు గ్రాంటుగా రూ.733 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించారు. వడ్డీ లేని రుణాల కోసం రాష్ట్రంలోని కార్పొరేషన్లకు రూ.283 కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఇతర అభివృద్ధి పనుల కోసం పురపాలక సంఘాలకు సహాయ గ్రాంటుగా రూ. 300 కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా కింద కరీంనగర్, వరంగల్ స్మార్ట్‌సిటీల అభివృద్ధి పనుల కోసం ఒక్కో కార్పొరేషన్‌కు రూ.175.68 కోట్ల చొప్పున కేటాయించారు. అమృత్ 2.0 కింద రూ.133.54 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

వైకుంఠధామాలకు రూ.100 కోట్లు

రాష్ట్రంలో అభివృద్ధి చేయతలబెట్టిన వెజ్-నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల కోసం గత బడ్జెట్ తరహాలోనే రూ.400 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో వైకుంఠధామాలకు రూ.100 కోట్లను ఈసారి ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు కోసం గత సంవత్సరం కేటాయించిన నిధులేవీ ఖర్చు కాకపోగా, ఈసారి తిరిగి అంతే మొత్తంలో కేటాయించడం గమనార్హం. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు, ఇటీవలే శంకుస్థాపన చేసిన ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీకి రూ.500 కోట్లు కేటాయించారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించిన పాతబస్తీ మెట్రో కనెక్టివిటీ కోసం ఈసారి కూడా రూ.500 కోట్లు ప్రతిపాదించారు. గత సంవత్సరం కేటాయించినప్పటికీ మంజూరు చేయకపోవడంతో పాతబస్తీ మెట్రో పనులేవీ ముందుకు సాగలేదు. హైదరాబాద్ వాటర్‌బోర్డు పేదలకు అందిస్తున్న 20వేల లీటర్ల ఉచిత నీటి సరఫరాకు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 300 కోట్లు, వాటర్‌బోర్డు పనుల కోసం మరో రూ.300 కోట్లు, మూసీ పరీవాహక అభివృద్ధి పనుల కోసం రూ. 200 కోట్లు కేటాయించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు ప్రతిపాదించారు.





హరీశ్‌కు బడ్జెట్ బ్యాగ్‌ను అందజేస్తున్న కేసీఆర్. చిత్రంలో ప్రశాంత్‌రెడ్డి, తలసాని

ఇద్దరు మంత్రులు.. 4 బడ్జెట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో వరుసగా నాలుగుసార్లు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాక 2019 సెప్టెంబర్‌లో రాష్ట్ర ఆర్థిక మంత్రిగా హరీశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత వరుసగా 2020-21, 2021-22, 2022-23, 2023-24 వార్షిక బడ్జెట్‌లను శాసనసభకు సమర్పించారు. మంత్రి వేముల కూడా వరుసగా నాలుగు వార్షిక బడ్జెట్‌లను శాసనమండలిలో ప్రవేశపెట్టారు. శాసనసభలో మంత్రి హరీశ్, మండలిలో మంత్రి వేముల బడ్జెట్ ప్రసంగాలను గంటా 45 నిమిషాలపాటు చేశారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కోకాపేటలోని తన నివాసం నుంచి బయలుదేరిన మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీకి చేరుకున్నాక మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని వేర్వేరుగా కలసి బడ్జెట్ ప్రతులు అందజేశారు.

రేపు ఉదయం 10 గంటలకు చర్చ

అసెంబ్లీ ఉభయ సభలు సోమవారం బడ్జెట్ ప్రసంగం అనంతరం బుధవారానికి వాయిదా పడ్డాయి. బుధవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. అదే రోజు బడ్జెట్‌పై చర్చకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం ఇవ్వనున్నారు. గురువారం నుంచి వరుసగా మూడు రోజులపాటు బడ్జెట్ పద్దులపై చర్చ జరగనుంది.

రాష్ట్ర అవతరణ నుంచి నేటి దాకా బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరు ఇలా..

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ ప్రవేశ పెట్టిన తేదీ	మంత్రి	ప్రసంగ సమయం (గం)
2014-15	05-11-2014	ఈటల రాజేందర్	01.05
2015-16	11-03-2015	ఈటల రాజేందర్	01.01
2016-17	14.-03-2016	ఈటల రాజేందర్	01.03
2017-18	13-03-2017	ఈటల రాజేందర్	01.08
2018-19	15-03-2018	ఈటల రాజేందర్	01.22
2019-20	22-02-2019	కేసీఆర్ (సీఎం)	00.54
(ఓట్ ఆన్)			
2019-20	09-09-2019	కేసీఆర్ (సీఎం)	00.37
2020-21	08-03-2020	టి.హరీశ్‌రావు	01.02
2021-22	18-03-2021	టి.హరీశ్‌రావు	01.37
2022-23	07-03-2022	టి.హరీశ్‌రావు	01.51
2023-24	06-02-2023	టి.హరీశ్‌రావు	01.45

హోంశాఖకు రూ.9,599 కోట్లు

బడ్జెట్‌లో కేటాయించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్ కేటాయింపులలో **హోంశాఖకు** గతంలో కంటే నిధులు ఒకింత **పెరిగాయి.** 2023-24 వార్షిక బడ్జెట్‌లో **హోంశాఖకు** ప్రగతి, నిర్వహణ పద్దులకు **కలిపి మొత్తం రూ.**9599 కోట్లు కేటాయించారు. **గత బడ్జెట్‌కు** భిన్నంగా ఈ సారి **హోంశాఖ బడ్జెట్ ప్రతిపా**దనల్లో ప్రగతి **పద్దుకు నిధులు తగ్గించి..**నిర్వహణ పద్దు కింద ఎక్కువ నిధులు కేటాయించారు. **ఈ సారి బడ్జెట్‌లో నిర్వహణ** పద్దు కింద రూ. 8727.72 కోట్లు, **ప్రగతిపద్దు కింద రూ.871.24 కోట్లు** ప్రతిపాదించారు. పోలీస్ భవనాల **నిర్మాణాలు దాదాపు పూర్తి కావడం, హైదరాబాద్** నగరంలో కమాండ్ అండ్ **కంట్రోల్ సెంటర్ నిర్మాణం పూర్తికావడం తదిత**ర కారణాలతో ప్రగతి **పద్దుకు నిధులు తగ్గినట్టు తెలుస్తోంది. అదే సమయం**లో భారీ సంఖ్యలో **పోలీస్ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో జీతభత్యాలు** ఇతర ఖర్చులు పెరగనున్న **నేపథ్యంలో నిర్వహణ పద్దు కింద నిధులు** పెంచారు.

ప్రధాన కేటాయింపులు, తగ్గింపులు ఇలా..

- **అగ్ని ప్రమాదాల ముప్పు పెరుగుతు**న్న నేపథ్యంలో అగ్నిమాపకశాఖను **మరింత బలోపేతం చేసేలా** బడ్జెట్‌లో నిధులు పెంచారు. గత **బడ్జెట్‌లో(2022లో) రాష్ట్ర** విపత్తు నిర్వహణ, అగ్నిమాపక సర్వీస్‌కు **రూ.16.12 కోట్లు ఉండగా** ఈ సారి బడ్జెట్‌లో 32.14 కోట్లు పెంచారు.
- **డీజీపీ ఖాతా కింద నిర్వ**హణ పద్దులో నిధులు రూ.4145.35 కోట్ల నుంచి **రూ.4789.30 కో**ట్లకు పెంచారు. అదే విధంగా అగ్నిమాపకశాఖ, ఇత**రపోలీస్ కమిష**నరేట్లు, జైళ్లశాఖలకు సైతం నిర్వహణ బడ్జెట్ పెంచారు.
- **డీజీపీ ఖాతా** కింద ప్రగతి పద్దు నిధుల్లో కోత విధించారు. గత బడ్జెట్‌లో **రూ.1104.85** కోట్లు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.474.85 **కోట్ల**కు తగ్గించారు.
- సైబర్ సెక్యూరిటీకి రూ.35.50 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ బ్యూరో/కు రూ 8.50 కోట్లు కేటాయించారు.
- కొత్త పోలీస్ భవనాలు , స్టేషన్ల నిర్మాణానికి రూ.100 కోట్లు, జిల్లా పోలీస్ కార్యాలయాల భవన నిర్మాణాలకు రూ.100 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ భవనానికి రూ.10 కోట్లు కేటాయించారు.
- పోలీస్ స్టేషన్లలో మహిళల టాయిలెట్ల నిర్మాణానికి రూ.3 కోట్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు రూ.1 కోటి చొప్పున కేటాయించారు.

గత మూడేళ్లుగా హోంశాఖ బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో).

ఆర్థిక సంవత్సరం	ప్రగతిపద్దు	నిర్వహణ పద్దు
2021-22	706.36	7,419.24
2022-23	1,468.54	7,846.99
2023-24	871.24	8,727.72

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 7 | ఫిబ్రవరి | 2023



సంక్షేమానికి జై



ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి దళితబంధు

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750 కోట్లు	కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.569 కోట్లకు పైగా ఫండ్స్	వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు

ఆర్ఎఫ్‌సీఎల్‌కు రాష్ట్ర ఈక్విటీ కింద రూ.10 కోట్లు

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023–24లో ఉమ్మడి జిల్లాలో సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ లేకపోయినా.. ఇప్పటికే కొనసాగుతున్న పలు పథకాలకు నిధులు దండిగా కేటాయించారు. వ్యవసాయం, సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత, నీటిపారుదల, మున్సిపల్, పర్యాటక, ఆధ్యాత్మిక, విద్య, క్రీడా రంగాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా నిధులు విడుదల చేశారు. ఈ కేటాయింపుల్లో కొన్నింట్లో పెరుగుదల కనిపించగా.. మరికొన్నింట్లో తగ్గుదల నమోదైంది. నీటిపారుదల, శాంతిభద్రతలు, సంక్షేమానికి నిధుల్లో ప్రాధాన్యం కనిపించింది. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ/షాదీ ముబారక్ వంటి పథకాలకు ఎప్పటిలాగే పెద్దపీట వేయగా.. ఎన్నికల సంవత్సరం కావడంతో రైతుల కోసం నీటిపారుదల రంగానికి నిధులు పెంచారు. అలాగే.. దళితబంధుకు సైతం నిధుల్లో మంచి భాగస్వామ్యాన్నే కల్పించారు. పురపాలికలకు ఆర్థిక సాయం, స్మార్ట్‌సిటీలకు నిధుల్లోనూ పెద్దపీటే వేశారు. సొంతింటికి రూ.3 లక్షల ఆర్థిక సాయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

నియోజకవర్గానికి 1,100 మందికి..



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళితబంధు. ప్రతీ దళితులను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్‌లో విజయవంతంగా అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మిగిలినవి 12 నియోజకవర్గాలు. గతంలోలాగా నియోజకవర్గానికి 100 మందికి పరిమితం కాకుండా ఈసారి 1100 మంది చొప్పున ప్రభుత్వం సాయం ప్రకటించనుంది. ఈ లెక్కన 13,200 మందికి పథకాన్ని ఇవ్వనున్నారు. వీరికి ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున దాదాపు రూ.1,320 కోట్ల ఆర్థికసాయం అందించనున్నారు. ఈ పథకం అమలు కోసం గతేడాది దాదాపు రూ.1,800 కోట్లకుపైగా ఒక్క హుజూరాబాద్‌లోనే ప్రభుత్వం యూనిట్ల మంజూరుకు వెచ్చించింది.

సొంతింటికి రూ.3 లక్షలు..



డబుల్ బెడ్‌రూములు ఇప్పటికే జిల్లాల్లో వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి దగ్గరగా ఉన్నాయి. అదే క్రమంలో గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉన్న ప్రతీ అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో స్థలం ఉండి.. ఇల్లు కట్టుకోలేని వారికి ఇది శుభవార్తే. కానీ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.3 లక్షలు ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరపై ప్రభుత్వమే సబ్సిడీపై ఇంటి సామగ్రిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

పురపాలికలకు కేటాయింపులు ఇలా..



ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆర్థిక సాయం కింద రూ.20 కోట్లు ప్రకటించింది. అయితే.. గతేడాది బడ్జెట్‌లో ఈ సాయం రూ.30 కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది పద్దులో మాత్రం రూ.10 కోట్లు తక్కువగా కేటాయించారు.

కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186.56 కోట్లు



కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ప్రభుత్వం తన వంతు వాటాగా.. ఈ ఏడాది రూ.186.56 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని స్మార్ట్‌సిటీలకు మొత్తంగా రూ.373.14 కోట్లు కేటాయించగా.. సగం వరకు కరీంనగర్‌కు కేటాయించడం విశేషం. ఇప్పటికే స్మార్ట్‌సిటీ కింద కేంద్రం నుంచి వచ్చిన నిధులతో జంక్షన్ల సుందరీకరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు తదితర పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు మరింత వేగం పుంజుకోనున్నాయని మేయర్ సునీల్ రావు తెలిపారు. కేంద్ర రాష్ట్రం 50:50 ప్రాతిపదికన జరుగుతున్న పనుల్లో ఇంతవరకూ రూ.196 కోట్లు తెలంగాణ, మరో రూ.196 కోట్లు కేంద్రం నిధులు ఇచ్చాయి.

నిధులు	కేటాయింపు
కరీంనగర్ స్మార్ట్‌సిటీ	రూ.166.25 కోట్లు
ఎస్సీఎస్పీ కింద	రూ.12.88 కోట్లు
టీఎస్పీ నిధుల కింద	రూ.7.43 కోట్లు
మొత్తంగా స్మార్ట్‌సిటీకి..	రూ.186.56 కోట్లు

క్రీడా స్కూల్ కోసం రూ.8 కోట్లకుపైగా..



ఉమ్మడి జిల్లా ఉజ్వలపార్క్ సమీపంలో ఎల్ఎండీ స్పోర్ట్స్ స్కూల్ కోసం ఈ ఏడాది రూ.16.53 కోట్లు కేటాయించారు. ఈ నిధులను టీఎస్ స్పోర్ట్స్ స్కూల్‌తో కలిసి పంచుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.8.2 కోట్ల వరకు నిధులు రానున్నాయి. ఈ నిధులతో స్విమ్మింగ్‌పూల్, జిమ్నాజియం, బాక్సింగ్ ఇండోర్ హాల్, జుడో, రెజ్లింగ్ ప్రత్యేక హాలు, సింథటిక్ ట్రాక్ (మల్టీ పర్పస్ ట్రాక్), కోచ్‌లు, సదుపాయాల ఆధునికీకరణ, హకీంపేట తరహాలో క్రీడాకారులకు డైట్ తరహా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ రెండు టీఎస్ స్పోర్ట్స్ స్కూళ్లకు కలిపి గతేడాది రూ.19.70 కోట్లు కేటాయించింది.

- ఇక రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఉన్న శాతవాహన వర్సిటీకి ఎన్నినిధులు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు.

పర్యాటకానికి ఊతం..



- కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ కింద రూ.750 కోట్లు కేటాయించింది. కాళేశ్వరం దాని అనుబంధంగా ఉన్న పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల పరిసరాల్లో పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గోదావరిఖనిలో బోటింగ్, కనోయింగ్, కయాకింగ్ తదితర క్రీడల అభివృద్ధికి దోహదపడతాయి. ఇక లోయర్‌మానేరు, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు రిజర్వాయర్ల పరిసరాల సుందరీకరణ, పర్యాటకులను ఆకట్టుకునేందుకు బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో పడవ ప్రయాణం పునఃప్రారంభించేందుకు వీలు చిక్కనుంది.

వేములవాడ ఆలయం అభివృద్ధికి రూ.50 కోట్లు



యాదాద్రి తరహాలో వేములవాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని సీఎం గతంలోనే ప్రకటించారు. ఈ మేరకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ను ఏర్పాటు చేసింది. గతంలో రూ.50 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. ఆ నిధులను భూసేకరణకు, జీతభత్యాలకే వినియోగించారు. టెంపుల్ కోసం పలు ఆనంద్‌సాయి, స్థపతి వల్లినాయగం నేతృత్వంలో పలుమార్లు గుడికి వచ్చి.. కొన్ని డిజైన్లు పరిశీలించినా.. ఏదీ ఖరారు చేయలేదు. తాజాగా రూ.50 కోట్లు కేటాయించడంతో దక్షిణకాశీ అభివృద్ధిపై తిరిగి ఆశలు చిగురించాయి.

- చేనేత బీమాకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించింది. ఆకస్మికంగా చేనేత కార్మికులు మరణిస్తే.. వారి కుటుంబాలకు పదిరోజుల్లోగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తానని ప్రకటించింది.

ఆర్ఎఫ్‌సీఎల్‌కు రూ.10 కోట్లు..

- రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)కు రాష్ట్రం రూ.10 కోట్లు కేటాయించింది. స్టేట్ ఈక్విటీ కింద తన వంతుగా ఈ నిధులు కేటాయించింది.

నీటి ప్రాజెక్టులకు..
రూ.569 కోట్లకుపైగా..!

గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో పెరుగుదల నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు చిన్న, మధ్య, తరహా ప్రాజెక్టుల నిర్వహణకు గతేడాది రూ.451 కోట్లు విడుదల చేయగా.. ఈ ఏడాది ఆ నిధులు రూ.569.79 కోట్లకు చేరుకుంది.



ప్రాజెక్టు/ఆఫీస్	ఈ ఏడాది	గతేడాది
శ్రీపాదఎల్లంపల్లి	రూ.349.43 కోట్లు	రూ.273.02 కోట్లు
బొగ్గులవాగు(సీఈ)	రూ.32.00 లక్షలు	రూ.65 లక్షలు
మానేరు ప్రాజెక్టు	------	------
శనిగరం (సీఈ)	రూ.65 లక్షలు	-----
వరద కాలువకు	రూ.219.39 కోట్లు	రూ.177.15 కోట్లు
రామడుగు (గోదావరి బేసిన్)	రూ.2.18 కోట్లు	----

జాడలేనివి ఇవే..!

- గతేడాది డిసెంబరు7వ తేదీన జగిత్యాలకు సీఎం కొండగట్టుకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం దాదాపు 380 ఎకరాలు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రకటిస్తారని ఆశించినా.. దీనిపై స్పష్టత రాకపోవడం భక్తులను నిరాశపరిచింది. అలాగే ధర్మపురి ఆలయాభివృద్ధిపైనా స్పష్టత రాలేదు.
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై మొన్న కేంద్ర బడ్జెట్‌లో, తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

జనరంజక బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2023–24 జనరంజక బడ్జెట్. సమాజంలోని అన్ని వర్గాలకు, అన్ని విభాగాలకు న్యాయం చేసేదిగా ఉంది. ముఖ్యంగా స్మార్ట్‌సిటీ, నీటిపారుదల, పర్యాటకానికి మంచి కేటాయింపులు వచ్చాయి. రైతుబంధు, రైతుబీమా, షాదీముబారక్/ కల్యాణలక్ష్మీ, దళితబంధులాంటి సంక్షేమ పథకాలకు దండిగా నిధులు ఇచ్చింది.

– గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి

అంకెల గారడి..



ప్రత్యేక రాష్ట్ర ఎర్పడ్డ తర్వాత రెండు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చివరి బడ్జెట్‌లోనైనా ఈ ప్రభుత్వం పూర్తి చేస్తుందనుకున్నాం. కానీ ప్రభుత్వానికి క్షణం కూడా ప్రజల గురించి ఆలోచించే తీరిక లేదు. అంకెల గారడి, అప్పుల మయం, మిత్తీల పరం ఈ రాష్ట్ర బడ్జెట్.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ

ఎలక్షన్ స్టంట్..



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రూపొందించినట్టు స్పష్టంగా అర్థమవుతోంది. బడ్జెట్ పూర్తిగా ఎన్నికల స్టంట్. అంకెల గారడి మాత్రమే. కేసీఆర్ ప్రభుత్వానికి చివరి బడ్జెట్ కావడంతో రూ.2,90,396 కోట్ల అంకెలతో మాత్రమే రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హామీలను, వాగ్దానాలను మరిచిపోయి కేటాయింపులు జరిపింది.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు


అరకొర నిధుల కేటాయింపులతో మమ అనిపించారు..



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను చూస్తుంటే అన్ని రంగాలకు అరకొర నిధుల కేటాయింపుతో మమ అనిపించినట్టుగా ఉంది. బడ్జెట్ కేటాయింపులను చూస్తుంటే అన్ని రంగాలకు తగిన న్యాయం చేయలేదు. ప్రధానంగా రైతుల రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించలేదు.

– మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి

నిరాశపరిచింది..



బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేకుండా పోయింది. దేశ భవిష్యత్తును నిర్దేశించే యువతకు ఈ బడ్జెట్‌లో నిరాశ ఎదురైంది. గిరిజన బంధుకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. దళితబంధు పథకానికి కేవలం 12,980 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు.

– మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ప్రారంభం



కరీంనగర్‌క్రైం: ఇటీవల కోర్టుల్లో ప్రవేశపెట్టిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంకు నలుగురు న్యాయవాదులు నియామకం కాగా వారికి సంబంధించి ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని జిల్లా జడ్జి బి.ప్రతిమ సోమవారం ప్రారంభించారు. క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు, విచారణ ఖైదీలుగా ఉన్నవారు న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేనివారి పక్షాన ఈ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు వాదిస్తారు. దీనిలో మూడు విభాగాలుగా న్యాయవాదుల నియామకం చేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా కష్టార్జునచారి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా తనుకు మహేష్, ఆషాడ శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా గీతాలక్ష్మి ప్రసన్న బాధ్యతలు తీసుకున్నారు.

కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్ గ్రేడ్-2గా గుర్తించాలి



కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్పీడీసీఎల్‌లో పదేళ్లుగా అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ పేరుతో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న తమను ఆర్టిజన్ గ్రేడు–2గా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌కు రాష్ట్ర విద్యుత్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంస్థలో అనేక రకాల విధులు నిర్వర్తిస్తూ 24 గంటలు విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉంటున్న తమ సేవలను గుర్తించాలన్నారు. అనేక మంది విద్యుత్ ప్రమాదాలకు గురై చనిపోగా, మరికొంతమంది వికలాంగులుగా దుర్భర జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. సమాన పనికి సమానం వేతనం కల్పించాలని, ప్రస్తుత ఈఆర్సీలో అవకాశం కల్పిస్తూ ఆర్టిజన్ గ్రేడు–2గా గుర్తించాలని కోరారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



కరీంనగర్: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కరీంనగర్ నుంచి యాదాద్రికి ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్ నుంచి యాదాద్రికి బస్సును సోమవారం 1వ డిపోలో జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రెండు బస్సులను నడుపుతుండగా, త్వరలో మరో రెండు కొత్త బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ బస్సులు నుస్తులాపూర్, కొత్తపల్లి, చిగురుమామిడి, హుస్నాబాద్ మీదుగా 11 స్టాప్‌లు ఉండనున్నట్లు వివరించారు. బస్సులకు యాదాద్రి ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేసినట్లు మంత్రి తెలిపారు.

జవాబుదారీగా పనిచేయండి

- దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీలో తిమ్మినిబమ్మి చేయొద్దు
- జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కరీంనగర్: 'దివ్యాంగులైన వృద్ధులు, మహిళలు, యువకులు, చిన్నపిల్లలకు సదరం సర్టిఫికెట్ల కోసం ఎక్కడ పరీక్షలు చేస్తారు..? ఎక్కడ సర్టిఫికెట్లు ఇస్తారో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులు ఖర్చుచేసుకొని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచిచూస్తున్నారు. దివ్యాంగులనే మానవత్వం లేదు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. వైద్యఆరోగ్యశాఖ, ఆర్టీసీ అధికారుల మధ్య సమన్వయం లేదు. ఇప్పటికైనా ప్రజలను ఇబ్బంది పెట్టడం మానుకొని సమన్వయంగా పనిచేయాలి. దివ్యాంగుల జాబితాను తీసుకొని వారికి ఆర్టీసీ బస్ పాసులు ఇవ్వండి.. అక్కడ తిమ్మినిబమ్మి చేస్తూ అక్రమాలకు పాల్పడతారు. జాగ్రత్తగా వ్యవహరించండి' అంటూ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఐదో స్థాయీ సంఘ సమావేశానికి అధ్యక్షురాలు పిట్టల కరుణ గైర్హాజరు కాగా జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. అలాగే 1,2,3,4,6,7 స్థాయీ సంఘాలకు చైర్మన్లుగా జడ్పీ చైర్‌పర్సన్, ఉపాధ్యక్షుడు పేర్యాల గోపాల్‌రావు, మాచర్ల సౌజన్య వ్యవహరించగా జడ్పీ సీఈవో ప్రియాంక కర్ణన్, డిప్యూటీ సీఈవో పవన్ కుమార్, ఇతరశాఖల అధికారులు, సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పి.బక్కారెడ్డి, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, పురమల్ల లలిత, గీకురు రవీందర్, పులకం సరోజన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. హుజూరాబాద్ ఆర్టీసీ డీఎం తాను ఫోన్ చేస్తే.. అయితే ఏంటి..? అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని, ప్రయాణికుల పట్ల ఎలా వ్యవహరిస్తారో తెలుస్తోందని అన్నారు. ఆమెను వెంటనే అక్కడి నుంచి బదిలీ చేయాలని ఆర్టీసీ ఆర్ఎం ఖుస్రో షా ఖాన్‌ను ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్లు పలిగిన చోట వాటికి మరమ్మతు చేసి వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు.

- జడ్పీ సీఈవో ప్రియాంక మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో భాగంగా మామిడి, జామ వంటి పండ్ల మొక్కలనే కాకుండా ప్రజలకు ఇష్టమైన పండ్ల మొక్కలను పంపిణీ చేయాలన్నారు.
- కేశవపట్నం జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారి ఫోన్ ఎత్తరని.. ఎప్పుడూ కార్యాలయంలో ఉండరని, ఈ సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సీఈవో ప్రియాంక స్పందిస్తూ వెంటనే డీఈవోకు సంజాయిషీ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాలను ఎందుకు నిర్వహించడం లేదని శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించగా సమాధానమివ్వాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. చిగురుమామిడి మోడల్ స్కూల్ వద్ద బస్సులను ఆపకపోవడంతో బాలికలు రాత్రి వరకు వేచి చూస్తూ ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు నిలిపేలా చూడాలని జడ్పీటీసీ గీకురు రవీందర్ కోరారు. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం చెప్పారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఏడుగురు సరఫరాదారుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీపీ ఎల్.సుబ్బారాయుడు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: గంజాయి రవాణా చేస్తున్న ముఠాను కరీంనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌లోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న బెజ్జంకి మండలం రేగులపల్లికి చెందిన నిషాని హరికృష్ణ, ఎలగందలకు చెందిన నిషాని సాయికృష్ణ , బావుపేటకు చెందిన దూళం అభిరాం, నేపాల్ నుంచి వచ్చి కిసాన్‌నగర్‌లో ఉంటున్న బహదూర్ లక్ష్మణ్, సుభాష్‌నగర్‌కు చెందిన ఎండీ. అలీ అలియాస్ సోను, సరస్వతీనగర్‌లో ఉంటున్న మంచిర్యాలకు చెందిన గంప గోవర్ధన్, కిసాన్‌నగర్‌కు చెందిన చెల్పూరి విలాస్ వివిధ రకాల వృత్తులు చేసుకుంటూ కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నారు. జల్సాలకు డబ్బు సరిపోవకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి కరీంనగర్ సిటీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు. వివిధ వ్యక్తుల ద్వారా పరిచయమైన తూర్పు గోదావరి జిల్లా సీలేరు ప్రాంతానికి చెందిన సుబ్బారావు నుంచి వారం క్రితం 20 కిలోల గంజాయి కొనుగోలు చేసి రెండు బృందాలుగా ఏర్పడి 17కిలోల గంజాయిని విక్రయించారు. కొద్ది రోజుల నుంచి ఈ ముఠా గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వేర్వేరుగా పట్టుబడిన నిందితులు

గ్రూపులుగా విడిపోయి గంజాయి విక్రయిస్తూ వివిధ ప్రాంతాలకు వెళ్లిన నిందితులపై పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. బహదూర్ లక్ష్మణ్, ఎండీ అలీ, గంప గోవర్ధన్, చెల్పూరి విలాస్ కిసాన్‌నగర్ ప్రాంతంలోని శివాజీనగర్‌లో పట్టుబడగా, వారి నుంచి 1.5 కిలోలు, మల్కాపూర్ శివారులో నిషాని హరికృష్ణ, నిషాని సాయికృష్ణ, దూలం అభిరాం గ్రూపును పట్టుకొని వారి నుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోదుచేశారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జె.విజయసారథి, సీఐలు సృజన్‌రెడ్డి, విజ్ఞాన్‌రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గంజాయి రహిత కరీంనగర్ లక్ష్యం

గంజాయి విక్రయదారుల జాబితా తయారు చేశాం. వారిని త్వరలోనే పట్టుకుని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. గతేడాది 22 గంజాయి కేసుల్లో 52 మందిని అరెస్టు చేసి వారి నుంచి 33.19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. ఇప్పటికే 8 మంది గంజాయి రవాణాదారులపై పీడీయాక్టు అమలుచేశాం. గంజాయి రహిత కరీంనగర్‌గా మార్చడమే నా లక్ష్యం.

– సుబ్బారాయుడు, సీపీ

క్లుప్తంగా

8న ఆర్మీ ఉద్యోగాలపై ఉచిత అవగాహన సదస్సు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్వీజేసీ, ద్రోణాచార్య డిఫెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8న ఫ్రీ మెడికల్ క్యాంప్, మిలటరీ, పారా మిలటరీ ఉద్యోగాలపై యువతకు ఉచిత అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని మాజీ సైనికుడు, గిన్నీస్ రికార్డ్ హోల్డర్ లెంకల మహిపాల్‌రెడ్డి తెలిపారు. తీగలగుట్టపల్లిలోని మాతా మాణికేశ్వరి టెంపుల్ సమీపంలోని ఎస్వీజేసీ క్యాంపస్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యాంప్, అవగాహన సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెడికల్ క్యాంప్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వంటి ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న యువతకు 18 శారీరక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్తికేయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ తోపాటు కేకే డెంటల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, దృశ్య స్కిన్ కేర్ హాస్పిటల్, శ్రీ హర్ష కంటి ఆసుపత్రి, శరత్ మాక్సిజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 5,7,11,17,22,27,33, 35,37,44,47,51,57 డివిజన్‌లలో, హుజూరాబాద్ పట్టణంలో 9, 26 వార్డులు, అదే మండలంలోని చెల్పూరు, కందుగుల గ్రామాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలోని 4, 25 వార్డులు, అదే మండలంలోని సైదాబాద్, నాగారం, వీణవంక మండల కేంద్రంతోపాటు చల్లూరు, చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు సీతారాంపూర్, చొప్పదండిలో 4వ వార్డు, అదే మండలంలో రుక్మాపూర్, ఇల్లందకుంట మండల కేంద్రంతోపాటు ఇల్లందకుంట, శ్రీరాములపల్లి, గంగాధర మండలంలో కొండాయపల్లి, మధురానగర్, సర్వారెడ్డిపల్లి, రామడుగు మండల కేంద్రంతోపాటు గోపాలరావుపేట, చిప్పకుర్తి, కొత్తపల్లి పట్టణంలో 11వ వార్డు, ఆసిఫ్‌నగర్, కరీంనగర్ రూరల్ మండలంలో బహదూర్‌ఖాన్, మానకొండూరు మండల కేంద్రంతోపాటు గంగిపల్లి, వేగురుపల్లి, సైదాపూర్ మండలంలో వెన్నంపల్లి, రాములపల్లి, శంకరపట్నం మండలంలో కేశవపట్నం, గొల్లపల్లి, తిమ్మాపూర్ మండల కేంద్రంతో పాటు పోరండ్ల, గన్నేరువరం మండల కేంద్రంలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు.

వినియోగదారులు బాధ్యతలు గుర్తెరగాలి

- 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసి బిగించాలి
- ఆటో స్టార్టర్లు తొలగించాలి.. నీరు, విద్యుత్ పొదుపుగా వాడాలి
- వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించాలి
- వినియోగదారులతో ముఖాముఖిలో ఈఆర్సీ ౘైర్మన్ శ్రీరంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు చట్టం కల్పించిన గొప్ప హక్కులను సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జిల్లా విద్యుత్ వినియోగదారులతో ఈఆర్సీ నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థలు ప్రమాణాలు పాటించకుండా, సమస్యలు పరిష్కరించకపోతే సీజీఆర్‌ఎఫ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని.. వారు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తారని, బాధ్యులైన అధికారికి జరిమానా విధిస్తారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులతో ఉద్యోగులు మర్యాదగా మాట్లాడాలని సూచించారు. సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం వల్ల విద్యుత్ సరఫరా ప్రభావం పడుతున్నందున రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించి కెపాసిటర్లు బిగించుకోవాలని కోరారు. రానున్న వేసవిలో పంటలు ఎండకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డీటీఆర్‌ల వద్ద మీటర్లు బిగించాలని, అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే సంస్థ డబ్బులతోనే రిపేర్ చేసి బిగించాలన్నారు. విద్యుత్ సమస్యలుంటే వినియోదారులు 040-23311127 నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. ఈఆర్సీ సభ్యులు బి.క్రిష్ణయ్య, ఎండి మనోహర్‌రాజు, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు, సీజీఎంఎస్ సభ్యులు, సంస్థ డైరెక్టర్లు, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ ముఖాముఖిలో సర్పంచ్‌లు తదితరులు సమస్యలను తెలియజేశారు.

విద్యుత్ కోతలకెవరు బాధ్యులు



వ్యవసాయానికి సమయపాలన లేకుండా సరఫరా చేస్తున్న విద్యుత్ కోతలకు ఎవరు బాధ్యత వహిస్తారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాపై షెడ్యూల్ ప్రకటించాలి. ఏసీడీ చార్జీలు ఎత్తేయాలి. వ్యవసాయ బావుల వద్ద ఎర్త్ వైరు ఏర్పాటు చేయాలి. విద్యుత్ అధికారుల ఫోన్‌నెంబర్లు గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాలి. దేశానికి వెన్నుముఖ అయిన రైతుకు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే. వినియోగదారుల పట్ల మర్యాదగా మెదులుకోవాలి. – జోగినిపెల్లి సంపత్‌రావు, భారతీయ కిసాన్ సంఘ్ బాధ్యుడు

33 కె.వీ.లైన్ షిఫ్ట్ చేయాలి



కరీంనగర్‌లోని సబ్‌స్టేషన్ నుంచి ధర్మారం వెళ్లే 33 కె.వీ.విద్యుత్ లైన్ ఇండ్లపై నుంచి వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ లైన్ వెళ్తున్న కింద ఉన్న స్థలంలో ఇండ్లు కట్టుకోవడం ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ లైన్‌ను షిఫ్ట్ చేయాలి.

– రాచకొండ సత్యనారాయణరావు, అధ్యక్షుడు బీసీ సంక్షేమ సంఘం

లూజ్‌వైర్లు సరిచేయాలి



పంట పొలాలు, గ్రామాల్లో వేలాడుతున్న లూజ్ వైర్లను వెంటనే సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి. ఏఈ, లైన్‌మెన్‌లు ప్రమాదానికి గురవ్వడంతో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కష్టంగా మారింది. సిబ్బంది నియమించాలి. పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనకుండా విద్యుత్ సరఫరా అందించాలి.

– వినితశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ చిగురుమామిడి

పంటలు ఎండకుండా చర్యలు



పంటలు ఎండకుండా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అందిస్తాం. వినియోగదారులకు నోటీసులిచ్చి ఏసీడీ చార్జీలు వసూలు చేస్తాం. విద్యుత్ దుర్వినియోగమవుతున్నందున త్రీఫేజ్ లైన్ వద్ద ఎర్త్‌వైరు తొలగించాం. డీటీఆర్‌లకు మీటర్లు బిగిస్తాం. వేసవిలో లూజ్‌వైర్లు సరిచేస్తాం. ఐపీడీఎస్ కింద కరీంనగర్ నగరంలో చేపట్టిన కొత్త పనుల మూలంగా 2300 పాత విద్యుత్ స్థంభాలు తొలగించాల్సి ఉంది.

– వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ

వెట్టిచాకిరీలో ఉన్న కార్మికులకు విముక్తి కల్పించాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాధర్‌రావు


మాట్లాడుతున్న బృందాధర్‌రావు

కరీంనగర్: ఇటుక బట్టీలు, ఇతర పని ప్రదేశాల్లో వెట్టిచాకిరీలో ఉన్న కార్మికులను గుర్తించి విముక్తి కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు వై.బృందాధర్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మిక, రెవెన్యూ, సీడబ్ల్యూసీ, చైల్డ్ లైన్, డీడబ్ల్యూఓ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్, సఖి, పోలీస్, ఎస్సీ, బీసీ శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్-9 పై సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ విజయవంతమైందని అన్నారు. బాల కార్మికులను, బాల్య వివాహాలు అరికట్టడంలో, బాలల సంరక్షణకు అధికారులు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఈమధ్య తల్లులు తమ పిల్లలతో సహా ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. అధికారులు ఇంకా క్షేత్రస్థాయిలో బాలల హక్కుల కమిషన్ అధికారాలు, సేవలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత ఆపరేషన్ స్మైల్-9, పోషణ అభియాన్‌లో చేపట్టిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఆర్డీవో ఆనంద్‌కుమార్, ఏఎస్పీ చంద్రమోహన్, డీఈవో జనార్దన్‌రావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వరరావు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నేతానియల్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్, డీసీపీఓ శాంతా, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు కళింగ శేఖర్, రాధమ్మ, విజయ్, చైల్డ్ కోఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

సిలిండర్ పేలి గ్రానైట్ వ్యాపారి మృతి

- పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు


రాంలాల్ చౌదరి (ఫైల్)


పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఖాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ఎంఎస్ ర్యాక్ కట్టింగ్ పాలీషింగ్ ఫ్యాక్టరీలో సోమవారం ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి గ్రానైట్ వ్యాపారి మృతిచెందాడు. పేలుడు ధాటికి ఇంటి గోడలు, సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాలు.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారి రాంలాల్ చౌదరి(68) ఖాజీపూర్ శివారులో ఎస్ఎంఎస్ ర్యాక్ కట్టింగ్ పాలీషింగ్ కంపెనీ ఏర్పాటు చేసుకున్నాడు. పరిశ్రమ ఆవరణలో భవనం నిర్మించుకొని మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. ప్రతీ శనివారం సికింద్రాబాద్‌లో ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వెళ్లి తిరిగి సోమవారం వస్తుంటాడు. అదేక్రమంలో సోమవారం ఖాజీపూర్‌కు చేరుకొని ఇంటి తాళం తీసి కరెంట్ స్విచ్ ఆన్ చేయగా పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. అప్పటికే సిలిండర్ లీకై గది అంతా గ్యాస్‌తో నిండుకోవడాన్ని పసిగట్టని రాంలాల్ పేలుడు దాటికి 300 మీటర్ల దూరంలో పడగా కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి బావమరిది కైలాస్ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. రాంలాల్ మృతికి సంతాపంగా గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసివేశారు.

పేలిందా..? పేల్చారా?

సిలిండర్ పేలిన ఘటనపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాంలాల్ ఇంట్లోకి వెళ్లిన కొద్ది నిమిషాల్లోనే పేలుడు సంభవించింది. గ్యాస్‌స్టవ్ పైప్‌లైన్ కోసినట్లుగా ఉందని చర్చించుకుంటున్నారు. అలాగే కరెంటు సాకెట్‌లో ఒక పెన్ను పెట్టిన తీరు అనుమానాస్పదంగా ఉంది. బోర్డులో పెన్ను ఎవరుపెట్టారు? ఎందుకు పెట్టారు? అన్న చర్చ సైతం వినబడుతోంది. ఎవరైనా పేలుడుకు పథకం రచించారా? ప్రమాదవశాత్తు జరిగిందా? అన్న విషయాలపై దర్యాప్తులో స్పష్టత రానుంది.

న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు


న్యాయమూర్తిని సన్మానిస్తున్న కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జిగా ఉన్న భవానిచంద్ర రంగారెడ్డి కోర్టుకు బదిలీ అయిన సందర్భంగా కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జడ్జికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా జడ్జి బి.ప్రతిమ హాజరుకాగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరెల్లి రాములు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, కార్యవర్గ సభ్యులు జడ్జి భవానిచంద్రను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థుల బలవన్మరణం

- మార్కులు తక్కువ వచ్చాయని ఒకరు, కాలునొప్పి భరించలేక మరో విద్యార్థిని..
- చదువుకోవాలని మందలించినందుకు విద్యార్థి ఉరేసుకొని అఘాయిత్యం

జమ్మికుంట(హుజూరాబాద్)/కోరుట్లరూరల్/సిరిసిల్లక్రైం/: ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మార్కులు తక్కువ వచ్చాయని కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన విద్యార్థిని, కాలునొప్పి భరించలేక జగిత్యాల జిల్లా నాగులపేటకు చెందిన మరో విద్యార్థిని, చదువుకోవాలని మందలించినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా బీవై నగర్‌కు చెందిన విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాలు..

ప్రీ ఫైనల్‌లో మార్కులు తక్కువ వచ్చాయని..


జాగృతి (ఫైల్)

ప్రీ ఫైనల్ పరీక్షలో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జమ్మికుంట పట్టణంలోని అరెల్లి శ్రీనివాస్- అరుణ దంపతులు పిండిగిర్నీ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరి కూతురు జాగృతి(15) పట్టణంలో ఓ ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల ప్రీ ఫైనల్ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు రాత్రి 10 గంటల త ర్వాత పని ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కూతురు మృతితో తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. టౌన్ సీఐ రామచందర్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, దేశిని కోటి, శ్రీపతి నరేష్, దయ్యాల శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

కాలు బెనకడంతో..


కడప వైష్ణవి(ఫైల్)

కోరుట్ల మండలం నాగులపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని కడప వైష్ణవి (17) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఆమెకు ఇటీవల కాలు బెనకడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అయితే కాలు నొప్పి భరించలేక, మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు వచ్చి గమనించేలోపే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తన కూతురు కాలునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బలాదూర్ తిరగొద్దని..

బలాదూర్ తిరగొద్దని.. చదువుకోవాలని సూచించినందుకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సంతానం లేరని దత్తత తీసుకుని పెంచుకుంటున్న కొడుకు ఇలా అర్ధంతరంగా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ అమ్మ ఒంటరి అయ్యింది. సిరిసిల్లలోని బీవైనగర్‌కు చెందిన సద్గుణ-దేవేందర్‌కు సంతానం లేరు. చాలా ఏళ్ల క్రితం భాస్కర్(17)ను దత్తత తీసుకున్నారు. కొడుకును ఉన్నత చదువులు చదివించాలని సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. కరోనా కాలంలో తండ్రి దేవేందర్ అనారోగ్యంతో మృతిచెందాడు. భాస్కర్ చదువు బాధ్యతలు తల్లిపై పడ్డాయి. తండ్రి లేడని కొడుకును కాస్త గారాబం చేస్తే.. భాస్కర్ బలాదూర్‌గా తిరిగాడు. ఇంటి పరిస్థితిని వివరిస్తూ 9వ తరగతి చదువుతున్న కుమారుడికి బుద్ధి చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

హజ్ యాత్ర సఫలీకృతం కావాలి


చాదర్ సమర్పిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కరీంనగర్ కల్చరల్: ముస్లింలు పవిత్రంగా భావించే అజ్మీర్ దర్గాను సందర్శించే హజ్ యాత్ర సఫలీకృతం కావాలని బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని ముస్లింలు సోమవారం హజ్ యాత్రకు వెళ్తుండగా స్థానిక మీ సేవ కార్యాలయం వద్ద మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి యాత్ర బస్సును ప్రారంభించారు. ముందుగా యాత్ర సందర్భంగా ముస్లింలు సమర్పించే చాదర్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఈ పథకాలు బీఆర్ఎస్ ద్వారా దేశమంతా వెళ్లాలని ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మైనారిటీ సెల్ నాయకులు యూసుఫ్, శౌకత్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ నిధులు దుర్వినియోగం'


మాట్లాడుతున్న డాక్టర్ నగేశ్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఎవడబ్బ సొమ్ము అని రాష్ట్ర ఖజానా నుంచి సొంత పార్టీ మీటింగ్‌లకు ఖర్చు పెడుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేతను వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ మీటింగ్‌ల కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని తన జాగీర్‌గా కేసీఆర్ వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ బహిరంగ సభల నిర్వహణకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులను తరలించడంతోపాటు, హెలీకాప్టర్‌పై కేసీఆర్ వెళ్తూ కోట్లాది రూపాయలను సొంత అవసరాలకు వాడుకుంటున్న ఆయనకు ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేసీఆర్ అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శివరామ్, నాయకులు గంది రాజేశ్వరరావు, ఊకంటి రవీందర్‌రెడ్డి, పోలు శ్రీనివాస్, నర్సయ్య, సంపత్ పాల్గొన్నారు. కాగా పార్టీలో చేరిన శ్రావణ్ తదితరులకు కండువా కప్పి ఆహ్వానించారు.

స్వార్థ ప్రయోజనాలకు..

చిగురుమామిడి(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ తన స్వార్థప్రయోజనాలు, బీఆర్ఎస్ విస్తరణ కోసం తెలంగాణ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ విమర్శించారు. సోమవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడారు. ఒక వైపు తెలంగాణ శాసనసభ సమావేశాలు జరుగుతుండగా బీఆర్ఎస్ పార్టీ విస్తరణపై సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాలు పర్యటించడం సిగ్గుచేటన్నారు. గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానంపై శాసనసభాపక్ష నాయకుడిగా సమాధానం ఇవ్వకుండా తన కొడుకు మంత్రి కేటీఆర్‌కు వదిలిపెట్టడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రూ.40 కోట్ల ప్రజాధనంతో నిర్మించుకున్న ప్రగతిభవన్‌ను సొంత ప్రయోజనాలకు వాడుకోవడం, బీఆర్ఎస్ విస్తరణ కోసం ఆఫీసుగా మార్చుకోవడం అన్యాయమన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి జూడో పోటీలు

- 19 జిల్లాల నుంచి హాజరుకానున్న 400 మంది క్రీడాకారులు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనార్దన్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో 7వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, కెడెట్ జూడో చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 19 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్‌లు, రెఫరీలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. నేడు సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను ఈనెల 17 నుంచి 22 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్, కెడెట్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూడో సంఘం బాధ్యులు ఎల్వీ.రమణ, పాఠశాల ఏఓ సుభాష్, వైస్ ప్రిన్సిపాల్ సరితారెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరం స్పందిస్తూ సేవలందించాలి

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులు డయల్ 100 లేదా ఇతర మార్గాల ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే సత్వరం స్పందిస్తూ సదరు ప్రాంతానికి చేరుకుని ప్రజలకు సేవలందించాలని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు అన్నారు. బ్లూకోల్ట్స్,పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులకు సోమవారం కమిషనరేట్ కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, వేగవంతంగా ప్రజలకు అందించే సేవల ద్వారా పోలీస్ శాఖ ప్రతిష్ఠ పెంపొందుతుందని పేర్కొన్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో గస్తీ ముమ్మరంగా నిర్వహించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అక్రమ, అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నియంత్రించబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలకు చెందిన పోలీసులు అందించే సమర్థవంతమైన విధులు, సేవలను రికార్డుల్లో రాయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసులపై శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీ కాశయ్య, ఇన్‌స్పెక్టర్ కె.రవీందర్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ చట్టంపై అవగాహన కల్పించాలి

విద్యానగర్(కరీంనగర్): జిల్లాలోని పోలీస్ అధికారులకు మెయింటనెన్స్, వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ చట్టం- 2007, రూల్స్ -2011పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని సీపీ ఎల్.సుబ్బారాయుడు పేర్కొన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు సీపీని కలిసి చట్టం అవగాహనపై వినతిపత్రం సమర్పించారు. దేశంలోనే ప్రథమంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 40ని గతేడాది డిసెంబర్ 30న సీనియర్ సిటిజన్స్‌కు అనుకూలంగా విధి విధానాలు రూపొందించిదని, ఈ జీవో ప్రకారం కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ప్రత్యేకమైన అధికారాలను సంక్రమింపజేసిందని, ఈ విషయంలో పోలీస్ అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం సలహాదారు ముదుగంటి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందం, చింతల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రుణ ఎగవేతదారులకు అండగా కేంద్రం


ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రుణ ఎగవేతదారులకు అండగా నిలుస్తూ ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల్లోకి నెడుతుందని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. ఏఐసీసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ, ఎల్ఐసీ నిధులు రూ.77 వేల కోట్లు అదానీకి షేర్ల రూపంలో కట్టబెట్టారని అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారి వేల కోట్ల రూపాయలను అదానీకి ధారాదత్తం చేశారన్నారు. ఎయిర్‌పోర్టు నిర్వహణ బాధ్యతలను అనుభవం ఉన్నవారికి రెండు కంటే ఎక్కువ ఇవ్వరాదని నీతి ఆయోగ్ ఫైనాన్స్ కమిషన్ చెప్పినా, ముంబాయి, త్రివేండ్రం లాంటి ఆరు ఎయిర్ పోర్టుల నిర్వహణ బాధ్యతలను అనుభవం లేని అదానీకి అప్పగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు మేనేని రోహిత్‌రావు, శ్రావణ్‌నాయక్, రాజ మల్లయ్య, కల్వల రామచందర్, సుజిత్ కుమార్, శేఖర్, విక్టర్, పోచయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి గంగులను కలిసిన మేయర్, కార్పొరేటర్లు



మంత్రి గంగులకు పూలమొక్క అందిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

కరీంనగర్: గోదాం గడ్డ దోబి ఘాట్ నుంచి సప్తగిరి కాలనీ బైపాస్ వరకు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇవ్వడంపై మేయర్ యాదగిరి సునీల్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణలతో కలిసి సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. 35, 13వ డివిజన్లలో అంతర్గత రోడ్ల కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ పవన్, నాయకులు గందె మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న రిషితారావు

కరీంనగర్: కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉన్నత చదువులపై, ఉద్యోగావకాశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిషితారావు మాట్లాడుతూ.. బిజినెస్ డెవలప్‌మెంట్, విదేశాలలో పేరుగాంచిన విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువుల అవకాశాలు, ఉద్యోగాలు, జీతభత్యాల వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



సాత్విక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

కరీంనగర్ స్పోర్ట్స్: బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 9 నుంచి జరగనున్న అంతర్ జిల్లా జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు కరీంనగర్ సప్తగిరికాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో అతను రాణించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.ప్రమోద, ఉపాధ్యాయుడు నంది శ్రీనివాస్ తదితరులు సోమవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు..



రామడుగు(చొప్పదండి): మండలంలోని దేశరాజ్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ఎ. స్వాతి, వి. మానస, ఎ. కావ్య, ఈ. దివ్య బాలికల విభాగంలో, శ్రీకాంత్, అజయ్, రాకేశ్ బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జి హెచ్‌ఎం పవన్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లొంకల వెంకటరమణ తెలిపారు. ఈ నెల 7,8వ తేదీల్లో సాయి మానేరు పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కోల రమేష్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కుమార్ అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

రామడుగు(చొప్పదండి): ప్రతీ విద్యార్థి ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని చొప్పదండి సీఐ రవీందర్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు శ్రీమాన్ తేజ, ప్రణీత, శివచరణ్, వెన్నెల, రిష్యాంత్, పూర్ణచందర్, కార్తీక్, శ్రీవైష్ణవి, లాస్య జిల్లా కేంద్రంలో నిర్వహించిన గొజిరాయి 9వ జాతీయ స్థాయి కుంగు ఫూ కరాటే పోటీల్లో వివిధ మెడల్స్‌ను సాధించారు. సోమవారం విద్యార్థులను సర్కిల్ కార్యాలయంలో ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, మాస్టర్ సుంకె రాజు పాల్గొన్నారు.

ధరలు పతనం | ఇళ్లలోనే తెల్ల బంగారం

- ప్రస్తుతం క్వింటాల్ పత్తికి రూ.7,800
- గతేడాది రూ.10 వేలు
- రేటు పెరుగుతుందని ఎదురుచూస్తున్న రైతన్నలు
- రోజురోజుకూ తగ్గుతుండటంతో ఆందోళన
- కరీంనగర్ మండలంలో 2,800 ఎకరాల్లో సాగు



గోపాల్‌పూర్‌లోని ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

కరీంనగర్‌రూరల్: ధర పెరుగుతుందని భావించి, పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్న రైతుల ఆశలు క్రమేపీ అడియాసలవుతున్నాయి. పంట చేతికి వచ్చి, రెండు నెలలవుతోంది. ఈ క్రమంలో రోజురోజుకూ పతనమవుతున్న ధరలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో క్వింటాల్ పత్తి రేటు రూ.8 వేలు ఉండగా ప్రస్తుతం రూ.7,800 పలుకుతోంది. గతేడాది క్వింటాల్‌కు రూ.10 వేలు చెల్లించారు.

35 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా

కరీంనగర్ మండలంలో వానాకాలం సీజన్‌లో రైతులు 2,800 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 35 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. సాధారణంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు వస్తుంది. ఈసారి ధర పెరుగుతుందని పలువురు అన్నదాతలు పత్తిని విక్రయించడం లేదు. ఇప్పటికే రెండు, మూడో దఫాలుగా ఏరిన పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. అయితే గత అక్టోబర్‌లో క్వింటాల్‌కు రూ.7,500తో మొదలై, నవంబర్‌లో రూ.9 వేలు ధర చెల్లించారు. ప్రస్తుతం రూ.7,700 నుంచి రూ.7,800 పలుకుతోంది. ధరల పతనం చూసి, నవంబర్‌లో అమ్ముకుంటే ఎంతో కొంత లాభపడేవాళ్లమని రైతులు అంటున్నారు.

పెట్టుబడి రాని పరిస్థితి..

సిరులు కురిపిస్తుందనుకున్న పత్తి తమను నిలువునా ముంచుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుత ధర ప్రకారం పత్తిని విక్రయిస్తే పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

ఇంట్లోనే నిల్వ చేసిన..



నేను మూడెకరాల్లో పత్తి పండించిన. ఇప్పటివరకు నాలుగుసార్లు ఏరిన. రూ.9 వేలున్నపుడు 2 క్వింటాళ్లు అమ్మిన. ఇప్పుడు ధర పడిపోవడంతో ఇంట్లోనే నిల్వ చేసిన. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– పెంతల భాస్కర్, పత్తి రైతు, గోపాల్‌పూర్, కరీంనగర్ మండలం

30 క్వింటాళ్లు అమ్మిన..



ఐదెకరాల్లో పత్తి సాగు చేసిన. మూడుసార్లు ఏరిన. మరోసారి ఏరితే అయిపోతది. రెండు నెలల కింద రూ.8,500 చొప్పున 30 క్వింటాళ్ల పత్తి అమ్మిన. ఇప్పుడు ధర తగ్గడంతో ఇంకా 10 క్వింటాళ్ల వరకు అమ్మలేదు.

– అనుముల తిరుపతి, పత్తి రైతు, గోపాల్‌పూర్, కరీంనగర్ మండలం

‘మధ్యాహ్న’ బియ్యంలో పురుగులు



బియ్యం చెరుగుతున్న సహాయకురాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం అధికారులు సరఫరా చేసిన బియ్యంలో పురుగులు, చెత్తాచెదారం ఉండటంతో వంట నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ మండలంలోని చామనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన బియ్యంలో తెల్ల పురుగులుండటంతో సహాయకురాలు నిత్యం చెరుగుతూ శుభ్రం చేస్తోంది. ప్రతీరోజు ఇలా చేయడం కష్టంగా ఉందని ఆమె చెబుతోంది. చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉందని, అధికారులు నాణ్యమైన బియ్యం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

– కరీంనగర్‌రూరల్

స్టోన్ క్రషర్ ఎత్తివేయాలి

- కలెక్టర్‌ను కోరిన ఒడ్డెపల్లివాసులు



కమాన్‌పూర్ ఒడ్డెపల్లిలోని స్టోన్ క్రషర్

కొత్తపల్లి: మండలంలోని కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఒడ్డెపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ వల్ల తాము రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ క్రషర్‌ను ఎత్తివేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందించారు. స్టోన్ క్రషర్ నుంచి, వాహనాల ద్వారా వస్తున్న దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పంట పొలాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న స్టోన్ క్రషర్‌ను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆరె అనిల్‌కుమార్, బోనాల జనార్దన్, బి.సంపత్, అజయ్, లచ్చయ్య, మల్లేశ్, తిరుపతి, అంజయ్య, అభిలాష్, భరత్, భాస్కర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సోమవారం నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి హాత్ సే హాత్ జోడో పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పాదయాత్ర ద్వారా రాహుల్‌గాంధీ సందేశంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చార్జిషీట్‌ను జతపరిచి, కరపత్రాలను గడపగడపకూ వెళ్లి, పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలపాటు ప్రతీ ఇంటికి వెళ్తామని పేర్కొన్నారు. ఆకాశాన్నంటిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో ప్రజలె బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలపై వ్యతిరేక భావంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతరవేని శ్రీకాంత్ యాదవ్, పున్న అనిల్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, చర్ల పద్మ, కుర్ర పోచయ్య, ధన్న సింగ్, పోరండ్ల రమేశ్, షేక్ షహన్‌షా, భాస్కర్, అనిల్, కమల్, కీర్తి కుమార్, అష్రఫ్, షబానా, నదీమ్, మహమ్మద్ భారీ, సిరాజుద్దీన్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న హరిశంకర్, నాయకులు

కరీంనగర్: పట్టణంలోని 37వ డివిజన్ రాంనగర్ మహిళా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సోమవారం పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, అందరూ పరీక్షలు చేయించుకునేలా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుతం నగరంలో 15 రోజులుగా 13 కేంద్రాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులు, కళ్లద్దాలను పొందాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరె రవి, నాయకులు చేతి చంద్రశేఖర్, చల్ల రాజేంద్రప్రసాద్, హరీశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఉమాశంకర్, శ్రీధర్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

కరీంనగర్: ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లోనే భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతి కల్పించాలని పండిత, పీఈటీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 25 ఏళ్లుగా భాషా పండితులు ఎలాంటి పదోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభల్లో పండిత పోస్టులను ఉన్నతీకరించి, భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 05 ఫిబ్రవరి 2021న జీవో నంబర్ 23 సర్వీస్ రూల్స్ అనుసరించి 110 జీవో ద్వారా 10,479 పండిత, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించారని పేర్కొన్నారు. పండిత పోస్టులు పండితులకే ఇవ్వాలని ఉన్నప్పటికీ, కొందరు ఎస్జీటీలు ప్రమోషన్ కావాలని కోర్టుకెళ్లారని తెలిపారు. వాదనలు వినకుండానే కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఫలితంగా ప్రస్తుత బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్లో పండితులకు పదోన్నతులు ఆగిపోయాయని పేర్కొన్నారు. ఆర్‌టీఐ ప్రకారం ఉన్నత పాఠశాలల్లో పాఠాలను స్కూల్ అసిస్టెంట్లు బోధించాల్సి ఉండగా 20 ఏళ్లుగా భాషా పండితులతో బోధన కొనసాగిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నెరవెట్ల చైతన్య, స్తంభంకాడి గంగాధర్, మడుపు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, నేవూరి కరుణాకర్, ముత్తినేని శ్రీనివాస్, విజయ, పాషా, భాగ్యలక్ష్మి సమంత, రవీందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించండి



మహేశ్‌ను సన్మానిస్తున్న అధ్యక్షుడు శంకర్, నాయకులు

గన్నేరువరం(మానకొండూర్): బీఆర్‌ఎస్ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ పాలక్ ఎర్రం మహేశ్ అన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహేశ్, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు, కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, పుల్లెల పవన్‌కుమార్ హాజరై, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ కుటుంబం చేతుల్లో బందీ అయిందని, ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు విశ్రమించేది లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గడపగడపకు పార్టీని తీసుకెళ్లాలని, శక్తి కేంద్రాల కార్నర్ సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు జాలి శ్రీనివాస్‌రెడ్డి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తిరుపతి, సత్తయ్య, సంజీవ్, వెంకటేష్, కిసాన్, యువమోర్చాల అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ మురళీకృష్ణ, వినయ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా నీటి సరఫరా

- మేయర్ సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: నగర ప్రజలకు 66 ఎంఎల్‌డీ కెపాసిటీ గల నీటి శుద్ధీకరణ కేంద్రం నుంచి ప్రతీరోజు అంతరాయం లేకుండా మంచినీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. సోమవారం మానేరు డ్యాం సమీపంలోని నగరపాలక సంస్థ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి పరిశీలించారు. మూడు రోజులుగా నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వచ్చే వేసవిలో ప్రజలకు నీరందించే యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై ప్రజారోగ్య, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. మేయర్ మాట్లాడుతూ.. వచ్చే వేసవి కాలంలో మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. నీటి సరఫరాపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, సమస్య తలెత్తితే వెంటనే తమకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఎక్కడ పైపులైన్ లీకేజీ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ కిష్టయ్య, డీఈ లచ్చిరెడ్డి, ఓంప్రకాశ్, ప్రజారోగ్య శాఖ ఈఈ సంపత్‌రావు, ఏఈ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సుందరీకరిస్తున్నాం..

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కులను సుందరీకరిస్తున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధిలో భాగంగా సోమవారం 58వ డివిజన్‌లో కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి పర్యటించారు. కఠారి దేవేందర్‌రావు పార్కు సుందరీకరణ పనులను కార్పొరేటర్ రాపర్తి విజయతో కలిసి ప్రారంభించారు. దేవేందర్‌రావు కరీంనగర్ మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. పార్కులో చక్కటి గ్రీనరీ, వాటర్ ఫౌంటెన్, యోగశాల, పిల్లల కోసం ఆట స్థలం వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

నైట్ షెల్టర్‌తో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

నిరాశ్రయులకు నగరపాలక సంస్థ ఆశ్రయం కల్పించి, వారి ఆలనాపాలన చూస్తోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని 10వ డివిజన్ పరిధి కట్టరాంపూర్ నైట్ షెల్టర్‌ను కమిషనర్ సేవా ఇస్లావత్, స్థానిక కార్పొరేటర్ కాసర్ల ఆనంద్‌లతో కలిసి సోమవారం పరిశీలించారు. షెల్టర్‌లో పలు మరమ్మతు, సుందరీకరణ, వసతుల ఏర్పాట్ల పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నైట్ షెల్టర్‌లో 30 మంది వద్దులు ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. వీరికి అన్ని రకాల వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో రూ.7 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ వంగల శ్రీదేవి, ఈఈ మహేందర్, ఏఈ చైతన్య, నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.25 వేల విరాళం



విరాళం ఇస్తున్న మాల సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో నూతనంగా నిర్మించిన శివాలయానికి మాల సంఘం ఆధ్వర్యంలో రూ.25,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు నందాల తిరుపతి, గౌడ నర్సయ్య, మాల సంఘం ప్రతినిధులు గాజుల చంద్రయ్య, మురళి, రాజ్‌కమల్, సుభాష్, నారాయణ, శ్రీనివాస్, కిరణ్, ప్రసాద్, హరికృష్ణ, సంజీవ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓసీలను విస్మరించిన సర్కారు’

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఓసీలను విస్మరించిందని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆరోపించారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీల మేరకు ఓసీ కార్పొరేషన్ ఏర్పాటుకు నిధులు కేటాయించలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

జాడలేని నిరుద్యోగ భృతి

సైదాపూర్(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరడం లేదని, నిరుద్యోగ భృతి జాడే లేదని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం సైదాపూర్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం లేదన్నారు. ఉపఎన్నికలు ఎక్కడుంటే అక్కడ ఉచిత పథకాలు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక ఇంటర్నేషనల్ గొజిరాయి కరాటే అకాడమీ విద్యార్థులు సత్తా చాటి, బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ అన్వర్ ఖాన్ తెలిపారు. అలాగే పలు విభాగాల్లో పోటీ పడిన విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్పారింగ్ అండర్–12 విభాగంలో జోయాఖాన్, జరాఖాన్, అండర్–17లో అర్మాన్ ఖాన్‌లు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను టీఎన్‌జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి దారం శ్రీనివాస్ రెడ్డి, గ్రాండ్ మాస్టర్ అక్బర్ ఖాన్ తదితరులు సోమవారం అభినందించారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



పండ్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

విద్యానగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, క్లబ్ గ్రామ శాఖ బాధ్యులు మెతుకు సత్యం, చింతల కిషన్, బట్టు రాజేందర్, అసిరి సుమన్, మాసినేని చక్రధర్, చింతల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్ల విగ్రహాల ఊరేగింపు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించే స్వామివార్ల విగ్రహాలకు సోమవారం ఊరేగింపు నిర్వహించారు. మరకతలింగం, గణపతి, నాగేంద్రస్వామి తదితర విగ్రహాలను ట్రాలీలో ఉంచి, యువకులు భక్తిపాటలు, భజనల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు గౌడ నర్సయ్య, నందాల తిరుపతి, పూజారి ప్రశాంత్‌శర్మ పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ గౌతమినగర్ ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్ స్టేడియం నుంచి గౌతమినగర్, కట్టరాంపూర్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

‘డబుల్’ ఇళ్లకు అర్హులను గుర్తించాలి




చొప్పదండి: పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులైనవారిని గుర్తించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాలకవర్గ సభ్యులు, అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, అధికారులు, కౌన్సిలర్లతో తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, ఆర్‌ఐ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నివిధాలా ఆదుకుంటాం

టర్కీ, సిరియాలను అన్నివిధాలా ఆదుకుంటామని భారత్ ప్రకటించింది. భూకంపం గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రధాని ముఖ్య కార్యదర్శి పి.కె.మిశ్రా సారథ్యంలో ఉన్నత స్థాయి భేటీ జరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి తదితరులు ఇందులో పాల్గొన్నారు. తక్షణం 100 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని, శిథిలాల కింద చిక్కుబడ్డ బాధితులను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన శునకాలను, అవసరమైన ఔషధాలతో వైద్య బృందాలను కూడా పంపాలని నిర్ణయించారు. విడతలవారీగా సహాయ సామగ్రిని కూడా పంపనున్నారు.


టర్కీలోని దియార్బకీర్ వద్ద శిథిలాల కింద మృతదేహాల కోసం వెదుకులాట



టర్కీ, సిరియా సరిహద్దుల్లో భూకంప కేంద్రం (సర్కిల్లో)


సిరియాలోని జాండరీస్ సిటీలో కుప్పకూలిన ఇళ్లు



మరణించిన తన చిన్నారిని పట్టుకుని హృదయవిదారకంగా రోదిస్తున్న తండ్రి



క్షేమంగా బయటపడ్డ బాలుడు



భూకంపానికి బలైన తండ్రీకొడుకులు

టర్కీ, సిరియా సరిహద్దుల్లో... భారీ భూకంపం

2,600 మందికి పైగా దుర్మరణం

- వరుసగా మూడు భారీ భూకంపాలు
- 80 పైగా శక్తిమంతమైన ప్రకంపనలు
- మృతులు బాగా పెరిగే ప్రమాదం

అజ్మరీన్ (సిరియా): ప్రకృతి ప్రకోపానికి టర్కీ, సిరియా అల్లాడిపోయాయి. సోమవారం తెల్లవారుజామున సరిహద్దు సమీపంలో 7.8 తీవ్రతతో విరుచుకుపడ్డ భారీ భూకంపం ఇరు దేశాల్లో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీసింది. తర్వాత కొద్ది గంటల్లోనే 7.6, 6 తీవ్రతతో మరో రెండు భూకంపాలు సంభవించడంతో నష్ట తీవ్రత మరింత పెరిగింది. అంతకుముందు, ఆ తర్వాత కూడా 80కి పైగా శక్తిమంతమైన ప్రకంపనలు మధ్యప్రాచ్యాన్ని వణికించాయి. ఇప్పటిదాకా కనీసం 2,600 మందికి పైగా దుర్మరణం పాలైనట్టు తేలింది. 10,000 మందికి పైగా గాయపడ్డారు. వేల సంఖ్యలో భవనాలు తదితర నిర్మాణాలు క్షణముందే కుప్పకూలాయి. ఎటు చూసినా శిథిలాలు, శవాలతో పలు నగరాలు మరుభూమిని తలపిస్తున్నాయి. శిథిలాల కింద చాలామంది ఉన్నట్టు చెబుతున్నారు. దాంతో ప్రాణనష్టం మరింత భారీగా ఉంటుందని భావిస్తున్నారు. దిబ్బలను తొలగించి ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు సిబ్బంది నిర్విరామంగా శ్రమిస్తున్నారు. మృతుల సంఖ్య ఎంతకు పెరుగుతుందో శిథిలాలన్నింటినీ పూర్తిగా తొలగిస్తే గానీ తేలదంటూ టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ఆవేదన వెలిబుచ్చారు. ఈ దుర్ఘటన పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ఇరు దేశాలకు ఆపన్న హస్తం అందించారు. హుటాహుటిన విపత్తు స్పందన దళాలను (ఎన్డీఆర్ఎఫ్), వైద్య బృందాలను, సహాయ సామగ్రిని పంపారు. అన్నివిధాలా ఆదుకుంటామని ప్రకటించారు. నాటో, ఈయూ కూటములతో పాటు ప్రపంచ దేశాలన్నీ సాయానికి పెద్ద ఎత్తున ముందుకొస్తున్నాయి.


టర్కీలోని అదానా సిటీలో నేలమట్టమైన భవంతులు

ఎటుచూసినా శవాలు, క్షతగాత్రులే

శక్తిమంతమైన తొలి భూకంపం టర్కీ, సిరియా సరిహద్దు సమీపంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో సంభవించింది. దీని కేంద్రం ఆగ్నేయ టర్కీలోని కహ్రమాన్మరాస్ ప్రావిన్సులో గాజియాన్‌తెప్‌కు 35 కిలోమీటర్ల దూరంలో భూమికి 18 కిలోమీటర్ల దిగువన ఉన్నట్టు గుర్తించారు. భూకంపం తాలూకు ప్రకంపనలు ఏకంగా అటు ఈజిప్టు రాజధాని కైరో దాకా, ఇటు లెబనాన్ రాజధాని బీరూట్ దాకా పాకాయి! దీని ధాటికి దక్షిణ టర్కీలోని పది ప్రావిన్సులతో పాటు ఉత్తర సిరియాలోని పలు ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. డెమాస్కస్‌తో పాటు టర్కీ, సిరియాల్లోని పలు నగరాల్లో జనం హాహాకారాలు చేస్తూ ఒక్క ఉదుటున వీధుల్లోకి పరుగులు తీశారు. గంటల వ్యవధిలోనే 100 కిలోమీటర్ల దూరంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దాంతో నష్ట తీవ్రత మరింత పెరిగింది. సిరియాలోని అలెప్పో, హామా మొదలుకుని టర్కీలోని దియార్బకీర్ నగరం దాకా 330 కిలోమీటర్ల పై చిలుకు ప్రాంతం తీవ్రంగా దెబ్బ తిన్నది. టర్కీలో ఇప్పటిదాకా కనీసం 1,600 మందికి పైగా మరణించారు. అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సిరియాలో ప్రభుత్వ అధీనంలోని ప్రాంతాలు, విపక్ష రెబెల్స్ ప్రాబల్య ప్రాంతాల్లో కలిపి 900 మందికి పైగా దుర్మరణం పాలయ్యారు. సిరియాలో ఆస్పత్రులన్నీ క్షతగాత్రులతో నిండిపోయి కన్పిస్తున్నాయి. అరకొర సౌకర్యాల నడుమే వారికి చికిత్స అందిస్తున్నారు. భూ ప్రకంపనలు ఇంగ్లండ్ దాకా కొనసాగాయి.

అయ్యో సిరియన్లు...



సిరియాలో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల గోస కన్నీరు పెట్టిస్తోంది. దశాబ్దానికి పైగా కొనసాగుతున్న అంతర్యుద్ధంతో వాయవ్య సిరియా అట్టుడుకుతోంది. కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అధీనంలో, పలు ప్రాంతాలు విపక్ష గెరిల్లాల చేతుల్లో ఉన్నాయి. దాడులు, ప్రతి దాడులు నిత్యకృత్యం కావడంతో ఇక్కడ మౌలిక సదుపాయాలు కూడా మృగ్యంగా మారాయి. కాల్పుల్లో తూట్లు పడి బీటలువారిన ఇళ్లే జనాలకు ఆవాసం. ఈ స్థితిలో పులిమీద పుట్రలా వచ్చిపడ్డ భూకంపంతో జనం పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. అప్పటికే బలహీనంగా ఉన్న నివాసాలు ఉన్న పళాన కూలి చాలామందిని బలి తీసుకున్నాయి. శిథిలాల నుంచి మృతదేహాలను, క్షతగాత్రులను వెలికితీయడం వంటి సహాయ చర్యలు మందకొడిగా సాగుతున్నాయి.

వరుస ప్రకంపనలతో టర్కీవాసులు బెంబేలెత్తుతున్నారు. భారీ సంఖ్యలో మూటాముల్లే సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు బయల్దేరుతుండటంతో దేశంలో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్‌లు కన్పిస్తున్నాయి. దాంతో ఎమర్జెన్సీ, సహాయ బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరడం కష్టంగా మారుతోంది. ప్రజలు రోడ్లపైకి రావద్దని ప్రభుత్వ వర్గాలు విజ్ఞప్తి చేయాల్సి వస్తోంది.

- శిథిలాల కింద వేలాది కుటుంబాలు చిక్కుబడ్డాయి! వాటి నుంచి బాధితుల ఆక్రందనలు హృదయ విదారకంగా విన్పిస్తున్నాయి.
- వణికించే చలి సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతోంది.
- మసీదులు తదితరాల్లో నిర్వాసితులకు ఆశ్రయం కల్పిస్తున్నారు.
- యంత్రాల సాయంతో శిథిలాలను హుటాహుటిన తొలగించేందుకు సిబ్బంది పెద్ద ఎత్తున శ్రమిస్తున్నారు.

వలసలతో ట్రాఫిక్ జామ్

- టర్కీలోని ప్రసిద్ధ చారిత్రక, వారసత్వ భవనాలు, కట్టడాలు కూడా భూకంపం వల్ల దెబ్బ తిన్నాయి.
- వాయవ్య సిరియాలో ఇద్లిబ్ ప్రావిన్సు తదితరాలు కొన్నేళ్లుగా విపక్ష రెబెల్స్ అధీనంలో ఉండటం అక్కడ సహాయ చర్యలకు అడ్డంకిగా మారింది.
- ప్రపంచంలోనే భూకంప రిస్కు తీవ్రత అత్యంత ఎక్కువగా ఉన్న దేశాల్లో టర్కీ ఒకటి.
- 1999లో వాయవ్య టర్కీని అతలాకుతలం చేసిన శక్తిమంతమైన భూకంపం 18 వేల మందికి పైగా బలి తీసుకుంది.


టర్కీలోని అదానా వద్ద రోదిస్తున్న మహిళలు

ఇంధన రంగంలో అపార అవకాశాలు

- పారిశ్రామికవేత్తలూ.. విస్తృతంగా పెట్టుబడులు పెట్టండి
- బెంగళూరులో ఇంధన వారోత్సవాల్లో ప్రధాని మోదీ



కార్యక్రమంలో భాగంగా సాకర్ ప్లేయర్ మెస్సి జెర్సీని అందుకుంటున్న మోదీ

సాక్షి, బెంగళూరు: దేశంలో ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని, విస్తృతంగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోమవారం బెంగళూరులో భారత ఇంధన వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. 21వ శతాబ్దంలో ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో ఇంధన రంగానిది కీలక పాత్ర అన్నారు.

చమురు శుద్ధి సామర్థ్యంలో నాలుగో స్థానం

భారత్‌లో సుస్థిర ప్రభుత్వం, నిరంతర సంస్కరణలు, సామాజిక, ఆర్థిక సాధికారత పలు ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు తోడ్పడ్డాయని మోదీ ఉద్ఘాటించారు. ''తొమ్మిదేళ్లలో ఇంటర్నెట్ అనుసంధానం మూడు రెట్లు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. పెట్రోలియం ఉత్పత్తుల డిమాండ్ 5 శాతం మేర పెరిగిందన్నారు. ప్రపంచంలో అత్యధిక చమురు శుద్ధి సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. 2030 నాటికి 4 ఎంఎంటీల మేర గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు.

ఇక ఈ–20 ఇంధనం

ఈ–20 ఫ్యూయల్ (పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్)ను మోదీ అధికారికంగా ప్రారంభించారు. ఈ–20ని తొలుత 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తారు. రెండేళ్ల తర్వాత దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తారు. ఈ–20 ఇంధన వినియోగంతో ముడిచమురు దిగుమతుల భారం తగ్గనుంది. తుమకూరు జిల్లా గుబ్బీ తాలూకాలో హెచ్ఏఎల్ ఆధ్వర్యంలో హెలికాప్టర్ తయారీ ఫ్యాక్టరీని మోదీ ప్రారంభించారు.


ఎందుకీ భూ ప్రకోపం?

భూకంప ముప్పు అత్యధికంగా ఉన్న జోన్లో టర్కీ • టెక్టానిక్ ప్లేట్లు ఢీకొనడం వల్లే తాజా భూకంపం!

టర్కీ, సిరియాలో శక్తివంతమైన భూకంపం ధాటికి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ భవనాలు నేటమట్టమయ్యాయి. 456 కిలోమీటర్ల దూరంలోని సైప్రస్, 874 కిలోమీటర్ల దూరంలో ఉన్న లెబనాన్, 1,381 కిలోమీటర్ల దూరంలోని ఇజ్రాయెల్, 1,411 కిలోమీటర్ల దూరంలోని ఈజిప్టులో సైతం భూప్రకంపనలు నమోదయ్యాయి. దక్షిణ–మధ్య టర్కీలోని గాజియాన్‌టెప్ సిటీకి 33 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూ ఉపరితలం నుంచి 18 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు మొదలైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. టర్కీలో గత 100 ఏళ్లలో ఇదే అత్యంత శక్తివంతమైన భూకంపమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

95 శాతం భూభాగం భూకంప ప్రభావితమే

భౌగోళికంగా 'అనటోలియన్ టెక్టానిక్ ప్లేట్' ప్రాంతంలో ఉన్న టర్కీలో భూప్రకంపనలు సర్వసాధారణంగా మారాయి. 2020లో 33,000 భూకంపాలు నమోదయ్యాయి. వీటిలో 332 భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై దాదాపు 4.0గా రికార్డయ్యింది. భూమి పై పొరను టెక్టానిక్‌గా వ్యవహరిస్తారు. ఇందులో 15 భారీ టెక్టానిక్ ప్లేట్లు (రాతి పొరలు) ఉంటాయి. రెండు పొరల సరిహద్దుల నడుమ ఖాళీ ప్రదేశం ఉంటుంది. కొన్నిచోట్ల ప్లేట్ల మధ్య పగుళ్లు ఉంటాయి. భూ అంతర్భాగంలో సర్దుబాట్ల వల్ల రెండు టెక్టానిక్ ప్లేట్లు బలంగా ఢీకొన్నప్పుడు భారీ భూకంపం సంభవిస్తుందని బ్రిటిష్ ఆర్కియాలాజికల్ సర్వే వెల్లడించింది. యూరేసియన్, ఆఫ్రికన్ ప్లేట్ల చీలిక భాగంలో టర్కీ భూభాగం ఉంది. యూరేసియన్, అనటోలియన్ టెక్టానిక్ ప్లేట్ల నడుమ నార్త్ అనటోలియన్ ఫాల్ట్(ఎన్ఏఎఫ్) లైన్ అనే చీలిక ఉంది. రెండు ప్లేట్లు ఢీకొనడంతో ఇక్కడే భూకంపం ప్రారంభమైనట్లు భావిస్తున్నారు. ఎన్ఏఎఫ్ చీలిక దక్షిణ ఇస్తాంబుల్ నుంచి ఈశాన్య టర్కీ దాకా విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. 1999, 2011లోనూ ఈ ప్రాంతం నుంచే భూకంపాలు విస్తరించినట్లు పరిశోధకులు వెల్లడించారు. 1999 నాటి భూకంపంలో 18,000 మంది, 2011 నాటి భూకంపంలో 500 మందికిపైగా జనం మృతిచెందారు. టర్కీలో ఏకంగా 95 శాతం భూభాగం భూకంప ప్రభావిత ప్రాంతమే కావడం గమనార్హం. పెద్ద నగరాలైన ఇస్తాంబుల్, ఇజ్మీర్‌తోపాటు ఈస్ట్ అనటోలియా కూడా భూకంపం ముప్పును ఎదుర్కొంటున్నాయి. – సాక్షి, నేషనల్ డెస్క్



3 రోజుల క్రితమే చెప్పేశాడు

తాజా భూకంపంపై ముందే చెప్పిన ఫ్రాంక్
త్వరలో భారత్‌కూ రావచ్చని హెచ్చరికలు

ఆమ్‌స్టర్‌డ్యామ్: టర్కీ, సిరియాలో వేలాది మందిని బలితీసుకున్న భూకంపం గురించి నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్రాంక్ హూగర్‌గీట్స్ అనే పరిశోధకుడు ముందే హెచ్చరించారు. దక్షిణ మధ్య టర్కీ, జోర్డాన్, సిరియా, లెబనాన్ ప్రాంతంలో భారీ భూకంపం సంభవించనుందని, ఇది రిక్టర్ స్కేల్‌పై 7.5గా నమోదవుతుందని ఈ నెల 3న ఆయన ట్వీట్ చేశారు. ఆయన జోస్యం నిజమేనని మూడు రోజుల తర్వాత తేలింది. మొదటి భూకంపం తర్వాత కొన్ని గంటలు గడిచాక రెండో భూకంపం సంభవిస్తుందంటూ తన సంస్థ చేసిన ట్వీట్‌ను ఆయన షేర్ చేశారు. అది కూడా నిజమేనని తేటతెల్లమయ్యింది. త్వరలో భారత్‌తో పాటు పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లకు కూడా భూకంపం రావచ్చని హెచ్చరిస్తున్నారు. హూగర్‌బీట్స్ 'సోలార్ సిస్టమ్ జియోమెట్రీ సర్వే' అనే సంస్థలో పరిశోధకుడిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థ భూకంపాలపై అధ్యయనం చేస్తోంది. అయితే, హూగర్‌బీట్స్ నకిలీ సైంటిస్టు అని పలువురు ట్విట్టర్‌లో విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా, తాను చెప్పింది వాస్తవరూపం దాల్చడం పట్ల హూగర్‌బీట్స్ విచారం వ్యక్తం చేశారు.

ఐదుగురు న్యాయమూర్తుల ప్రమాణం

సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేయించిన సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు కొత్తగా నియమితులైన ఐదుగురు న్యాయమూర్తులతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్రాలు పదవీ ప్రమాణం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్ పేర్లను జనవరి 31న కొలీజియం సిఫారసు చేసింది. వీటికి ఆమోదం లభిస్తే మొత్తం 34 మంది జడ్జీలతో సుప్రీంకోర్టు పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

3 హైకోర్టులకు 13 మంది అదనపు న్యాయమూర్తుల నియామకం

మరోవైపు అలహాబాద్, కర్నాటక, మద్రాస్ హైకోర్టుల్లో 13 మంది అదనపు జడ్జీలు నియమితులయ్యారు. వీరిలో 11 మంది లాయర్లు కాగా ఇద్దరు న్యాయాధికారులు. వీరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం జనవరిలో సిఫార్సు చేసింది. వీరిలో మద్రాస్ హైకోర్టు న్యాయవాది లెక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరీకి బీజేపీతో సంబంధాలున్నాయనే ఆరోపణ వివాదం రేపింది. ఈమె పేరును సిఫార్సు చేయడాన్ని మద్రాస్ హైకోర్టు బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. బార్‌కు చెందిన 21 మంది లాయర్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా వేశారు. ''తాను బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శినంటూ గౌరీ అంగీకరించారు. మైనారిటీలపై విద్వేష వ్యాఖ్యలు చేశారు. మత ఛాందస భావాలున్న ఆమె హైకోర్టు న్యాయమూర్తి పదవికి అనర్హురాలు'' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఫిబ్రవరి 10న విచారణ జరగాల్సి ఉంది. దానిపై మంగళవారమే విచారణ చేపడతామని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తెలిపింది. గౌరీ వివాదంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు స్పందించారు. రాజకీయ పార్టీలతో సంబంధాలున్న వారు కూడా జడ్జీలు కావచ్చన్నారు. పార్టీల తరఫున పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన వారు కూడా గతంలో హైకోర్టు జడ్జీలయ్యారన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్ వ్యాఖ్యలను ఆయన రీట్వీట్ చేయడం తెలిసిందే. మరోవైపు, తాజాగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో పాటే హైకోర్టు జడ్జీలుగా కొలీజియం చేసిన మరో ఏడు సిఫార్సులపై ఇంకా కేంద్రం నుంచి ఎలాంటి సమాచారమూ లేదు.



'అదానీ'పై అదే దుమారం

విపక్షాల 'జేపీసీ'డిమాండ్‌తో స్తంభించిన ఉభయసభలు • అదానీ వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసు: రాహుల్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించాలని భావించిన ప్రభుత్వానికి మళ్లీ చుక్కెదురైంది. సోమవారం కూడా 'అదానీ'అంశం పార్లమెంట్‌ను కుదిపేసింది. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో దర్యాప్తు చేయించాలన్న ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల ఒకటో తేదీన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాక అదానీ అంశంపై విపక్ష సభ్యులు పట్టువీడకపోవడంతో ఉభయ సభల్లోనూ మరే ఇతర కార్యకలాపాలకు అవకాశం దొరకలేదు. ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సాధారణంగా ప్రధాని మోదీ ఉభయ సభల్లో బదులివ్వాల్సి ఉంటుంది. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి 'అదానీ సర్కార్ షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. జేపీసీతో విచారణకు పట్టుబట్టారు. స్పీకర్ ఓం బిర్లా వారిని తమతమ స్థానాల్లో కూర్చుని, చర్చలో పాల్గొనాలని కోరారు. వినిపించుకోక పోవడంతో తన చాంబర్‌కు వచ్చి డిమాండ్లపై చర్చించాలని సూచించారు. ఫలితం లేకపోడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల వాయిదా తీర్మానాన్ని తోసిపుచ్చారు. సభ తిరిగి ప్రారంభమయ్యాకా నినాదాలు కొనసాగడంతో సభ మంగళవారానికి వాయిదా పడింది. అనంతరం విపక్ష నేతలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. అంతకుముందు ప్రతిపక్షాల నేతలు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లో అదానీ అంశంపై చర్చ జరిగి మోదీ బదులివ్వాల్సిందేనని ఖర్గే చెప్పారు.

ఎగువసభలోనూ నిరసనల పర్వం

రాజ్యసభ ఉదయం ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన అబ్దుల్ సమద్ సిద్దిఖీకి నివాళులర్పించింది. అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలిచ్చిన 10 నోటీసులను సభాధ్యక్షుడు జగ్‌దీప్ ధన్‌ఖడ్ అంగీకరించలేదు. కాంగ్రెస్ నేతలు ఖర్గే, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, ప్రమోద్ తివారీ నోటీసులు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. నిర్ణయించిన ప్రకారమే కార్యకలాపాలు జరుగుతాయని స్పష్టం చేశారు. అదానీ గ్రూప్‌లో అవినీతి ఆరోపణలపై చర్చ జరగాలంటూ ప్రతిపక్ష సభ్యులంతా ఏకమై పట్టుబట్టారు. వారి డిమాండ్‌ను చైర్మన్ తోసిపుచ్చారు. అంతరాయాల కారణంగానే ప్రతిపక్ష సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ కోల్పోయాయన్నారు. ఆందోళనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. ప్రతిపక్షాల నిరసనలు ఆగకపోవడంతో మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అదానీ కోసం మోదీ ఏమైనా చేస్తారు: రాహుల్

పార్లమెంట్‌లో అదానీ అంశం చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకు ప్రధాని మోదీ చేయగలిగిందంతా చేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. 'అదానీపై చర్చకు ప్రభుత్వం భయపడుతోంది. బిలియనీర్ వ్యాపారవేత్త అదానీ వెనుక ఉన్న శక్తి ఎవరో దేశప్రజలకు తెలుసు. పార్లమెంట్‌లో అదానీ గ్రూప్‌పై చర్చ జరిగితేనే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి. దీనిపై చర్చకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి' అని రాహుల్ మీడియాతో అన్నారు.


ఆర్‌బీఐ, ఎల్ఐసీ కార్యాలయాల వద్ద నిరసన

కాంగ్రెస్ శ్రేణులు ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) కార్యాలయాల వద్ద ప్రదర్శనలు చేపట్టారు. అదానీ దేశం విడిచిపోకుండా ఆయన పాస్‌పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాస్‌పోర్టులను సీజ్ చేయకపోవడం వల్లే గతంలో వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు దేశం విడిచి పారిపోయారని చెప్పారు. మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోనూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి.

వాట్సాప్‌తో ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు

త్వరలో రైలు ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ సౌకర్యం

న్యూఢిల్లీ: వాట్సాప్ నంబర్‌తో కావాల్సిన ఆహారపదార్థాలను ఆర్డర్ చేసే సౌకర్యం రైలు ప్రయాణీకులకు త్వరలో అందుబాటులోకి రానుంది. కృత్రిమ మేధతో పనిచేసే చాట్‌బోట్ ప్రయాణికులకు మీల్స్‌ను బుక్ చేస్తుంది. ఈ కేటరింగ్ సేవల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన వెబ్‌సైట్ www.catering.irctc.co.inతోపాటు ఈ–కేటరింగ్ యాప్ 'ఫుడ్ ఆన్ ట్రాక్'ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపింది. ఇ–టికెట్ బుక్ చేసుకుని, ఇ–కేటరింగ్ సేవలకు ఆప్షన్ ఇచ్చిన ప్రయాణికులకు వాట్సాప్ నంబర్ నుంచి మెసేజీ వెళ్తుంది. దాని ద్వారా ఆ మార్గంలోని స్టేషన్లలో నచ్చిన రెస్టారెంట్లలో మీల్స్ బుక్ చేసుకోవచ్చు.



మహిళల భద్రత దిశగా ఆశా యాత్ర

మనదేశంలో మహిళల భద్రత, మహిళాసాధికారత సాధన కోసం ఆశా మాలవీయ దేశపర్యటనకు సిద్ధమయ్యారు. విజయవంతంగా సాగుతున్న ఆమె యాత్ర తెలుగు రాష్ట్రంలో ప్రవేశించింది. మహిళల భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శవంతంగా ఉందని చెప్పారామె.





ఆశా మాలవీయది మధ్యప్రదేశ్ రాష్ట్రం, రాజ్‌ఘర్ జిల్లా సతారామ్ గ్రామం. ఆమె క్రీడాకారిణి, పర్వతారోహణలో అభిరుచి మెండు. మహిళాభ్యుదయం లక్ష్యంగా సాగుతున్న ఆమె సైకిల్ పర్యటనలో స్త్రీ సాధికారత, భద్రత గురించి సమాజాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఆమె పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె తన లక్ష్యాన్ని వివరించారు.

అపోహను తొలగిస్తాను!

"నేను స్పోర్ట్స్‌లో నేషనల్ ప్లేయర్‌ని. పర్వతారోహణలో రికార్డు హోల్డర్‌ని. ప్రస్తుతం 25వేల కిలోమీటర్ల సంపూర్ణ భారత యాత్ర చేస్తున్నాను. నవంబర్ ఒకటిన భోపాల్‌లో ప్రారంభమైన నా సైకిల్ యాత్రలో ఎనిమిది వేల కిలోమీటర్లు పూర్తయ్యాయి, విజయవాడ చేరుకున్నాను. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో యాత్ర నిర్వహించాలనేది లక్ష్యం. ఇప్పటికే ఏడు రాష్ట్రాల్లో యాత్ర పూర్తయింది. భారతదేశం మహిళలకు అంత సురక్షితమైన దేశం కాదని విదేశాల్లో తప్పుడు అభిప్రాయం ఉంది. మహిళలకు భారతదేశంలో పూర్తి భద్రత ఉందని నేను ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నాను.

'దిశ' బాగుంది

సీఎం జగన్ గారిని కలవడం ఎంతో ఉద్వేగంగా, గర్వంగా ఉంది. దేశం అభివృద్ధితో పాటు మహిళల భద్రతలాంటి విషయాలపై ముఖ్యమంత్రి గారి అభిప్రాయాలు ఎంతో గొప్పగా ఉన్నాయి. మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ఏపీలో మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాను. ఈ యాప్ చాలా బాగా పనిచేస్తోంది. ఏపీలో మహిళలే కాదు, ప్రజలంతా సురక్షితంగా ఉన్నారు. ముఖ్యమంత్రిగారు నన్ను ప్రశంసలతో ముంచెత్తడంతోపాటు నా ఆశయం కోసం 10లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. తిరుపతి వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి నాకు ప్రత్యేక రక్షణ అందించారు. స్కూల్స్, కాలేజీల్లో అమ్మాయిల కోసం ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఎంతో మంచివి. దేశానికే ఆదర్శంగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని కలవడం సంతోషంగా ఉంది'' అన్నారు ఆశా మాలవీయ. మహిళల భద్రత, సాధికారతతోపాటు ప్రపంచదేశాల ముందు మన దేశం గౌరవాన్ని ఇనుమడింపచేయాలనే ఆమె ఆశయం ఉన్నతమైనది. ఈ యాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆమెను ఆశీర్వదిద్దాం.



● ఆశా మాలవీయ (ఫైల్ ఫొటో)

– సాక్షి, ఏపీ బ్యూరో

సందర్భం

నవరాగాల తేజం

ముచ్చటగా మూడోసారి గ్రామీ గెలుచుకున్న రిక్కీ కేజ్

గత సంవత్సరం గ్రామీ గెలుచుకున్న తరువాత లాస్ వేగాస్‌లోని ఎంజీఎం గ్రాండ్ మార్క్యూ బాల్‌రూమ్‌లో భారతీయత ఉట్టిపడేలా 'నమస్తే' అంటూ ప్రేక్షకులకు అభివాదం చేశాడు మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్.

భారతీయత అతడి బలం. తనను ముందుకు నడిపించే ఇంధనం.

లాస్ ఏంజెల్స్(యూఎస్) మైక్రోసాఫ్ట్ థియేటర్‌లో భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగిన 65 వ గ్రామీ పురస్కార ప్రదానోత్సవంలో రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి 'గ్రామీ' అవార్డ్‌ను అందుకున్నాడు రిక్కీ కేజ్. స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కు బెస్ట్ ఇమాసివ్ ఆడియో ఆల్బమ్ విభాగంలో గ్రామీ దక్కింది. రిక్కీకి కెరీర్‌లో ఇది మూడో గ్రామీ...

సంగీతరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డ్‌ను ముచ్చటగా మూడోసారీ సొంతం చేసుకున్నాడు బెంగళూరుకు చెందిన మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్. 2015లో అమెరికన్ రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'విండ్స్ ఆఫ్ సంసార' ఆల్బమ్‌కు తొలిసారిగా గ్రామీ అవార్డ్ దక్కింది.

స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కు మూడోసారి గ్రామీ అవార్డ్ (బెస్ట్ ఇమాసివ్ ఆడియో ఆల్బమ్ విభాగం)లో అందుకున్నాడు రిక్కీ. గత సంవత్సరం ఇదే ఆల్బమ్ 'బెస్ట్ న్యూ ఏజ్ ఆల్బమ్' విభాగంలో రెండోసారి గ్రామీ దక్కింది.

డివైన్ టైడ్స్... ప్రకృతి ప్రపంచానికి నివాళి.

ఈ ఆల్బమ్‌లో తొమ్మిది పాటలు ఉన్నాయి. మన హిమాలయాల అందాల నుంచి స్పెయిన్ అరణ్యాల అందాల వరకు మ్యూజిక్ వీడియోల్లో కనువిందు చేస్తాయి.

'నా సంగీతంలో భిన్న సంస్కృతుల ప్రభావం కనిపించినప్పటికీ నా మూలాలు మాత్రం భారత్‌లోనే ఉన్నాయి' అంటాడు రిక్కీ కేజ్.

మూడోసారి 'గ్రామీ' వరించిన సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కోప్లాండ్‌తో ఉన్న ఫొటో పోస్ట్ చేసి 'సూపర్ గ్రేట్‌ఫుల్, మై థర్డ్ గ్రామీ అవార్డ్' అని తన ఆనందాన్ని పంచుకున్నాడు రిక్కీ కేజ్.

నార్త్ కరోలినా (యూఎస్)లో జన్మించాడు రిక్కీ. ఎనిమిది సంవత్సరాల వయసు నుంచి తల్లిదండ్రులతో పాటు బెంగళూరులో ఉంటున్నాడు. స్థానిక బిషప్ కాటన్ స్కూల్‌లో చదువుకున్నాడు. ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కాలేజీలో చదువుకునే రోజుల్లో సంగీతంలోనే కెరీర్ వెదుక్కుంటానని తల్లిదండ్రులతో చెప్పాడు. ఇలా చెప్పడం తండ్రికి నచ్చలేదు.

ఆ తరువాత మాత్రం ఆయన కాస్త మెత్తబడ్డాడు. డెంటల్ సర్జరీలో డిగ్రీలో పూర్తి చేసిన తరువాత, పట్టా తండ్రి చేతికి ఇచ్చి తనకు ఇష్టమైన సంగీతపు దారిలో ప్రయాణం ప్రారంభించాడు.

టీవీలోని మ్యూజిక్ షోల ద్వారా చిన్నప్పుడే రిక్కీకి సంగీతంపై ఆసక్తి మొదలైంది. ఇంట్లో పెద్ద మ్యూజిక్ కలెక్షన్ ఉండేది.

రాక్ బాండ్ 'ఏంజెల్ డస్ట్'లో గిటార్ ప్లేయర్‌గా సంగీత ప్రపంచంలోకి అడుగు పెట్టిన రిక్కీ ఆ తరువాత ఫుల్‌టైమ్ కంపోజర్‌గా మారాడు. నస్రత్ ఫతే అలీఖాన్, పండిట్ రవిశంకర్, పీటర్ గాబ్రియెల్ తనకు ఇష్టమైన సంగీతకారులు.

జింగిల్స్ చేయడం అంటే రిక్కీకి చాలా ఇష్టం. జింగిల్స్ చేయడం అంటే తన దృష్టిలో రోజూ వ్యాయామం చేయడం లాంటిది. సృజనాత్మక పరిధిని పెంచుకోవడంలాంటిది. ఎన్నో భాషల్లో, ఎన్నో జానర్స్‌లో జింగిల్స్ చేస్తున్నప్పుడల్లా తనలో అదనపు శక్తి వచ్చినట్లుగా భావిస్తాడు. ఇప్పటివరకు మూడువేలకు పైగా జింగిల్స్ చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా వంద మ్యూజిక్ అవార్డ్‌లు గెలుచుకున్నాడు. రిక్కీకి నచ్చిన పుస్తకం రిచర్డ్ డాకిన్స్ ది గాడ్ డిలూజన్. నిజానికి రిక్కీ తండ్రి, తాతతో సహా బంధువుల్లో చాలామంది వైద్యులుగా పనిచేశారు.

'రిక్కీలో ఆర్టిస్టిక్ జీన్స్ తాత నుంచి వచ్చాయి' అని మురిసిపోతుంది తల్లి పమ్మి.

తాత జానకిదాస్ నటుడు, భావుకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు.

2014లో తన గర్ల్‌ఫ్రెండ్ వర్షను వివాహం చేసుకున్నాడు రిక్కీ కేజ్.





● సోమవారం గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో రిక్కీ కేజ్, హెర్బర్ట్ వాల్ట్ (ప్రొడ్యూసర్), రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్

నవ రత్నాలు

'డివైన్ టైడ్స్' విడుదల అయిన కొత్తలో ఈ ఆల్బమ్‌కు గ్రామీ అవార్డ్ గెలుచుకునే సంపూర్ణ అర్హతలు ఉన్నాయని కితాబు ఇచ్చారు సంగీత విశ్లేషకులు. వారి మాట నిజమైంది. 'డివైన్ టైడ్స్' లోని వండర్స్ ఆఫ్ లైఫ్, హిమాలయాస్, అవర్‌హోమ్, ఆర్డ్ ఆఫ్ డివోషన్, పాస్టోరల్ ఇండియా, ఐయామ్ ఛేంజ్, ఏ ప్రేయర్, గాంధీ, మదర్ ఎర్త్... తొమ్మిది ట్రాక్స్ నవరత్నాలుగా పేరు తెచ్చుకున్నాయి. ఈ ఆల్బమ్‌లో మూల సూత్రం ఏమిటి?

మనతో మనం... అంటే ఎవరికి వారు తమ వ్యక్తిగత ప్రంచంలోకి వెళ్లి తమను తాము కొత్తగా పరిచయం చేసుకోవడం. తమను తాము విశ్లేషించుకోవడం, విశ్లేషణ ఫలితాలను ఆచరణలోకి తీసుకురావడం.

కాలంతో పాటు మనం... కాలంపై మనదైన సంతకం ఉండాలి. కాలం చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలి. కాలం విసిరే ప్రశ్నలకు జవాబు వెదుక్కోవాలి. కాలం విసిరే సవాళ్లకు పరిష్కారాలు ఆలోచించాలి.

మన గ్రహంతో మనం... భూమికి మనం ఎంతో రుణపడి ఉన్నాం. ఆ రుణం తీరేది కాదు. మనం చేయాల్సిందల్లా చెట్టును కాపాడుకోవాలి. చెట్టుపైన పిట్టను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణ నినాదం మన శ్వాసలో భాగం కావాలి.

వ్యక్తిత్వ నిర్మాణంలో నేస్తం

ఆసక్తిగా మొదలై, అభిరుచిగా మారి రిక్కీ జీవితంలోకి వచ్చిన సంగీతం 'సంగీతమే నా వ్యక్తిత్వం' అనే స్థాయికి చేరుకుంది. అదే శ్వాస అయింది. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు సంగీతంలో కెరీర్‌ను వెదుక్కోవడానికి ఇష్టంగా లేరు. దీని గురించి ప్రస్తావిస్తూ 'మన దేశంలో తల్లిదండ్రులు పిల్లల కెరీర్‌కు సంబంధించిన నిర్ణయాలను పాషన్‌పై కాకుండా భయంపై తీసుకుంటారు. ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఆర్థికకోణాన్ని దృష్టిలో పెట్టుకొని కెరీర్‌ను ఎంచుకోవడం కాకుండా ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని ఎంచుకోవాలి. సంప్రదాయ వృత్తులకు దూరంగా తాము ఎంచుకున్న మార్గం ద్వారా మీ పిల్లలు పెద్దగా డబ్బు సంపాదించలేకపోవచ్చు. అయితే డబ్బు కంటే విలువైన ఆనందాన్ని సొంతం చేసుకుంటారు' అంటాడు రిక్కీ కేజ్. గ్రామీ అవార్డ్ అందుకున్న యంగెస్ట్ ఇండియన్, మూడు గ్రామీలు అందుకున్న 'ఓన్లీ ఇండియన్'గా తనదైన ప్రత్యేకత సంపాదించుకున్న రిక్కీ కేజ్ (41)... 'సంగీతం అనేది హాయిగా విని ఆస్వాదించడానికి మాత్రమే కాదు మన వ్యక్తిత్వ నిర్మాణంలో సహాయపడుతుంది. మన పాటలలో ఎక్కువగా ప్రేమ, శాంతి, మంచితనం చుట్టూ అల్లుకున్నవే' అంటాడు.

సాగుబడి

ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 18 వరకు

15 నుంచి ఆకాశ్ చౌరాసియా శిక్షణా శిబిరం




గో ఆధారిత బహుళ అంచెల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రసిద్ధ యువ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు ఆకాశ్ చౌసియా 5 రోజుల పాటు తెలుగు రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. రసాయన రహిత ఆరోగ్య భారతాన్ని నిర్మించే కృషిలో భాగంగా గ్రామభారతి, శ్రీ వేణుగోపాల స్వామి మందిరా గోశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు హైదరాబాద్ గండిపేట దగ్గర గంగుర్తిలోని వేణుగోపాల స్వామి మందిర గోశాలలో ఈ రెసిడెన్షియల్ శిబిరం జరుగుతుంది. ఏకకాలంలో అనేక ఉద్యాన పంటలు సాగు చేసే బహుళ అంతస్తుల ప్రకృతి సేద్యం, విలువ జోడింపుపై ఆకాశ్ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ, ఆహార వసతి సదుపాయాలు కల్పిస్తారు. ప్రవేశ రుసుం రూ. 2,500. ఇతర వివరాలకు.. 74161 60182.

12న గుంటూరులో చిరుధాన్యాల మేళా

రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమంతో పాటు చిరుధాన్యాల వంటకాలపై ఈ నెల 12(ఆదివారం)న ఉ. 10 గం. నుంచి సా 4 గం. వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. సిరిధాన్యాల వాడకంతో ఆధునిక రోగాల నియంత్రణ, నిర్మూలనపై స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలి అవగాహన కల్పిస్తారు. చిరుధాన్యాలతో లడ్లు, మురుకులు, పాయసం, కుడుములు, బూందీ, బిర్యానీ లాంటి వివిధ రకాల వంటకాల తయారీ పద్ధతులను చిరుధాన్య వంటల నిపుణులు మిల్లెట్స్ రాంబాబు తెలియజేస్తారు. ప్రవేశం ఉచితం. వివరాలకు 97053 83666, 70939 73999

13న హైదరాబాద్‌లో డా. ఖాదర్‌వలి సభ



మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా డా. ఖాదర్ వలి ఈ నెల 13(సోమవారం)న సా. 5. గంటలకు హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా జరిగే సభలో ప్రసంగిస్తారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ ఈ సందర్భంగా డా. ఖాదర్‌ను ఘనంగా సన్మానించనున్నాయి.

'మేనేజ్' అగ్రి ఫిల్మ్ ఫెస్టివల్

జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్) వ్యవసాయ సంబంధమైన అంశలపై ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనుంది. ఈ నెల 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఫిల్మ్స్‌ను పంపాలి.
మార్చి 10న అవార్డుల ప్రదానం ఉంటుంది. జాతీయ, రాష్ట్ర, సంస్థాగత స్థాయిలో 50 బహుమతులు ఇస్తారు.
వివరాలకు... శరత్‌కుమార్– 99510 23410

బ్రహ్మీ, వస సాగు.. భలే బాగు!

● వరి సాగుకు ప్రత్యామ్నాయం.. నీటి వసతి ఉన్న నల్లరేగడి పొలాల్లో బ్రహ్మీ, వస సాగు
● బ్రహ్మీ ఏడాదికి 3 సార్లు కోత.. వస 9 నెలలకోసారి కోత ● ఏడాదికి ఎకరానికి రూ.50 వేల-లక్ష వరకు నికరాదాయం



బ్రహ్మీ.. 4 నెలలకో కోత



వస.. 9 నెలల పంట

మాగాణి రేగడి భూముల్లో వరి, పెసర, మినుము మాత్రమేనా? ఇంకే ఇతర పంటలూ సాగు చేసుకోలేమా? ఉన్నాయి. ఔషధ పంటలున్నాయి. ఎకరానికి ఏటా రూ. లక్షకు తగ్గకుండా నికరాదాయం ఇచ్చే బ్రహ్మీ, వస వంటి దీర్ఘకాలిక ఔషధ పంటలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కొందరు రైతులు ఈ పంటలను నీటి వసతి ఉన్న మాగాణి నల్లరేగడి భూముల్లో సాగు చేస్తూ చక్కని ఆదాయం పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు వీరిని ప్రోత్సహిస్తోంది. ఆయుర్వేద ఔషధ పరిశ్రమదారులతో కొనుగోలు ఒప్పందాలు చేయించి సాగు చేయిస్తుండటం విశేషం. బహ్మీ, వస పంటల సాగులో అక్కడి ముగ్గురు రైతుల అనుభవాలను పరిశీలిద్దాం..

బ్రహ్మీ (Bacopa monneiri) నేల మీద పాకే తీగజాతి దీర్ఘకాలిక పంట. బ్రహ్మీ పంటను వరి పంటకు మాదిరిగానే దమ్ము చేసి, 2–3 అంగుళాల మొక్క కటింగ్‌ను నాటాలి. ఒకసారి నాటితే చాలు. 5 ఏళ్ల పాటు మళ్లీ నాటక్కర లేదు. 4 నెలలకోసారి పంట కోతకు వస్తుంది. అయితే, ఏడాది పొడవునా పంట పొలాన్ని కాపాడుకోవాల్సి ఉంటుంది. పొలం అంతా బ్రహ్మీ మొక్కలు అల్లుకుపోతాయి కాబట్టి కలుపు సమస్య ఉండదు. అయితే, పంట కోతకు వచ్చినప్పుడు అవసరాన్ని బట్టి కలుపు తీసి, తర్వాత కొడవళ్లతో నేల మట్టానికి బ్రహ్మీ మొక్కలను కోస్తారు. ఆ తర్వాత కొంచెం ఎరువు చల్లి నీటి తడి ఇస్తే చాలు.. పంట మళ్లీ ఏపుగా పెరుగుతుంది. ప్రతి కోతకు ఎకరానికి 3,000–6,000 కిలోల పచ్చి బ్రహ్మీ మొక్కల దిగుబడి వస్తుంది. ఆరుబయట గచ్చు మీద ఎండబెడితే.. కొద్ది రోజుల్లో 600–700 కిలోల ఎండు బ్రహ్మీ సిద్ధమవుతుంది. దీని ధర మార్కెట్‌లో రూ. 40–50 వరకు ఉంటుంది. అంటే కోతకు రూ. 30 వేల చొప్పున.. ఏడాదిలో 3 కోతలకు.. రూ. 90 వేల వరకు రైతుకు ఆదాయం వస్తుంది. ప్లాంటింగ్ మెటీరియల్‌ను రైతులకు మొదటిసారి ఔషధ మొక్కల బోర్డు ఇస్తుంది. పెరిగిన పంట నుంచి తీసి 2–3 అంగుళాల ముక్కలను నాటుకుంటున్నారు. మొక్కలను ఎలా నాటుకోవాలో రైతులకు శిక్షణ ఇస్తారు. బ్రహ్మీ మొండి మొక్క. నిర్వహణ పెద్దగా అవసరం లేదు. ఒకటి, రెండు సార్లు కలుపు తీస్తే చాలు. ఎరువులు వాడాలని లేదు. జీవామృతం వాడినా సరిపోతుంది.

పసుపు పంట మాదిరిగా వస (Bach-Acorus calamus) 2–3 అడుగుల ఎత్తున పెరుగుతుంది. 9 నెలల పంట. కొమ్ములను నాటుకోవాలి. మొక్కలు పెంచైనా నాటుకోవచ్చు. 9 నెలలకు కొమ్ములు తవ్వి తీసి, ఎండ బెట్టి, పాలిషింగ్ చేసి ఔషధ కంపెనీలకు విక్రయించాలి. 20–30 ఎకరాలకు ఒకటి చొప్పున పాలిషింగ్ మిషన్ అవసరం. ఎకరానికి 10–20 క్వింటాళ్ల వస కొమ్ముల దిగుబడి వస్తుంది. ఎకరానికి ఖర్చు రూ.20 వేలు పోను, రూ. 60 వేలు–లక్ష వరకు నికరాదాయం వస్తుంది.

ఎకరానికి ఏటా రూ. 70 వేల నికరాదాయం



అశ్వని శబారియా.. గౌరెల్లా పెండ్ర మర్వాహి జిల్లా పెండ్ర పట్టణ శివారులో ఈ యువ రైతు 10 నెలల క్రితం 9 ఎకరాల్లో బ్రహ్మీ, 2.5 ఎకరాల్లో వస సాగు ప్రారంభించారు. బీకాం చదువుకున్న అశ్వని ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. తిపాన్ నది ఒడ్డున దేవుడి మాన్యం నల్ల రేగడి భూమిని కౌలుకు తీసుకొని, బోర్ల ద్వారా నీటిని తోడుకుంటూ సాగు చేస్తున్నారు. బ్రహ్మీ నాటు మొక్కలు, వస విత్తన కొమ్ములను ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు ద్వారా తీసుకున్నారు. వర్మీ కంపోస్టు, వేపపిండి చల్లి దుక్కి చేసిన తర్వాత మొక్కలు నాటారు. తర్వాత ఎరువులేమీ వేయటేదు. వారానికి రెండు సార్లు తగుమాత్రంగా నీటి తడి ఇస్తున్నారు. ఈ రెండు పంటలకూ నీరు నిల్వ ఉండక్కరలేదు. మట్టిలో తేమ బాగా ఉంటే చాలు. బ్రహ్మీ పంటను అశ్వని 10 నెలల్లో 3 సార్లు కోసి, ఎండబెట్టి విక్రయించారు. బ్రహ్మీ సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి 3 కోతల్లో రూ. 90 వేల ఆదాయం. అన్నీ కలిపి రూ. 20 వేల ఖర్చవుతోంది. రూ. 70 వేలు నికరాదాయమని అశ్వని తెలిపారు. బ్రహ్మీలో వరి కన్నా ఎక్కువ ఆదాయం వస్తున్నదన్నారు. బ్రహ్మీ కొనుగోలుదారులను ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు పరిచయం చేసిందన్నారు. ఆన్‌లైన్‌లో నేరుగా విక్రయించడానికి ఇండియామార్ట్. కామ్ వెబ్‌సైట్‌లో కూడా తాను రిజిస్టర్ చేసుకున్నారు. మార్కెటింగ్ సమస్య లేదంటున్నారు రైతు అశ్వని శబారియా (81203 57007).

ప్రకృతి సేద్యంలో ఏపుగా బ్రహ్మీ



దోమన్‌లాల్ సాహు.. బలోదబజార్ జిల్లా గైత్ర గ్రామంలో 25 ఎకరాల సొంత భూమిలో వరి, కంది, శనగ తదితర పంటలను 4 ఏళ్లుగా ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగు చేస్తూ రసాయనిక ఎరువులు వాడే రైతులతో సమానంగా దిగుబడులు తీస్తున్నారు. 6 నెలల క్రితం బోర్డు ద్వారా మొక్కలు తెప్పించి 2 ఎకరాల నల్లరేగడిలో నాటారు. పంట కోతకు సిద్ధంగా ఉంది. ఎకరానికి వర్మీకంపోస్టు 2 క్వింటాళ్లు, 100 కిలోల ఘనజీవామృతం చల్లి దమ్ము చేసి, బ్రహ్మీ మొక్కలు నాటారు. వర్మీవాష్, వేస్ట్‌డీకంపోజర్, ద్రవ జీవామృతం 15 రోజులకో సారి పిచికారీ చేస్తున్నారు. పంట ఆరోగ్యంగా పెరిగింది. ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు ద్వారా విక్రయిస్తానని సాహు (62651 71801) తెలిపారు.

రూ. 50-60 వేల నికరాదాయం



● ఎండిన బ్రహ్మీని చూపుతూ...

సుగత్‌సింగ్ (66) జాంజ్‌గిర్ ఛాంప జిల్లా ఖటోల గ్రామానికి చెందిన సింగ్ వందెకరాల్లో సేద్యం చేసే రైతు. వరి, గోధుమ, పప్పుధాన్యాలు పండిస్తారు. 2021 జూలైలో ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు సూచన మేరకు నల్లరేగడి భూమి 3 ఎకరాల్లో బ్రహ్మీ, 2 ఎకరాల్లో వస నాటారు. ఎకరానికి 4 క్వింటాళ్ల సిటీ కంపోస్టు దుక్కిలో వేసి, అవసరం మేరకు నీటి తడులు ఇస్తున్నారు. బ్రహ్మీ పంటను కోసి గచ్చుపై ఎండబెడుతున్నారు. వరిలో ఎకరానికి రూ. 30–35 వేలు నికరాదాయం వస్తుంటే.. బ్రహ్మీ, వసలో రూ. 50–60 వేల వరకు వస్తోందని సింగ్(83055 61057) తెలిపారు. మామిడి చెట్ల నీడలో సర్పగంధ మొక్కలను 16 నెలల క్రితం వేశారు. మరో 2 నెలల్లో కోతకు రానుంది.

మార్కెటింగ్ సమస్య లేదు!



ఔషధ మొక్కల సాగు ద్వారా రైతులు సాధారణ పంటలతో పోల్చితే అధిక నికరాదాయం పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వరి సాగు చేసే నల్ల రేగడి, లోతట్టు ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఔషధ పంటలైన బ్రహ్మీ, వసను సాగు చేసుకోవచ్చు. ఎకరానికి రూ. లక్ష వరకు నికరాదాయం పొందే వీలుంది. విత్తనాలు, మొక్కలను బోర్డు ద్వారా అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఔషధాల తయారీదారులు, వ్యాపారులతో ముందే టైఅప్ చేసుకొని తగిన జాగ్రత్తలతో అవగాహన ఒప్పందం చేసుకొని మార్కెటింగ్ సమస్య లేకుండా చేస్తున్నాం. రైతుల ఉత్పత్తులకు మంచి ఆదాయం వచ్చేలా చేస్తున్నాం. ఎకరానికి ఏడాదికి రూ. పది లక్షల వరకు ఆదాయం వచ్చే ఔషధ పంటలు కూడా ఉన్నాయి. ఏ రాష్ట్రంలోని రైతులకైనా, సంస్థలకైనా కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు మా బోర్డు సిద్ధంగా ఉంది.

– జె.ఎ.సి.ఎస్.రావు (96769 95404), సీఈఓ, ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు, పూర్వ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రాయపూర్. cgsmpb.ceo@gmail.com

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీకి జ్యోతి



ఈనెల 10 నుంచి 12 వరకు కజకిస్తాన్ రాజధాని అస్తానాలో జరిగే ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 25 మందితో కూడిన భారత జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ స్ప్రింటర్ జ్యోతి యర్రాజీకి చోటు లభించింది. విశాఖపట్టణానికి చెందిన జ్యోతి 60 మీటర్లు, 60 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్స్‌లో పోటీపడుతుంది. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన మిరామస్ ఎలైట్ ఇండోర్ ట్రాక్ అథ్లెటిక్స్ మీట్‌లో జ్యోతి 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం సాధించింది.

తొలి రౌండ్‌లోనే సానియా జోడీ ఓటమి



అబుదాబి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సానియా మీర్జా (భారత్)–బెథానీ మాటెక్ (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా–బెథానీ ద్వయం 3–6, 4–6తో ఫ్లిప్‌కెన్స్ (బెల్జియం)–లౌరా సిగెముండ్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడింది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా జోడీ తమ సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయింది. సానియా–బెథానీలకు 4,350 డాలర్లు (రూ. 3 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'పసిడి' నెగ్గిన గురునాయుడు



సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. అండర్–18 బాలుర వెయిట్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్.గురు నాయుడు పసిడి పతకం సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో సోమవారం 55 కేజీల విభాగంలో గురు నాయుడు మొత్తం 227 కేజీల బరువెత్తి అగ్ర స్థానంలో నిలిచాడు. టామ్చో మీటీ (మణిపూర్) రజతం, విజయ్ ప్రజాపతి (మధ్యప్రదేశ్) కాంస్య పతకం గెలుపొందారు. ప్రస్తుతం పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 2 స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో కలిపి మొత్తం ఆరు పతకాలతో 15వ స్థానంలో ఉంది.

విజేత సామ్యూల్ స్టీఫెన్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఓపెన్ 'ఫిడే' రేటెడ్ బిలో–1600 చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 ఏళ్ల కుర్రాడు సామ్యూల్ స్టీఫెన్ నోబెల్ విజేతగా నిలిచాడు. వీ4 చెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో సామ్యూల్ స్టీఫెన్ తొమ్మిది రౌండ్లకుగాను 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సామ్యూల్ ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. విజేతగా నిలిచిన సామ్యూల్‌కు భారీ ట్రోఫీతోపాటు రూ. 1 లక్ష ప్రైజ్‌మనీగా లభించింది. హర్షల్ పాటిల్ (మహారాష్ట్ర; 8 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచి రూ. 60 వేలు... కె.సమర్‌తేజ (తెలంగాణ; 8 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి రూ. 40 వేలు ప్రైజ్‌మనీ గెల్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.



ఇదీ ఇ-ఫార్ములా...

దాదాపు పుష్కరకాలం క్రితం భారత్‌లో ప్రతిష్టాత్మక ఫార్ములావన్ (ఎఫ్1) రేసింగ్ వచ్చింది. మూడేళ్లు ఢిల్లీ బుధ్ సర్క్యూట్‌లో కార్లు దూసుకుపోయిన తర్వాత వేర్వేరు కారణాలతో ఎఫ్1 నిర్వాహకులు భారత్ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు సరిగ్గా పదేళ్ల క్రితం అదే అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) మన దేశంలో మరో రేసింగ్ ఈవెంట్‌కు అనుమతి ఇచ్చింది. అయితే దేశంలోనే ఇతర ప్రధాన నగరాలను కాదని ఫార్ములా-ఇ రేసింగ్‌కు వేదికగా మన హైదరాబాద్‌ను ఎంచుకోవడం విశేషం. భారత్‌లో జరగబోతున్న ఈ తొలి రేస్ గత కొంత కాలంగా అన్ని వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. హుస్సేన్ సాగర్ తీరాన ఈ వారాంతంలో అలా జూమ్మంటూ రేసింగ్ కార్లు సందడి చేయనున్న నేపథ్యంలో ఇ-ఫార్ములా విశేషాలు...

రేసింగ్ పోటీలకు సిద్ధమైన హైదరాబాద్ ● ఈ నెల 11న ప్రధాన రేసు



సాక్షి, హైదరాబాద్: రేసింగ్ ప్రపంచంలో ఫార్ములా వన్ అన్నింటికంటే పెద్ద ఈవెంట్. ఎఫ్1 కార్లు పెట్రోల్‌తో పని చేస్తాయి. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇదే తరహాలో ఎలక్ట్రిక్ కార్లతో కూడా రేస్‌లు నిర్వహించేందుకు అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) అధికారికంగా ముందుకొచ్చింది. కాలుష్య నివారణకు ప్రచారం కల్పించడంలో భాగంగా ఇలాంటి కార్లను ప్రోత్సహించాలనే ఉద్దేశం కూడా వీటి ప్రారంభానికి కారణం. దాంతో 2014లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు జరగబోతున్న ఫార్ములా–ఇ సింగిల్ సీటర్ ఎలక్ట్రిక్ కార్ రేసింగ్‌లో అన్నింటికంటే అత్యుత్తమ స్థాయి ఈవెంట్. పర్యావరణహితం అంటూ 'గో గ్రీన్' పేరుతో ఈ రేసింగ్‌లను ఆయా దేశాలు ప్రోత్సహిస్తున్నాయి.

● ఇప్పటి వరకు ఎనిమిది సీజన్లు ఫార్ములా–ఇ పోటీలను నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్నది 9వ సీజన్. ఈ సీజన్‌లో మొత్తం 16 రేస్‌లు జరగనుండగా... హైదరాబాద్‌లో నాలుగోది నిర్వహిస్తున్నారు. తొలి మూడింటికి మెక్సికో సిటీ, దిరియా (సౌదీ అరేబియా–2 రేస్‌లు) ఆతిథ్యమిచ్చాయి. కేప్‌టౌన్, సావోపాలో, బెర్లిన్, మొనాకో, జకార్తా, పోర్ట్‌లాండ్, రోమ్, లండన్‌లలో తర్వాత రేస్‌లు జరుగుతాయి.

● ఎఫ్1లో ఉండే ప్రత్యేక సర్క్యూట్‌లతో పోలిస్తే ఫార్ములా–ఇ పోటీలు అన్నింటికీ దాదాపుగా జనావాసం మధ్యలో ఉండే 'స్ట్రీట్ సర్క్యూట్'లలో నే జరుగుతాయి. హైదరాబాద్‌లో కూడా నగరం మధ్యలో హుస్సేన్‌సాగర్ తీరాన నెక్లెస్ రోడ్‌వద్ద నిర్వహించేందుకు ఇదే ప్రధాన కారణం. 'గ్రీన్‌కో' సంస్థ ఈ ఈవెంట్‌కు ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది.

● ఫార్ములా–ఇ కార్‌ల గరిష్ట వేగం గంటకు 320 కిలోమీటర్లు. గత ఎనిమిది సీజన్లతో పోలిస్తే ఈసారి కొత్తగా జెన్3 (జనరేషన్ 3) కార్లను ఉపయోగిస్తున్నారు. జెన్ 3 బ్యాటరీలు, ఎలక్ట్రిక్ మోటార్ ఇందులో ఉంటాయి. పనితీరు, సామర్థ్యంలో ప్రస్తుత ఎలక్ట్రిక్ కార్లలో ఇవే అత్యుత్తమం. ఇందులో 40 శాతం వరకు ఎనర్జీ కేవలం బ్రేక్‌లు వాడటం ద్వారానే 'రీజనరేటివ్'తో ఉత్పత్తి అవుతుంది. రబ్బర్, రీసైకిల్డ్ ఫైబర్‌లనే టైర్ల తయారీలో వాడతారు. కాలుష్యరహితంగా, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొనే ఈ కార్లను తయారు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చెవులు చిల్లులు పడే ఎఫ్1 కార్ల శబ్దంతో పోలిస్తే తక్కువ డెసిబుల్స్‌తో ఈ కార్లు పరుగు తీస్తాయి.

● ఫార్ములా–ఇ జట్లలో ఎక్కువ భాగం టీమ్‌లు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు చెందినవే ఉన్నాయి. భారత్‌కు చెందిన మహీంద్ర మోటార్స్ కూడా అలాంటిదే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇ–రేసింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఎఫ్1 దిగ్గజాలైన మెక్‌లారెన్, మసెరాటి వంటి సంస్థలు కూడా ఇందులోకి అడుగు పెట్టాయి. ప్రఖ్యాత బ్రిటిష్ కంపెనీ 'జాగ్వార్' కూడా పోటీల బరిలో ఉంది.

● సాధారణ రేసింగ్ ప్రేమికుల కోణంలో ఫార్ములా–ఇ పోటీలకు ఎఫ్1 రేస్‌లతో పోలిక వస్తుంది. అయితే వీటి మధ్య ప్రస్తుతానికి పోలిక అనవసరం. అత్యుత్తమ స్థాయి సాంకేతికత వాడినా సరే, ఎఫ్1 కంటే ఇ–కార్లలో ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉంది. ఉదాహరణకు ఎఫ్1 కార్ హార్స్‌పవర్ (ఇంజన్ సామర్థ్యం) 1000 ఉంటే, 'ఇ' కార్లలో ఇది 350 మాత్రమే. 'ఇ' రేస్‌లలో ఎక్కువగా ఉండే మలుపుల వల్ల కూడా వేగం తగ్గుతుంది. అయినా సరే, అభిమానులను అలరించడంతో ఒక రకంగా అంచనాకు మించి ఫార్ములా 'ఇ' పోటీలు విజయవంతం అయ్యాయి. 45 నిమిషాల నిర్విరామ వినోదం అందించడంలో ఇవి అందరికీ చేరువయ్యాయి.



హైదరాబాద్ రేస్ విశేషాలు

వచ్చే శుక్ర, శనివారాల్లో రేస్‌లు జరుగుతాయి. శుక్రవారం, శనివారం జరిగే రెండు ఫ్రీ ప్రాక్టీస్ సెషన్‌లలో అన్ని జట్లు సాధన చేస్తాయి. శనివారం ఉదయం 10.40 నుంచి క్వాలిఫయింగ్ రేస్ నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రధాన రేసు జరుగుతుంది. సర్క్యూట్‌లో మొత్తం 17 మలుపులు ఉన్నాయి. మొత్తం 11 జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు బరిలోకి దిగుతున్నారు. భారత్‌కు చెందిన 'మహీంద్ర' టీమ్ 2014 నుంచి కూడా పోటీ పడుతుంది. ఈసారి మహీంద్ర జట్టుకు ఒలివర్ రోలండ్, ల్యూకాస్ గ్రాసి డ్రైవర్లుగా వ్యవహరిస్తున్నారు.

తేజ్‌నారాయణ్ డబుల్ సెంచరీ

వెస్టిండీస్ 447/6 డిక్లేర్డ్



బులవాయో: కెరీర్‌లో ఆడుతున్న మూడో టెస్టులోనే వెస్టిండీస్ యువ క్రికెటర్ తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (467 బంతుల్లో 207 నాటౌట్; 16 ఫోర్లు, 3 సిక్స్‌లు) 'డబుల్ సెంచరీ'తో అదరగొట్టాడు. జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో ఓవర్‌నైట్ స్కోరు 221/0తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ 6 వికెట్లకు 447 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు సాధించింది.

కెప్టెన్, మరో ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (312 బంతుల్లో 182; 18 ఫోర్లు)తో కలిసి తేజ్‌నారాయణ్ తొలి వికెట్‌కు 336 పరుగులు జోడించారు. వీరిద్దరు ఏకంగా 685 బంతులు ఎదుర్కోవడం విశేషం. మరో రెండు బంతులు ఆడి ఉంటే టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక బంతులు ఆడిన ఓపెనింగ్ జోడీగా వీరిద్దరు ప్రపంచ రికార్డు సృష్టించేవారు. అత్యధిక బంతులు ఆడిన ఓపెనింగ్ జోడీగా అటపట్టు–సనత్ జయసూర్య (శ్రీలంక; పాకిస్తాన్‌పై 686 బంతులు; 2000లో) పేరిట రికార్డు ఉంది.

దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ కుమారుడైన తేజ్‌నారాయణ్ డబుల్ సెంచరీ చేసిన క్రమంలో అరుదైన ఘనతలో భాగమయ్యాడు. పాకిస్తాన్‌కు చెందిన తండ్రీ, కొడుకు క్రికెటర్లు హనీఫ్ మొహమ్మద్ (337; వెస్టిండీస్‌పై 1958లో; 203 నాటౌట్; న్యూజిలాండ్‌పై 1965లో), షోయబ్ మొహమ్మద్ (203 నాటౌట్; భారత్‌పై 1989లో; 203 నాటౌట్; న్యూజిలాండ్‌పై 1990లో) తర్వాత టెస్టు క్రికెట్ చరిత్రలో 'డబుల్ సెంచరీ'లు సాధించిన తండ్రీ, కొడుకులుగా శివనారాయణ్, తేజ్‌నారాయణ్ గుర్తింపు పొందారు. గతంలో శివనారాయణ్ (203 నాటౌట్; దక్షిణాఫ్రికాపై 2005లో; 203 నాటౌట్; బంగ్లాదేశ్‌పై 2012లో) రెండు డబుల్ సెంచరీలు సాధించాడు. హనీఫ్, షోయబ్ (రెండుసార్లు) యాదృచ్ఛికంగా 203 పరుగులు చేసి అజేయంగా నిలువగా... శివనారాయణ్ కూడా రెండుసార్లు 203 పరుగులు చేసి నాటౌట్‌గా నిలువడం విశేషం.

ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత్ పరాజయం



హర్మన్

కేప్‌టౌన్: టి20 ప్రపంచ కప్‌కు సన్నాహాల్లో భాగంగా సోమవారం జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టుకు నిరాశ ఎదురైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా బౌలింగ్‌లో అదరగొట్టినా... పేలవ బ్యాటింగ్‌తో మూల్యం చెల్లించుకొని 44 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. మొదట ఆసీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. వేర్‌హమ్ (17 బంతుల్లో 32 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు), జొనాసెన్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో శిఖా, పూజ, రాధా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 15 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. దీప్తి శర్మ (19 నాటౌట్; 3 ఫోర్లు), హర్లీన్ (12), అంజలి శర్వాణి (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా 8 మంది సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ బోణీ



బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టుకు శుభారంభం లభించింది. గత ఏడాది రన్నరప్ అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 13–15, 15–9, 15–14, 15–11, 10–15తో విజయం సాధించింది. తొలి సెట్ కోల్పోయిన హైదరాబాద్ ఆ వెంటనే తేరుకొని వరుసగా మూడు సెట్‌లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన ఐదో సెట్‌ను అహ్మదాబాద్ గెల్చుకున్నా ఊరట చెందింది. మ్యాచ్‌లో అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేసిన హైదరాబాద్ జట్టు ఆటగాడు గురుప్రశాంత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. నేడు జరిగే మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్‌తో కొచ్చి బ్లూ స్పైకర్స్ ఆడతుంది.

సినిమా



● అల్లు అర్జున్



● ఐశ్వర్యా రాయ్



● ప్రభాస్

అన్ని సినిమాలకూ కథ ఉంటుంది. కొన్ని సినిమాలకు పెద్ద కథ ఉంటుంది. అయితే ఆ పెద్ద కథని రెండున్నర గంటల్లో చూపించలేరు. అందుకే రెండు మూడు భాగాలుగా చూపిస్తారు. అలా ఈ ఏడాది ఇటు సౌత్ అటు నార్త్‌లో 'పార్ట్ 2' సినిమాలు చాలానే రానున్నాయి. తొలి భాగం విడుదలై, ఘనవిజయం సాధించిన నేపథ్యంలో మలి భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక కొన్ని చిత్రాలైతే తొలి, మలి భాగం రెండూ ఆన్ సెట్స్‌లో ఉన్నాయి. ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.

ఓ పెద్ద కథ

ప్రస్తుతం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె', ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'సలార్' చిత్రాలు చేస్తున్నారు ప్రభాస్. ఈ చిత్రాలు రెండు భాగాలుగా విడుదల కానున్నాయని టాక్. అలాగే హీరో ఎన్టీఆర్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో ఓ సినిమా ఉందనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని, తొలి భాగంలో ఎన్టీఆర్ హీరోగా, రెండో భాగంలో ధనుష్ హీరోగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక సూర్య హీరోగా శివ డైరెక్షన్‌లో రూపొందుతున్న చిత్రం కూడా రెండు భాగాలుగా వస్తుందని టాక్. ఇంకా బాలీవుడ్ నిర్మాతలతో కలిసి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, రామాయణం ఆధారంగా ఓ భారీ చిత్రాన్ని ప్లాన్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమా రెండు భాగాలు రానుందని టాక్.



● ధనుష్



● ఎన్టీఆర్

● రెండు సినిమాలు

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'పుష్ప'. ఈ చిత్రం తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరులో రిలీజై సూపర్‌హిట్ అయింది. దీంతో మలి భాగం 'పుష్ప: ది రైజ్'పై మరింత ఫోకస్ పెట్టింది ఈ టీమ్. ఈ సినిమా షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది. 'పుష్ప: ది రూల్'ను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఫిల్మ్ 'పొన్నియిన్ సెల్వన్'. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రం తొలి భాగం గత ఏడాది సెప్టెంబరులో విడుదలై ఘనవిజయం సాధించింది. ఆల్రెడీ షూటింగ్ కూడా పూర్తి చేసుకున్న రెండో భాగం ఈ ఏడాది ఏప్రిల్ 28న విడుదల కానుంది. అలాగే తమిళంలో 'వడ చెన్నై', 'అసురన్' వంటి సూపర్ హిట్స్‌ను అందించిన దర్శకుడు వెట్రిమారన్ ప్రస్తుతం 'విడుదలై' అనే సినిమాను తీస్తున్నారు. విజయ్ సేతుపతి, సూరి హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. రెండు భాగాలకు సంబంధించిన మేజర్ షూటింగ్ పూర్తయింది. మొదటి భాగాన్ని ఈ ఏడాది వేసవిలో, రెండో బాగాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనుకుంటున్నారు. అదే విధంగా మరో తమిళ దర్శకుడు గౌతమ్ మీనన్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'వెందు తనిందదు కాడు' (తెలుగులో 'ది లైఫ్ ఆఫ్ ముత్తు) చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి భాగం గత ఏడాది సెప్టెంబరులో విడుదలైంది. మలి భాగం రిలీజ్‌పై త్వరలో ఓ స్పష్టత రానుంది. అదే విధంగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలోనే విక్రమ్ హీరోగా 'ధృవనక్షత్రం' అనే సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. తొలి భాగాన్ని ఈ ఏడాదిలో రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట. అటు మలయాళంలో 'రామ్' రెండు భాగాలుగా రూపొందుతోంది. మోహన్‌లాల్‌కు 'దృశ్యం', 'దృశ్యం 2' వంటి హిట్స్‌ను అందించిన జీతూ జోసెఫ్ ఈ సినిమాకు దర్శకుడు. సౌత్‌లోనే కాదు నార్త్‌లోనూ ఈ ట్రెండ్ కనిపిస్తోంది. రణబీర్ కపూర్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. ట్రయాలజీగా ఈ సినిమాను తీస్తున్నారు. తొలి భాగం విడుదలైన విషయం తెలిసిందే. మలి భాగం త్వరలోనే సెట్స్‌కి వెళ్లనుంది. అలాగే జాన్ అబ్రహాం హీరోగా రూపొందిన 'ఎటాక్' తొలి భాగం గత ఏడాది ఏప్రిల్‌లో రిలీజైంది. మలి భాగం రెడీ అవుతోంది. ఇవే కాదు.. రెండు భాగాల చిత్రాలు కొన్ని సెట్స్‌లో, ఇంకొన్ని చర్చల దశల్లో ఉన్నాయి.



● రణ్‌బీర్, ఆలియా



● విక్రమ్ ● ధనుష్ ● మోహన్‌లాల్

రావణా...



● సుశాంత్, దక్ష, రవితేజ

రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేస్తున్నారు. అభిషేక్ నామా, రవితేజ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'రావణ..' అంటూ సాగే థీమ్ సాంగ్‌ని విడుదల చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ థీమ్ సాంగ్‌ని కంపోజ్ చేయగా, పాపులర్ మ్యూజిక్ వేదిక్ బ్యాండ్ శాంతి పీపుల్, నోలిక్ ఈ థీమ్ సాంగ్‌ని ఆలపించారు. ''హై ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. రవితేజను లాయర్ పాత్రలో చూపిస్తున్నారు సుధీర్ వర్మ. కథలో ఊహించని మలుపులుంటాయి. ఏప్రిల్ 7న మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

మిస్టరీ వసంతకోకిల



● బాబీ సింహా, చిరంజీవి

కమల్‌హాసన్, శ్రీదేవి జంటగా బాలు మహేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వసంత కోకిల'. 1982లో ఈ చిత్రం రిలీజైంది. ఇప్పుడు అదే పేరుతో ఓ సినిమా రానుంది. బాబీ సింహా, కాశ్మీర జంటగా రమణన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వసంత కోకిల'. రేష్మి సింహా, రజనీ తాళ్లూరి, రామ్ తాళ్లూరి నిర్మించారు. తెలుగు, తమిళ్, కన్నడలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను హీరో చిరంజీవి విడుదల చేసి, చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. కన్నడ ట్రైలర్‌ను హీరో శివరాజ్ కుమార్ లాంచ్ చేశారు. ''మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ మూవీ రూపొందింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నారాయణ మూర్తి ప్రజా దర్శకుడు - బ్రహ్మానందం



● బ్రహ్మానందం, నారాయణమూర్తి

''ఇండస్ట్రీలో కళా దర్శకులు, వ్యాపారాత్మక దర్శకులు ఉన్నారు. కానీ, ప్రజా దర్శకుడు అంటే ఆర్. నారాయణ మూర్తి ఒక్కరే. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పాటు పడే వ్యక్తి ఆయన'' అన్నారు ప్రముఖ నటుడు బ్రహ్మానందం. ఆర్. నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ సినిమా టైటిల్ లోగోని బ్రహ్మానందం రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''ఎడ్యుకేషన్ మాఫియా, విద్యా వ్యవస్థలోని లోపాలతో నారాయణ మూర్తిగారు తీసిన ఈ చిత్రాన్ని ఆదరించాలని ప్రేక్షకులను, నా ఫ్యాన్స్‌ని కోరుతున్నాను'' అన్నారు. ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''వైజాగ్ సత్యానంద్ గారి శిష్యులు ఈ సినిమాలో నటించారు. భారతదేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో 'యూనివర్సిటీ' తీశాను. విద్య, వైద్యం ప్రైవేట్ పరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. విజయనగరం పార్లకిమిడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాను.. నాకు సహకరించిన మంత్రి బొత్స సత్యనారాయణగారికి, ఇతరులకు థ్యాంక్స్'' అన్నారు.

కవలలు హీరోలుగా...



● రామకృష్ణ, హరికృష్ణ

నిజ జీవితంలో కవలలు అయిన రామకృష్ణ, హరికృష్ణ హీరోలుగా పరిచయమవుతున్నారు. తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''తెలుగు ఇండస్ట్రీలో మాకంటూ ఓ స్థానం కోసం టీఎస్ఆర్ మూవీ మేకర్స్‌ని ప్రారంభించి, తొలి చిత్రానికి శ్రీకారం చుట్టాం. మా పిల్లలు రామకృష్ణ, హరికృష్ణలను ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నాం. డైరెక్టర్, ఇతర వివరాలను త్వరలో చెబుతాం'' అన్నారు. ''చిన్నప్పటి నుంచి యాక్టర్స్ కావాలనే కల ఇప్పుడు నెరవేరుతోంది'' అన్నారు రామకృష్ణ, హరికృష్ణ.

క్రికెట్ నేపథ్యంలో...



● విశ్వ, అవంతిక, నితిన్

విశ్వ కార్తికేయ, శరణ్, అవంతిక, అర్చన గౌతమ్ హీరో హీరోయిన్లుగా సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐపీఎల్'. బీరం వరలక్ష్మి సమర్పణలో అంకిత మీడియా హౌస్ బ్యానర్‌పై బీరం శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''చిన్న చిత్రాలు హిట్ అయినప్పుడు సంతోషంగా ఉంటుంది. 'ఐపీఎల్' మూవీ కూడా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. ''క్రికెట్, తీవ్రవాదం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. సినిమా బాగా వచ్చింది.. అందరూ చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు సురేష్ లంకలపల్లి. ''మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు బీరం శ్రీనివాస్. ''ఈ సినిమాలో పాటలు హిట్ కావడానికి కారణం మ్యూజిక్ డైరెక్టర్ వేంగి సుధాకర్'' అన్నారు విశ్వ కార్తికేయ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	335	60,507
నిఫ్టీ ▽	89	17,765

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,899	▽	109
డోజోన్స్	33,807	▽	119
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,837	▽	65
డాక్స్	15,346	▽	131
షాంఘై	3,239	▽	25
నికాయ్	26,397	△	184

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,455
బంగారం (99.5 స్వచ్ఛత)	57,225
వెండి (కేజీ)	67,606

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.41	83.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	88.03	91.16
€	యూరో	ఒకటి	98.78	102.13
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.98	65.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.94	59.33
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.75
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్‌కార్డ్	20.24	22.01
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్‌కార్డ్	21.31	23.07
¥	చైనా యువాన్	ఫారెక్స్‌కార్డ్	10.26	12.85

ఈ దఫా రేటు పెంపు పావుశాతమే!

- ఆర్‌బీఐ 'పాలసీ' భేటీ ప్రారంభం
- బుధవారం కీలక నిర్ణయాల వెల్లడి



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైంది. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో జరుగుతున్న ఈ మూడు రోజుల సమావేశ కీలక నిర్ణయాలు బుధవారం వెలువడతాయి. అయితే ఈ దఫా రేటు పెంపు స్పీడ్ తగ్గే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ రేటు– రెపో 25 బేసిస్ పాయింట్ల (0.25 శాతం) మేర పెంచే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత జరుగుతున్న మొదటి పాలసీ సమీక్ష ఇది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతానికి ఎగసింది. విశ్లేషకుల అంచనాలు నిజమైతే ఈ రేటు తాజా పాలసీ సమీక్ష సందర్భంగా 6.50 శాతానికి చేరే అవకాశం ఉంది. అక్టోబర్ వరకూ గడచిన 10 నెలల్లో రెపో రేటు నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతంపైబడి కొనసాగిన సంగతి గమనార్హం. నవంబర్, డిసెంబర్‌లలో ఇది 6 శాతం దిగువకు చేరడం విశ్లేషకుల తాజా అంచనాల నేపథ్యం.

సెయిల్ లేదా ఎన్‌ఎండీసీలో వైజాగ్ స్టీల్ విలీన ప్రతిపాదనలు

కేంద్ర మంత్రి కులస్తే వెల్లడి

న్యూఢిల్లీ: వైజాగ్ స్టీల్‌ను (ఆర్‌ఐఎన్‌ఎల్) సెయిల్, ఎన్‌ఎండీసీలో విలీనం చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం ఆర్‌ఐఎన్‌ఎల్‌లో 4,875 మంది ఎగ్జిక్యూటివ్‌లు, 10,005 మంది నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉన్నారని రాజ్యసభకు రాతపూర్వక సమాధానంలో ఆయన వివరించారు. కంపెనీ ఆర్థిక పరిస్థితి అంతగా బాగా లేనందున రిక్రూట్‌మెంట్‌ను క్రమబద్ధీకరించినట్లు కులస్తే పేర్కొన్నారు. పబ్లిక్ ఇష్యూ లేదా బాండ్ల జారీ ద్వారా ఆర్‌ఐఎన్‌ఎల్ నిధులు సమీకరించే యోచనేదీ లేదని తెలిపారు.

1.1 బిలియన్ డాలర్లు ముందస్తు చెల్లింపు

తనఖాలోని షేర్లను విడిపించుకునేందుకు అదానీ గ్రూప్ నిర్ణయం



న్యూఢిల్లీ: తనఖాలో ఉన్న అదానీ గ్రూప్ సంస్థల షేర్లను విడిపించుకునేందుకు ప్రమోటర్లు 1.1 బిలియన్ డాలర్లను ముందస్తుగా చెల్లించనున్నారు. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్స్ (ఏపీ సెజ్), అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ (ఏటీఎల్) సంస్థల షేర్లు వీటిలో ఉన్నాయి. ఇవి వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో మెచ్యూర్ కానున్నాయి. ఇటీవల మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడిన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు అదానీ గ్రూప్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూప్ సంస్థల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో కంపెనీల షేర్లు కుప్పకూలిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రకటన ప్రకారం తనఖా ఉంచిన షేర్లకు సంబంధించి ఏపీసెజ్‌లో 12 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీలో 3 శాతం, అదానీ ట్రాన్స్‌మిషన్‌లో 1.4 శాతం ప్రమోటర్ల వాటాలను విడిపించనున్నారు.

అదానీ ట్రాన్స్‌మిషన్ లాభం 73 శాతం అప్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అదానీ ట్రాన్స్‌మిషన్ లాభం దాదాపు 73 శాతం పెరిగి రూ. 478 కోట్లకు చేరింది. అమ్మకాల వృద్ధి, వన్‌టైమ్ ఆదాయం నమోదు కావడం ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో లాభం రూ. 277 కోట్లు. తాజాగా ఆదాయం రూ. 2,623 కోట్ల నుంచి రూ. 3,037 కోట్లకు చేరింది.



రిలయన్స్ హైడ్రోజన్ ట్రక్

బెంగళూరులో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్‌లో హైడ్రోజన్‌తో నడిచే ట్రక్కును రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రదర్శించింది. అశోక్ లేల్యాండ్ దీన్ని తయారు చేసింది. ఇందులో రెండు భారీ హైడ్రోజన్ సిలిండర్లు ఉంటాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445–00
విజయవాడ	445–00
రిటైల్ ధర (డజను)	72.00
6-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.75

సెన్సెక్స్ ర్యాలీకి బ్రేక్

- నిఫ్టీకి 89 పాయింట్ల నష్టం
- ఐటీ, మెటల్, పవర్ అమ్మకాలు
- సెంటిమెంట్‌ను దెబ్బతీసిన ఫెడ్ వడ్డీరేట్ల భయాలు
- ఎఫ్‌ఐఐల వరుస విక్రయాలు



ముంబై: ఐటీ, మెటల్, పవర్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగిసింది. అమెరికాలో ఉద్యోగ కల్పన మెరుగైనట్లు గణాంకాలు వెలువడ్డాయి. దీంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుపై కఠిన వైఖరి కొనసాగించవచ్చనే ఆందోళనలు తెరపైకి వచ్చాయి. దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగాయి. అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు ఆగలేదు. అధిక వెయిటేజీ రిలయన్స్(1%), ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్(2%), ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ (2.50%) షేర్లు పతనమయ్యాయి. ఈ పరిణామాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం ఆరు పాయింట్లు పెరిగి 60,847 వద్ద, నిఫ్టీ 35 పాయింట్ల నష్టంతో 17,819 వద్ద మొదలయ్యాయి. ప్రతికూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 496 పాయింట్లు పతనమై 60,346 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు క్షీణించి 17,698 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 335 పాయింట్లు నష్టపోయి 60,507 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు క్షీణించి 17,765 వద్ద స్థిరపడ్డాయి. దీంతో సెన్సెక్స్ అయిదురోజుల వరుస ర్యాలీకి విరామం పడినట్లైంది. ఎఫ్ఎంసీజీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 0.75 శాతం, స్మాల్ క్యాప్ సూచీ అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1218 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1203 కోట్ల షేర్లను కొన్నారు. యూఎస్ జాబ్ డేటా అంచనాలకు మించి నమోదవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

రూపాయి నాలుగు నెలల్లో అతిపెద్ద పతనం



దేశీయ కరెన్సీ రూపాయి నాలుగు నెలల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 82.35 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడికి లోనై చివరికి 68 పైసలు క్షీణించి నెల కనిష్ఠ స్థాయి 82.76 వద్ద ముగిసింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలపడటం రూపాయి కోతకు కారణమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు తగ్గలేదు. ఈ గ్రూప్‌నకు చెందిన మొత్తం పదింటిలో 6 కంపెనీల షేర్లు నష్టపోయాయి. అదానీ ట్రాన్స్‌మిషన్స్ 10%, అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మర్ షేర్లు 5% చొప్పున క్షీణించాయి. అయితే అదానీ పోర్ట్స్ (9.50%), అంబుజా సిమెంట్స్ (1.54%), ఏసీసీ (2.24%), ఎన్‌డీటీవీ (1.37) చొప్పున లాభపడ్డాయి. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి (జనవరి 24) నుంచి ఫిబ్రవరి 6 వరకు మొత్తం 9 ట్రేడింగ్ సెషన్‌లో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ.9.5 లక్షల కోట్లకు పైగా పతనమైంది.
- వార్షిక ప్రాతిపదికన క్యూ3లో నికర నష్టాలు తగ్గడంతో పేటీఎం షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్‌ఈలో ఆరుశాతానికిపైగా లాభపడి రూ.558 వద్ద స్థిరపడింది. ఒకదశలో ఎనిమిది శాతం బలపడి రూ.566 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

టాటా స్టీల్ రూ. 2,502 కోట్ల నష్టాలు



న్యూఢిల్లీ: టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏకంగా రూ. 2,502 కోట్ల నష్టాన్ని (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. వ్యయాలు గణనీయంగా పెరగడమే ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో కంపెనీ రూ. 9,598 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఇక తాజాగా ఆదాయం రూ. 60,843 కోట్ల నుంచి రూ. 57,354 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 48,666 కోట్ల నుంచి రూ. 57,172 కోట్లకు పెరిగాయి. కంపెనీ రుణ భారం ప్రస్తుతం రూ. 71,706 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో రూ. 3,632 కోట్ల మొత్తాన్ని కంపెనీ పెట్టుబడి వ్యయాలపై వెచ్చించింది. ఉక్కుఉత్పత్తి 7.76 మిలియన్ టన్నుల (ఎంటీ) నుంచి 7.56 ఎంటీకి తగ్గింది. ఒడిదుడుకుల పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేశీయంగా అమ్మకాల్లో స్థిర వృద్ధి సాధించగలిగామని టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ తెలిపారు. వ్యయాల నియంత్రణ, నిర్వహణను మెరుగుపర్చుకోవడంపై మరింతగా దృష్టి పెట్టుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఏటా 40 శాతం వృద్ధి

ఎలక్ట్రిక్ బస్సుల విభాగంపై స్విచ్ మొబిలిటీ సీఈవో మహేశ్ బాబు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల విభాగం వచ్చే పదేళ్లలో ఏటా సుమారు 40% మేర వృద్ధి చెందవచ్చని అంచనా వేస్తున్నట్లు స్విచ్ మొబిలిటీ సీఈవో మహేశ్ బాబు తెలిపారు. గతేడాది 1,200 ఎలక్ట్రిక్ బస్సులు రిజిస్టర్ కాగా, ఈసారి 2,000 దాటేయొచ్చని చెప్పారు. వచ్చే ఏడాది ఇది 6,000కు చేరవచ్చని సాక్షి బిజినెస్ బ్యూరోకు వివరించారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సు తయారీ వ్యయం సగటున రూ. 1.5 కోట్ల స్థాయిలో ఉంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సానుకూల పాలసీలు ఇందుకు తోడ్పడగలవని ఆయన చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపర్చుకోవడంపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుందని మహేశ్ బాబు చెప్పారు. తమ సంస్థ విషయానికొస్తే.. ఇప్పటికే 500 పైచిలుకు బస్సులు సరఫరా చేశామని, వచ్చే 12–18 నెలల్లో సుమారు 2,600 బస్సులు అందించనున్నామన్నారు. తెలంగాణకు దాదాపు 1,000 బస్సులు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను తయారు చేస్తున్నది తమ కంపెనీ మాత్రమేనని, హెచ్‌ఎండీఏకి 6 అందిస్తున్నామని తెలిపారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్, సికింద్రాబాద్‌లో 1793 పోస్టులు

సికింద్రాబాద్‌లోని సెంట్రల్ రిక్రూట్‌మెంట్ సెల్, ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రీజియన్లలో ట్రేడ్స్‌మ్యాన్ మేట్, ఫైర్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1793
- » **పోస్టుల వివరాలు:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్–1249, ఫైర్‌మ్యాన్–544.
- » **రీజియన్లు:** ఈస్టర్న్, వెస్టర్న్, నార్తర్న్, సదరన్, సౌత్ వెస్టర్న్, సెంట్రల్ వెస్ట్, సెంట్రల్ ఈస్ట్.
- » **అర్హత:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టులకు మెట్రిక్యులేషన్, ఐటీఐ, ఫైర్‌మ్యాన్ ఖాళీలకు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు ట్రేడ్స్‌మ్యాన్ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900, ఫైర్‌మ్యాన్ ఖాళీలకు రూ.19,900 నుంచి రూ.63,200 ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎండ్యూరెన్స్/స్కిల్ టెస్ట్, రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.
- » **వెబ్‌సైట్:** www.aocrecruitment.gov.in

డీఎంహెచ్‌వో, విశాఖపట్నంలో 13 పారామెడికల్ పోస్టులు

విశాఖపట్నంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. ప్రభుత్వాసుపత్రుల్లో తాత్కాలిక/ఒప్పంద ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
- » **పోస్టుల వివరాలు:** క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2–2, ప్లంబర్–1, ఆడియో మెట్రీషియన్–1, రేడియోగ్రాఫర్–2, ఆప్తాల్మిక్ అసిస్టెంట్–1, స్పీచ్ థెరపిస్ట్–3, ఈసీజీ టెక్నీషియన్–1, డెంటల్ టెక్నీషియన్–1, ఫార్మసిస్ట్ గ్రేడ్2–1.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఎస్సీ, డీఫార్మసీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విశాఖపట్నం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 07.02.2023.
- » **వెబ్‌సైట్:** https://visakhapatnam.ap.gov.in

జేఈఈ కటాఫ్ అంచనా.. 85-90!

జేఈఈ-మెయిన్.. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్, బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. అంతేకాకుండా ఐఐటీల్లో బీటెక్‌లో సీటు పొందేందుకు కూడా జేఈఈ-మెయిన్‌లో అర్హత తప్పనిసరి! ఇంతటి కీలకమైన జేఈఈ-మెయిన్ 2023 తొలి సెషన్ ముగిసింది. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో.. కటాఫ్ అంచనాపై ఆందోళన వ్యక్తమవుతోంది!! ఏప్రిల్‌లో జరిగే రెండో సెషన్‌కు హాజరు కావాలా? వద్దా? అనే సందేహాలు. ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్ -2023 జనవరి సెషన్ విశ్లేషణ.. కటాఫ్ మార్కుల అంచనా.. ఏప్రిల్ సెషన్‌లో రాణించడమెలాగో తెలుసుకుందాం..

- » ముగిసిన జేఈఈ-మెయిన్ 2023 జనవరి సెషన్
- » 85-90 మధ్యలో కటాఫ్ అనే అంచనాలు
- » ఏప్రిల్ సెషన్‌కు నేటి నుంచే దరఖాస్తు ప్రక్రియ



జేఈఈ–మెయిన్ జనవరి సెషన్ పరీక్షలను జనవరి 24, 25, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించారు. జనవరి 28న మాత్రం.. రెండో షిఫ్ట్‌ను బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్), బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులకు నిర్దేశించిన పేపర్ 2ఏ, పేపర్ 2బీ పరీక్షలు జరిగాయి. 'జేఈఈ–మెయిన్ జనవరి సెషన్ పేపర్లు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. పలు షిఫ్ట్‌లలో నిర్వహించిన పరీక్షల్లో కొన్ని షిఫ్ట్‌లు క్లిష్టంగా.. మరికొన్ని షిఫ్ట్‌లు ఓ మాదిరిగా ఉన్నాయి. స్కోర్లు, మార్కుల కేటాయింపులో ఎన్‌టీఏ నార్మలైజేషన్ విధానాన్ని అనుసరిస్తుంది. కాబట్టి క్లిష్టంగా ఉన్న స్లాట్లకు హాజరైన అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని అంటున్నారు నిపుణులు.

తొలి షిఫ్ట్ సులభం

జనవరి 24న నిర్వహించిన తొలి షిఫ్ట్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రశ్నలన్నీ సీబీఎస్ఈ 11, 12 తరగతుల సిలబస్ నుంచే అడిగారు. మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ సాధారణ స్థాయిలో, ఫిజిక్స్ సబ్జెక్ట్ సులభంగా ఉంది. మొత్తంగా చూస్తే తొలి షిఫ్ట్ గతేడాది కంటే కొంత తేలికగా ఉందని విద్యార్థుల అభిప్రాయం.న్యూమరికల్ టైప్ ప్రశ్నలు మాత్రం సుదీర్ఘంగా, కాలిక్యులేషన్స్ ఎక్కువగా చేయాల్సిన విధంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు కొంత సమయాభావ సమస్య ఎదురైంది. రెండో షిఫ్ట్‌లో కెమిస్ట్రీ క్లిష్టంగా, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి.

రెండో రోజు

జనవరి 25న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ ఓ మోస్తరు క్లిష్టతతో, ఫిజిక్స్ సులభంగా ఉన్నాయని అంటున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో అసెర్షన్స్ అండ్ రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. అదే విధంగా ఫార్ములా బేస్డ్ కొశ్చన్స్‌కు, న్యూమరికల్ బేస్డ్ కొశ్చన్స్‌కు ప్రాధాన్యం కనిపించింది. రెండో షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఉండడమే కాకుండా.. ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి కొన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్ ఓ మోస్తరు క్లిష్టతతో ఉండగా.. న్యూమరికల్ టైప్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి.

మూడో రోజు.. సుదీర్ఘం

జనవరి 29న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో.. ప్రశ్నలు సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. ముఖ్యంగా మ్యాథమెటిక్స్‌లో ప్రశ్నలు కాలిక్యులేషన్ ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా అడిగారు. కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఉండడమే కాకుండా.. ఆర్గానిక్ కెమిస్ట్రీకి ఎక్కువ వెయిటేజీ కనిపించింది. దాదాపు 12 ప్రశ్నలు ఈ విభాగం నుంచే అడిగారు. ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉండడం విద్యార్థులకు కలిసొచ్చిన అంశంగా పేర్కొనొచ్చు. రెండో షిఫ్ట్‌లో.. మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి.

నాలుగో రోజు

జనవరి 30న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ ఓ మోస్తరు క్లిష్టతతో ఉంది. ఆల్జీబ్రా, కాలిక్యులస్, పారాబోలా, ఎలిప్స్, డెఫినిట్ ఇంటిగ్రల్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, మాత్రికలు చాప్టర్లకు వెయిటేజీ లభించింది. ప్రశ్నలు మాత్రం సుదీర్ఘ సమాధానాలు ఇచ్చేలా.. కాలిక్యులేషన్ అవసరమయ్యేలా ఉన్నాయి. ఫిజిక్స్‌లో కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, హీట్ అండ్ థర్మో డైనమిక్స్, రే ఆప్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఎలక్ట్రోస్టాటిక్స్, ఏసీ సర్క్యూట్స్, మోడ్రన్ ఫిజిక్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, కెపాసిటర్స్ అంశాలకు వెయిటేజీ కనిపించింది. కెమిస్ట్రీలో ఫిజికల్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించింది. అదే విధంగా ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ నుంచి ఆరు ప్రశ్నల వరకు అడిగారు. రెండో షిఫ్ట్‌లో.. సీబీఎస్ఈ 11వ తరగతి చాప్టర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. మ్యాథమెటిక్స్‌లో.. కాలిక్యులస్, కోఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్స్ అండ్ 3డీ, ఆల్జీబ్రాలకు ప్రాధాన్యం కనిపించింది. ఫిజిక్స్‌లో సీబీఎస్ఈ 12వ తరగతి అంశాలకు ప్రాధాన్యం కనిపించింది. ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉంది. కెమిస్ట్రీలో సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే ప్రశ్నలు ఎదురయ్యాయి.న్యూమరికల్ బేస్డ్ ప్రశ్నలలో అధిక శాతం ప్రశ్నలు ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి అడిగారు.

అయిదో రోజు

జనవరి 31న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో.. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కొంత తికమకకు గురిచేసేలా ఉన్నాయి. కాలిక్యులేషన్ ఆధారంగా సమాధానాలు ఇచ్చేలా ఉన్నాయి. ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. సెమీ కండక్టర్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఈఎం వేవ్స్, మ్యాగ్నటిక్ ఫీల్డ్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఇండక్షన్‌కు ఎక్కువ వెయిటేజీ కనిపించింది. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. రెండో షిఫ్ట్‌లో..అన్ని సబ్జెక్ట్‌లలోనూ సుదీర్ఘ సమాధానాలు ఇవ్వాల్సిన ప్రశ్నలు ఎదురయ్యాయి. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కాలిక్యులేషన్ అవసరమైనవిగా ఉండడంతో సమయాభావ సమస్య ఎదురైంది. కెమిస్ట్రీలో ప్రశ్నలు కూడా ఓ మోస్తరు క్లిష్టతతో అడిగారు. ఫిజిక్స్ మాత్రం సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మెకానిక్స్, వేవ్స్, మోడ్రన్ ఫిజిక్స్‌లకు కొంత ఎక్కువ ప్రాధాన్యం కనిపించింది. ప్రశ్నలన్నీ ఫార్ములా బేస్డ్‌గా ఉండడంతో విద్యార్థులు సులభంగా సమాధానాలు ఇవ్వగలిగారని నిపుణులు అంటున్నారు.

చివరి రోజు.. సులభంగా

చివరి రోజు ఫిబ్రవరి 1న నిర్వహించిన మొదటి షిఫ్ట్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మ్యాథమెటిక్స్‌లో మాత్రం కొంత సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే ప్రశ్నలు కనిపించాయి. కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించింది. ఫిజిక్స్‌లో మోడ్రన్ ఫిజిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. రెండో షిఫ్ట్‌లో.. ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో అడిగారు. మ్యాథమెటిక్స్‌లో ఫార్ములా బేస్డ్ ప్రశ్నలకు ప్రాధాన్యం కనిపించింది. అదే విధంగా సీబీఎస్ఈ 12వ తరగతి చాప్టర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్‌లో ఫార్ములా బేస్డ్, కాన్సెప్ట్ ఆధారిత కొశ్చన్స్ అడిగారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే

మొత్తంగా అన్ని షిఫ్ట్‌లను పరిగణనలోకి తీసుకుంటే..దాదాపు ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ఆధారంగా చేసుకునే అడిగారు. దీంతో స్టేట్ బోర్డ్ విద్యార్థుల కంటే సీబీఎస్ఈ విద్యార్థులకు కొంత కలిసొచ్చే అవకాశం ఉందంటున్నారు.

సమయాభావం సమస్యగా

జేఈఈ–మెయిన్ జనవరి సెషన్‌లో.. అన్ని షిఫ్ట్‌ల విద్యార్థులు సమయాభావ సమస్యను ఎదుర్కొన్నట్లు చెబుతున్నారు. అన్ని షిఫ్ట్‌లలోనూ మ్యాథమెటిక్స్‌లో న్యూమరికల్ టైప్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు అభ్యర్థులకు కొంత ఎక్కువ సమయం పట్టింది. దీంతో ఇది మిగతా ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడంపై ప్రభావం చూపిందంటున్నారు. ప్రశ్నలన్నీ గత రెండేళ్లలో ఆయా విభాగాల్లో అడిగిన కాన్సెప్ట్‌ల మాదిరిగానే ఉన్నాయని అంటున్నారు. ప్రీవియస్ పేపర్లను సాధన చేసిన వారు తేలిగ్గా సమాధానాలు ఇచ్చే ఆస్కారం లభించిందని పేర్కొంటున్నారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీకి కొంత ఎక్కువ వెయిటేజీ కల్పించారనే భావన నెలకొంది.

ఫార్ములా, అప్లికేషన్ బేస్ట్

మొత్తంగా చూస్తే జేఈఈ–మెయిన్ తొలి సెషన్‌లోని అన్ని షిఫ్ట్‌లలోనూ ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలన్నీ ఫార్ములా బేస్డ్‌గా, అప్లికేషన్ ఆధారితంగా ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు. ప్రిపరేషన్ సమయంలో కాన్సెప్ట్స్‌ను ఆధారంగా చేసుకుంటూ ప్రశ్నలు సాధన చేసిన వారు సమాధానాలు గుర్తించే విధంగా ఉన్నాయని చెబుతున్నారు.

కటాఫ్ పర్సంటైల్.. 85-90

జేఈఈ–మెయిన్ తొలి సెషన్‌లో కటాఫ్ జనరల్ కేటగిరీకి 85 నుంచి 90; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కి 60–65; ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 30–40గా ఉండొచ్చని పేర్కొంటున్నారు. గత ఏడాది కటాఫ్ జనరల్‌లో 88.4121, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 63.1114, ఓబీసీ కేటగిరీలో 67.0090, ఎస్సీ కేటగిరీలో 43.0820, ఎస్టీ కేటగిరీలో 26.7771లుగా ఉన్న సంగతి తెలిసిందే.

రెండో సెషన్‌కు హాజరు కావాలా?

జేఈఈ–మెయిన్ 2023 తొలి సెషన్ ముగిసిన నేపథ్యంలో.. ఏప్రిల్‌లో నిర్వహించే రెండో సెషన్‌కు హాజరు కావాలా? వద్దా? అనే సందేహం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. తొలి సెషన్‌లో ఆశించిన మేర మార్కులు వస్తాయనుకునే అభ్యర్థులు అడ్వాన్స్‌డ్‌పై దృష్టి పెట్టాలని.. అదే ప్రిపరేషన్‌తో ఏప్రిల్ సెషన్ జేఈఈ–మెయిన్‌కు కూడా హాజరు కావచ్చొని సూచిస్తున్నారు. అంతేకాకుండా.. జేఈఈ మెయిన్‌లోని మూడు సబ్జెక్ట్‌ల్లోని.. ప్రతి సబ్జెక్ట్‌లో గరిష్ఠంగా 18 నుంచి 20 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చి.. 85 పర్సంటైల్ వస్తుందనే ధీమా ఉన్న అభ్యర్థులు రెండో సెషన్ గురించి ఆలోచించకుండా.. అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవ్వాలని సూచిస్తున్నారు.

రెండో సెషన్ కోసం

- తొలి సెషన్‌లో ప్రదర్శనను స్వీయ విశ్లేషణ చేసుకుంటూ.. రెండో సెషన్‌కు సన్నద్ధం కావాలి.
- తాము చేసిన పొరపాట్లు, ఏ టాపిక్స్‌కు సంబంధించిన అంశాల్లో సమాధానాలు రాయలేదో.. వాటిపై దృష్టి పెట్టాలి.
- ఆయా అంశాల్లో పట్టు సాధించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి. అదే విధంగా ప్రతి రోజు పునశ్చరణకు తప్పనిసరిగా నిర్దిష్ట సమయం కేటాయించుకోవాలి.

బోర్డ్ పరీక్షలకు తొలి ప్రాధాన్యం

ఎన్‌టీఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం-జేఈఈ-మెయిన్ రెండో సెషన్.. ఏప్రిల్ ఆరు నుంచి 12వ తేదీ వరకు జరుగనుంది. అంటే.. విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఇప్పటి నుంచి రెండు నెలల సమయం అందుబాటులో ఉంది. మరోవైపు మార్చిలో బోర్డ్ పరీక్షలు జరుగనున్నాయి. కాబట్టి ప్రస్తుతం విద్యార్థులు బోర్డ్ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత సమయాన్ని ఏప్రిల్‌లో జరిగే మెయిన్ పరీక్షకు కేటాయించాలి.

ఏప్రిల్ సెషన్.. ముఖ్యమైన టాపిక్స్

- **మ్యాథమెటిక్స్:** 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ ఆల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్.
- **ఫిజిక్స్:** కైనమాటిక్స్, హార్మోనిక్ మోషన్స్, గ్రావిటేషన్, హీట్ అండ్ థర్మో డైనమిక్స్, వేవ్స్ అండ్ సౌండ్స్, మ్యాగ్నటిక్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఇండక్షన్, ఎలక్ట్రో స్టాటిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆప్టిక్స్, మోడ్రన్ ఫిజిక్స్.
- **కెమిస్ట్రీ:** జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆల్కైల్స్, యాసిడ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. అదే విధంగా కెమికల్ బాండింగ్, పీరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలుగా ఉంటాయి. దీనికి అనుగుణంగా అభ్యర్థులు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి.

ఏప్రిల్ సెషన్ ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 7 – మార్చి 7, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** మార్చి చివరి వారంలో
- **రెండో సెషన్ పరీక్ష తేదీలు:** 2023 ఏప్రిల్ 6 నుంచి 12 వరకు (ప్రతి రోజు రెండు షిఫ్ట్‌లలో)
- **పూర్తి వివరాలకు, ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్:** jeemain.nta.nic.in

క్లుప్తంగా...

9, 10 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన మహామేళా

సాక్షి, హైదరాబాద్: ఈనెల 9, 10 తేదీల్లో అన్ని పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి యోజన ఖాతాల మహామేళా నిర్వహించనున్నామని తపాలాశాఖ పేర్కొంది. పదేళ్లలోపు ఉన్న ఆడ పిల్లల తల్లిదండ్రులందరూ పాప జనన ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రూ. 250తో ఖాతా తెరిచే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. 20 లేదా అంతకంటే ఎక్కువ ఖాతాలు ఉన్నాయంటే పోస్టాఫీసు సిబ్బందే ఇంటి వద్దకు వస్తారని, వివరాలకు 040–23463531/524/526 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరింది.


'జోన్ పరిధిలో ఎక్కడైనా ఎంచుకోవచ్చు'

సాక్షి, హైదరాబాద్: ప్రధానోపాధ్యాయులు బదిలీ కోసం వారి మల్టీజోన్ పరిధిలోని ఏ జిల్లానైనా ఎంచుకోవచ్చని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ స్పష్టం చేసినట్లు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భానుచంద్ర ప్రకాశ్ తెలిపారు. ఈమేరకు సంఘం నేతలు సోమవారం ఆమెను బదిలీ అంశంపై కలిశారు. ఒకవేళ స్పౌజ్ పాయింట్లు వినియోగించుకోదలిస్తే స్పౌజ్ పనిచేస్తున్న జిల్లాకు మాత్రమే బదిలీపై వెళ్లడానికి అవకాశం కల్పిస్తామన్నారు.

రామ్‌కో సిమెంట్స్‌కి ఎంసీసీఐ సీఎస్ఆర్ అవార్డు

సాక్షి, హైదరాబాద్: రామ్‌కో సిమెంట్స్ సీఎస్ఆర్ ప్రాజెక్టు 'ప్రమోషన్ ఆఫ్ శానిటేషన్ అండ్ హైజీన్ త్రూ స్మార్ట్ టాయిలెట్స్ ఇన్ అరియలూర్ డిస్ట్రిక్ట్'కు మద్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఎంసీసీఐ) అవార్డు దక్కింది. ఎంసీసీఐ ఈ ప్రతిష్టాత్మక అవార్డును 2018లో ప్రారంభించింది. తమిళనాడులో సామాజిక సేవలో విశిష్ట సేవలందించిన సంస్థకు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. సీఎస్ఆర్ ప్రాజెక్టు సామాజిక సేవ, పారదర్శకత, పలు సామాజిక కార్యక్రమాలతో గుర్తింపు పొందింది. ఈమేరకు ఎంసీసీఐ చైర్మన్ సీకే రంగనాథన్ విజేతలకు అవార్డులు అందించారు. సీఎస్ఆర్ సంస్థ తరఫున రవిచంద్రన్, విష్ణు అవార్డును అందుకున్నారు.

జేఈఈ మెయిన్ తొలిసెషన్ ఫలితాలు నేడు!



సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ తొలివిడత పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యే అవకాశముంది. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీవరకు జరిగిన ఈ పరీక్షలకు 9 లక్షల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో పేపర్–1 (బీఈ, బీటెక్) పరీక్షకు 8.6 లక్షల మంది, పేపర్–2 (బీఆర్క్, బీప్లానింగ్) పరీక్షకు 46 వేల మంది హాజరయ్యారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. సోమవారం అర్ధరాత్రి దాటాక లేదా మంగళవారం ఈ ఫలితాలు వెల్లడయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. కాగా, ఎన్‌టీఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండోవిడత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమై, మార్చి 7వ తేదీ వరకు కొనసాగుతుంది. దరఖాస్తు ఫారం https://jeemain.nta.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఎన్‌టీఏ తెలిపింది. జేఈఈ మెయిన్ ఏప్రిల్ సెషన్ పరీక్షల సిటీ స్లిప్‌లను మార్చి 3వ వారంలో విడుదల చేయనున్నారు. మార్చి చివరి వారంలో రెండోసెషన్ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ విడుదల చేయనుంది.

దేశపు తొలి డ్రోన్ కోసం పది స్టార్టప్‌లకు మద్దతు

రాయదుర్గం: భారతదేశపు మొట్టమొదటి డ్రోన్ కోసం పది స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చేందుకు టీహబ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ), అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) ఇంటెల్ ముందుకొచ్చాయి. భారతదేశమంతటా డ్రోన్ టెక్నాలజీపై దృష్టి సారించిన స్టార్టప్‌ల నుంచి 300కి పైగా దరఖాస్తులు వచ్చాయి. న్యూఢిల్లీ, ముంబాయి, పాట్నా, బెంగళూరు, హైదరాబాద్ నుంచి యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ జూలై 2022లో ప్రారంభమైంది. ఈ ప్రోగ్రామ్.. అవసరమైన సాధనాలు, నైపుణ్యాలతో స్టార్టప్‌లను శక్తివంతం చేస్తుంది. భారతదేశంలో డ్రోన్ టెక్నాలజీని స్వీకరించడం, నిర్దిష్ట వినియోగ కేసులను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ భద్రత, ఆరోగ్య సంరక్షణ, ప్రజాభద్రత, రవాణా, వ్యవసాయంలలో డ్రోన్ టెక్ సొల్యూషన్స్‌పై దృష్టి సారించిన స్టార్టప్‌లను టీ హబ్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేశారు. అందులోని పది స్టార్టప్‌లలో ఇన్ఫినిట్, అకిన్ ఎనలైటిక్స్, డేబెస్ట్ రీసెర్చ్, డ్రోగో డ్రోన్స్, ఇన్ డ్రోన్స్, ఓప్లస్ ఇన్నోవేషన్, సెన్సేకర్ ల్యాబ్స్, వెక్రోస్ టెక్నాలజీస్, వ్యోమిక్ డ్రోన్స్, యరలవ టెక్నాలజీస్ ఉన్నాయి.



శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న రామాలయం (ఫైల్)

సీతారాముల కల్యాణానికి ముహూర్తం

- మార్చి 30 శ్రీరామనవమి, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం
- 22 నుంచి ఏప్రిల్ 5 వరకు తిరు కల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారైంది. మార్చి 30వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ సీతారాముల తిరుకల్యాణోత్సవం నిర్వహణకు ముహూర్తం నిశ్చయించారు. కాగా, 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కర పట్టాభిషేకం మార్చి 31న జరగనుండగా, బ్రహ్మోత్సవాలు, పట్టాభిషేక మహోత్సవం షెడ్యూల్‌ను వైదిక కమిటీ, ఆలయ ఈవో శివాజీ సోమవారం ప్రకటించారు.

ఉగాది పర్వదినాన...

మార్చి 22 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు, మార్చి 22 నుంచి మార్చి 31 వరకు పుష్కర పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామాయణ మహాక్రతువు ఉత్సవాలను జరపనున్నారు. మార్చి 22న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్కర పట్టాభిషేకం క్రతువుకు అంకురార్పణ జరగనుంది. 26న ఉత్సవమూర్తులకు విశేష స్నపనం, బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం, 27న గరుడ ధ్వజపట భద్రక మండల లేఖనం, గరుడాధివాసం, 28న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, 29న ఎదుర్కోలు ఉత్సవం, గరుడ వాహన సేవలను జరుపుతారు. 30న శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం, శ్రీరామపునర్వసు దీక్షా ప్రారంభం, చంద్రప్రభ వాహనసేవ, 31న పుష్కర పట్టాభిషేక మహోత్సవం, శ్రీరామాయణ మహాక్రతువు పూర్ణాహుతి, రథోత్సవం ఉంటాయి. ఏప్రిల్ 5న చక్రతీర్థం, పూర్ణాహుతి, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణ, శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. కాగా, బ్రహ్మోత్సవాల సమయాన రోజువారీ ప్రత్యేక పూజలు నిలిపివేయనున్నారు.

ఈ ఏడాది పుష్కర పట్టాభిషేకం

భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంతోపాటు మరుసటి రోజే జరిగే రామయ్య పట్టాభిషేకానికి ఎంతో విశిష్టత ఉంది. రాముడికి భద్రాచలంలో ప్రతీ 60 ఏళ్లకు ఒక్కసారి మహాసామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది. ఈ పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో 1927, 1987ల్లో జరగగా, మళ్లీ 2047లో మాత్రమే కళ్లారా చూసేందుకు అవకాశముంది. ఇది కాకుండా ప్రతీ 12 ఏళ్లకోసారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం జరుపుతారు. 1999, 2011లో ఈ పుష్కర పట్టాభిషేకం నిర్వహించగా, ఈ ఏడాది మార్చి 31న జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు, వైదిక కమిటీ బాధ్యులు స్వామివారి వాహన సేవలకుగాను నూతన వాహనాలను తయారు చేయిస్తున్నారు.



గోపూజ చేస్తున్న చినజీయర్‌స్వామి

వైభవంగా వసంతోత్సవం

శంషాబాద్ రూరల్: సమతా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా శ్రీరామనగరంలో సోమవారం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో పెరుమాళ్లకు తిరుమంజనం చేయడమే వసంతోత్సవమని చినజీయర్‌స్వామి తెలిపారు. భక్తులందరూ హోలీ పండగలా ఈ ఉత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మైహోం గ్రూపు చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు మనుమరాలు ఈద్య నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

అదానీపై ప్రధాని మౌనమేల?: కవిత



సాక్షి, హైదరాబాద్: అదానీ సంస్థలపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. ఆమె సోమవారం శాసనమండలి ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. అదానీతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ వంటి సంస్థల షేర్ల విలువ గత నెల 23వ తేదీ నుంచి భారీగా పతనం కావడంతో సామాన్యులకు తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. రూ.3,600గా ఉన్న అదానీ సంస్థ షేర్ విలువ ప్రస్తుతం రూ.1,400కు పడిపోయిందని పేర్కొన్నారు. సుమారు రూ.10 లక్షల కోట్ల మేర దేశ ప్రజల సంపద ఆవిరైపోయినా.. అంతా బాగుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంపై కవిత విస్మయం వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీ బడ్జెట్ దేశాన్ని నిరుత్సాహ పరిచేలా ఉంటే కేసీఆర్ బడ్జెట్ మాత్రం దేశానికి స్ఫూర్తినిస్తోందన్నారు.

పేదలకు న్యాయం మరింత చేరువ

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్
- 16 జిల్లాల్లో న్యాయ సహాయ కేంద్రాల ప్రారంభం



మాట్లాడుతున్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం జైళ్లలో ఉన్న అండర్ ట్రయల్ ఖైదీల్లో నిరుపేద అట్టడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువ ఉన్నారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వారికి న్యాయ సేవా కేంద్రాలు ఎంతో తోడ్పాటునిస్తాయని చెప్పారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ (ఎల్ఏడీసీఎస్) కేంద్రాల ఏర్పాటుతో పేదలకు న్యాయం మరింత చేరువవుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి 16 జిల్లాల్లో ప్రారంభిస్తున్నా.. భవిష్యత్‌లో ఇతర జిల్లాల్లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావు.. సోమవారం 16 జిల్లాల్లో ఎల్ఏడీసీఎస్ కేంద్రాలను వర్చువల్‌గా ప్రారంభించారు. న్యాయసాయం కావాల్సిన వారి కోసం ఈ కేంద్రాలు సేవలు అందించనున్నాయి. దీని కోసం 14 మంది చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిళ్ల(న్యాయవాది)ను, 14 మంది డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిళ్లను, 20 మంది అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిళ్లను ఆ కేంద్రాల్లో నియమించారు. ఆదిలాబాద్, కరీంనగర్, భద్రాద్రి–కొత్తగూడెం, హనుమకొండ, జనగాం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట్, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి–భువనగిరి జిల్లాల్లో ఈ కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

మోదీని తిట్టకుంటే ఆ కుటుంబానికి పూటగడవట్లేదు

- దుబ్బాక, హుజూరాబాద్‌లో ఓడినందుకే కేటీఆర్ సీఎం కాలేదు
- తెలంగాణ బడ్జెట్‌లో సాహిత్యం ఎక్కువైంది... సమాచారం తక్కువైంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిరోజూ, ప్రతి గంట.. కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించకుంటే కల్వకుంట్ల కుటుంబానికి పూట గడవట్లేదని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రంపై బురద జల్లుతూ, వైఫల్యాల నుంచి తప్పించుకొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ చదివిన వేల పుస్తకాల్లోని భాషా జ్ఞానాన్ని తాజా బడ్జెట్ లో కూర్చారన్న కిషన్ రెడ్డి.. ఈ బడ్జెట్‌లో 'సాహిత్యం ఎక్కువైంది. సమాచారం తక్కువైంది. కుటుంబ సందేశమే ఆవిష్కృతమైంది'అని వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఒక జిమ్మిక్కు అని ఎద్దేవా చేశారు. ఫాంహౌజ్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఉన్నవన్నీ అబద్ధాలు, అమలుకాని వాగ్దానాలు, అవాస్తవ గణాంకాలని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రకటనలు, ప్రచారానికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లను కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కల్వకుంట్ల కుటుంబం బడ్జెట్ లెక్కలు వేరుగా ఉంటాయనీ. తమ కుటుంబం కోసమే తెలంగాణ వచ్చిందన్న విధంగా ఆ కుటుంబం వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఎంగా కేసీఆర్‌ను తొలగించి కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలనుకున్నప్పటికీ.. దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో సీఎం కాలేదని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల జాతి రత్నాలు ఎలా అయ్యారో ముందు తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు

▶ మొదటి పేజీ తరువాయి

ఇన్నోవేషన్ క్లస్టర్ అభివృద్ధి చేస్తున్నాం'అని కేటీఆర్ తెలిపారు.

త్వరలో రూ. 3 వేల కోట్ల పెట్టుబడులపై ప్రకటన



తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ తదితరులు

రాష్ట్రానికి త్వరలో రూ.3 కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయని, రెండు వారాల్లో వివరాలు ప్రకటిస్తామని కేటీఆర్ చెప్పారు. ఈ పెట్టుబడులు తెలంగాణలో ఎలక్ట్రిక్ 2–వీలర్, 3–వీలర్, చార్జింగ్ పరికరాల తయారీ ఎకో సిస్టమ్స్‌ను మరింత బలోపేతం చేస్తాయన్నారు. 'అడ్వాన్స్‌డ్ సెల్ కెమిస్ట్రీ, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్, ఆటో ఇంజనీరింగ్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఆయా కంపెనీల కార్యకలాపాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ మొబిలిటీ వ్యాలీ పనిచేస్తుంది'అని తెలిపారు. ఈ రంగంలోని నిపుణులు, గ్లోబల్ ఆటోమోటివ్ ఎకోసిస్టమ్ భాగస్వాములను ఒకచోట చేర్చేందుకు హైదరాబాద్ ఈ–మొబిలిటీవీక్‌ను క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మూడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీటిలో తెలంగాణ ప్రభుత్వంతో ఏటీఎస్–టీయూవీ రైన్‌ల్యాండ్, బిట్స్ హైదరాబాద్‌తో బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, షెల్‌తో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)లు కుదుర్చుకున్న ఒప్పందాలున్నాయి. అపోలో టైర్స్ లిమిటెడ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ హిజ్మీ హాసెన్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఆటోమోటివ్ పరిశ్రమకు ప్రాధాన్యత నిస్తూ ఈ–మొబిలిటీ వీక్ నిర్వహించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో వోక్స్‌వ్యాగన్ గ్రూప్ ఇండియా, సేల్స్, మార్కెటింగ్ అండ్ డిజిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిస్టియన్ వాన్ సీలెన్, వోల్వో గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ కమల్ బాలి, ఉబర్ ఇండియా, సౌత్ ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టాస్క్ తెలంగాణ సీఈఓ శ్రీకాంత్ సిన్హా పాల్గొన్నారు.

బిట్స్‌పిలానీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

రాష్ట్ర ప్రభుత్వంతో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీ ఒప్పందం చేసుకుంది. నూతన మొబిలిటీలో అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలను అన్వేషించడంలో ముందుండాలనే ప్రభుత్వ ప్రయత్నాలకు తోడ్పాటునందించడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని ఆ సంస్థ తెలిపింది. నూతన మొబిలిటీ కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను బిట్స్‌పిలానీ, హైదరాబాద్ క్యాంపస్‌లో ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొంది.

నర్సులపై చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా

సినీ నటుడు నందమూరి బాలకృష్ణ




సాక్షి, అమరావతి: నర్సుల గురించి తాను చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. నర్సుల మనోభావాలు దెబ్బతీస్తే పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నానని సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. నర్సులను తాను కించపరిచినట్లు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, తన మాటల్ని వక్రీకరించారని పేర్కొన్నారు. రోగులకు సేవలందించే సోదరీమణులంటే తనకెంతో గౌరవమని, బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో నర్సుల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. రాత్రింబవళ్లు రోగులకు సపర్యలు చేసి ప్రాణాలు నిలిపే తన సోదరీమణులంటే తనకు గౌరవమని, వారికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువేనన్నారు.

ఎమ్మెల్సీ నివాసంలో ముగిసిన ఐటీ సోదాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ్ పుష్ప లైఫ్ స్టైల్ సిటీలోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి నివాసంలో వారం రోజులుగా ఐటీ అధికారులు నిర్వహించిన సోదాలు సోమవారం ముగిశాయి. సోమవారం ఐటీ అధికారులు పలు పత్రాలను తీసుకెళ్లినట్లు సమాచారం.

టీచర్ల బదిలీలకు బ్రేక్

- నేడు ఇవ్వాల్సిన బదిలీ జాబితా నిలిపివేత
- కోర్టు తీర్పు మేరకు షెడ్యూల్ రద్దు
- అప్పీలుకు వెళ్తే మేలా... అని విద్యాశాఖ ఆలోచన
- 25 వేల మందికి బదిలీ అవకాశం కష్టమే
- సాఫ్ట్‌వేర్‌లో మార్పులు... రీ షెడ్యూల్‌కు 2 నెలలు



సాక్షి, హైదరాబాద్ : కోర్టు తీర్పుతో టీచర్ల బదిలీ ప్రక్రియకు మళ్లీ బ్రేక్ పడింది. సగం వరకూ వచ్చిన షెడ్యూల్‌ను మధ్యలోనే నిలిపివేయాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విడుదల చేయాల్సిన సీనియారిటీ జాబితాను తక్షణమే నిలిపివేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన సోమవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

- 317 జీవో ద్వారా కొత్త జిల్లాలకు వెళ్ళిన టీచర్లకు బదిలీ అవకాశం లేకుండా, రెండేళ్ళ కనీస సర్వీసు నిబంధన పెడుతూ విద్యాశాఖ ఇటీవల జీవో ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ కొంత మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇవ్వడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి 11 గంటల వరకూ చర్చలు జరిపారు. విషయాన్ని ప్రభుత్వానికి చేరవేయడంతో బదిలీ ప్రక్రియ నిలిపివేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విద్యాశాఖ అధికారులకు చెప్పినట్టు తెలిసింది. దీంతో మంగళవారం విడుదల చేయాల్సిన బదిలీ జాబితాను నిలిపివేయాలని విద్యాశాఖ నిర్ణయించినట్టు సమాచారం. కోర్టు తీర్పు తుది కాపీ ఇంకా అందలేదని, మంగళవారం కాపీ వచ్చిన తర్వాత తీర్పుపై అప్పీలుకు వెళ్ళడమా? తీర్పును అమలు చేయడమా? అనేది ఆలోచిస్తామని పాఠశాల విద్య ఉన్నతాధికారి తెలిపారు.

ఈ ఏడాదికి బదిలీలు లేనట్టే!

కోర్టు తీర్పు ప్రకారం కొత్త జిల్లాలకు వెళ్ళిన టీచర్లకు బదిలీ అవకాశం ఇవ్వడం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదని అధికారులు అంటున్నారు. బదిలీ అవకాశం లేని టీచర్లు దాదాపు 25 వేల మంది ఉంటారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా వెళ్ళాలంటే మళ్ళీ కొత్తగా షెడ్యూల్ ఇవ్వాల్సి ఉంటుంది. బదిలీ ప్రక్రియకు అనుసరించే సాఫ్ట్‌వేర్ మొత్తం మార్చాల్సిన అవసరం ఏర్పడుతుంది. 317 జీవో ప్రకారం వెళ్ళిన టీచర్ల ఉమ్మడి జిల్లాలోని సీనియారిటీ మళ్ళీ లెక్కగట్టాలి. ఈ ప్రక్రియకు కనీసం రెండు నెలల సమయం పడుతుందని భావిస్తున్నారు.

- బదిలీల ప్రక్రియ గత నెల 28న మొదలైంది. దాదాపు 59 వేల మంది టీచర్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీళ్ళలో ఎవరైనా కోర్టుకు వెళ్ళినా సమస్య మళ్ళీ జటిలమయ్యే అవకాశం కల్పిస్తోంది. అలా కాకుండా అంతా సవ్యంగా సాగినా... రెండు నెలలు పడుతుంది. ఈ లోగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వీలుంది. ఈ సమయంలో బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి బదిలీల వ్యవహారం ఈ ఏడాది ఉండకపోవచ్చనే వాదన విన్పిస్తోంది.

ఉమ్మడి జిల్లాల సర్వీస్‌కూ పాయింట్లు ఇవ్వండి

టీచర్ల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కొత్త జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులకు ఉమ్మడి జిల్లాల్లో సర్వీసుకూ పాయింట్లు కేటాయించి బదిలీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయవాది జస్టిస్ కె.శరత్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాల్లో పనిచేసిన సర్వీసు పాయింట్లను జిల్లాల విభజన నేపథ్యంలో కొత్త జిల్లాలకు బదిలీలకు కేటాయించాలని ఆదేశించారు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో జీవో 317 ప్రకారం కొత్త జిల్లాలకు కేటాయించిన టీచర్లకు ఈ ఆదేశాలను పాటించాలన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పనిచేసిన తమ సర్వీసు పాయింట్లను బదిలీల్లో పరిగణనలోకి తీసుకోవడం లేదంటూ 50 మందికిపైగా ఉపాధ్యాయులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. 317 జీవో ప్రకారం కొత్త జిల్లాలకు కేటాయించిన వాళ్లకు రెండేళ్ల సర్వీస్ నిబంధనతో తాము నష్టపోతున్నామన్నారు. బదిలీలకు సంబంధించిన జీవో 5లోని నిబంధన 5(3) మేరకు రెండేళ్ల సర్వీస్ పూర్తి బదిలీకి అర్హులనే నిబంధనను రద్దు చేయాలని కోరారు. ఇది పాత జిల్లాల్లో పనిచేస్తున్న వాళ్లకే ప్రయోజనం కలిగించేదిగా ఉందన్నారు. దీనిలో వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉమ్మడి జిల్లాలోని పాయింట్లను కూడా వర్తింపజేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వాయిదా వేశారు.

ఏపీ అప్‌డేట్స్



మీనాక్షిని అభినందిస్తున్న సీఎం జగన్



మాలవీయకు వైఎస్ జగన్ అభినందన

చెస్ క్రీడాకారిణి మీనాక్షికి ఏపీ సీఎం అభినందన

కెరీర్‌ను కొనసాగించేందుకు కార్పస్‌గా రూ. కోటి నిధిని ప్రకటించిన ఏపీ ముఖ్యమంత్రి జగన్

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో ఏపీ పేరుప్రఖ్యాతలు నిలబెట్టేలా విశాఖకు చెందిన చెస్ క్రీడాకారిణి కోలగట్ల మీనాక్షి మరింతగా రాణించాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లలో పలు పతకాలు సాధించిన మీనాక్షి.. ఇటీవల ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2023ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను మీనాక్షి, ఆమె తల్లిదండ్రులు మధు, అపర్ణ కలిశారు. మీనాక్షిని సీఎం అభినందించారు. క్రీడాకారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విశాఖలో వెయ్యి చదరపు గజాల ఇంటి స్థలం, చెస్‌లో కెరీర్‌ను కొనసాగించేందుకు కార్పస్‌గా రూ.కోటి నిధిని ప్రకటించారు.

మహిళల భద్రతలో ఏపీ ఆదర్శం: ఆశా మాలవీయ

సాక్షి, అమరావతి: మహిళా సాధికారతపై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టిన ప్రముఖ పర్వతారోహకురాలు, మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన ఆశా మాలవీయ సోమవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఆశా మాలవీయకు రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించిన సీఎం జగన్ ఆమె లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి దేశానికే ఆదర్శనీయమని పేర్కొన్నారు. 'ఏపీలో మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చెక్ చేశా. దిశ యాప్ ఎంతో గొప్పగా పనిచేస్తోంది. ఏపీలో మహిళలు మాత్రమే కాకుండా అందరూ సురక్షితంగా ఉన్నారు'అని పేర్కొన్నారు.

ఆలయాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులు

ఏపీ దేవాదాయ శాఖ పరిధిలో 610 దేవాదాయాల్లో అవకాశం

సాక్షి, అమరావతి: దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ఆలయాల్లో పలు కార్యక్రమాల్లో సేవలందించే తమకు పాలక వర్గాల్లో చోటు కల్పించాలని నాయీ బ్రాహ్మణులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో దీనిపై సానుకూల హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బీసీ గర్జన సభలలోనూ దీనిపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తెచ్చి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. హైకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ప్రకారం దేవాదాయ శాఖ పరిధిలో ఐదు లక్షలకు పైబడి ఆదాయం సమకూరే ఆలయాల్లో మాత్రమే దేవదాయ శాఖ ట్రస్టు బోర్డులను నియమించే అవకాశం ఉంది. రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో రూ.ఐదు లక్షల పైబడి వార్షికాదాయం ఉన్న ఆలయాలు 1,234 వరకు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ట్రస్టు బోర్డు నియామకాలు పూర్తైన వాటిని మినహాయిస్తే మరో 610 ఆలయాలకు కొత్తగా ట్రస్టు బోర్డులను నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. వీటిల్లో ప్రతి ఆలయానికి ఒకరి చొప్పున నాయీ బ్రాహ్మణులకు ట్రస్టు బోర్డులో స్థానం కల్పించే అవకాశం ఉంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.